అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
ఆదివారం 09-03-2025
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 11 సంచిక : 17
Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam
12 పేజీలు + వెబ్‌లో (సోపతి) వెల : 8.00



దక్షిణాదిపై కేంద్రం కక్ష

ఇక మోడీ సర్కార్‌పై యుద్ధమే

- అన్ని పార్టీలను కలుపుకుని పోరాడుదాం
- పెండింగ్ సమస్యలపై పార్లమెంటులో వాయిదా తీర్మానమిద్దాం
- అఖిల పక్ష ఎంపీల సమావేశంలో నిర్ణయం
- వివరాలు వెల్లడించిన డిప్యూటీ సీఎం భట్టి
- కాంగ్రెస్, ఎంఐఎం ఎంపీలు హాజరు
- బీజేపీ, బీఆర్ఎస్ డుమ్మా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"తెలంగాణపై కేంద్రంలోని బీజేపీ సర్కార్ వివక్ష చూపిస్తోంది. అభివృద్ధి ప్రాజెక్టుల అనుమతులు మొదలుకుని నిధుల కేటాయింపుల వరకు అడుగడుగునా మనకు అన్యాయం జరుగుతోంది. రాష్ట్ర విభజన హామీలను సైతం కేంద్రం తుంగలో తొక్కింది. ఆస్తుల పంపకం, నీటి కేటాయింపుల విషయంలో పక్షపాతం చూపిస్తోంది. రాష్ట్రంపై మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ తీరుకు నిరసనగా పార్లమెంట్‌లో గళం విప్పాలి" అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో శనివారం జరిగిన ఎంపీల సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని అన్ని పార్టీల ఎంపీలను ఆహ్వానించగా... కాంగ్రెస్, ఎంఐఎం ఎంపీలు మాత్రమే హాజరయ్యారు. బీజేపీ, బీఆర్ఎస్ ఎంపీలు డుమ్మా కొట్టారు. అనంతరం సమావేశ నిర్ణయాలను భట్టి మీడియాకు వివరించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హామీలపై చర్చించి 28 అంశాలపై ప్రతిపాదనలు రూపొందించామని తెలిపారు. పార్లమెంట్‌లో ఏయే అంశాలను లేవనెత్తాలనే విషయాలపై చర్చించి విపులంగా బుక్‌లెట్ తయారు చేసినట్టు వివరించారు. సమావేశంలో పాల్గొన్న ఎంపీలకు అంశాల వారీగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించినట్టు తెలిపారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో పదేండ్లుగా బీఆర్ఎస్ నిర్లక్ష్యంగా వ్యవహరించిందనీ, ఏడాదిగా తాము తీవ్రంగా ప్రయత్నిస్తున్నామని చెప్పారు. అయినా మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన సహా అనేక ప్రాజెక్టులకు కేంద్రం సహకారం అందించడం లేదని వాపోయారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్లమెంట్ సమావేశాల్లో వాయిదా తీర్మానం ఇచ్చే అవకాశాలను ఎంపీలకు వివరించామని పేర్కొన్నారు. సమావేశానికి రాని ఎంపీలకు కూడా బుక్‌లెట్ అందిస్తామని తెలిపారు. వివిధ కారణాల వల్ల సమావేశానికి రాలేకపోయామని బీజేపీ ఎంపీలు చెప్పారనీ, అవసరమైతే మరోసారి భేటీ నిర్వహించేందుకైనా తాము సిద్ధమేనని స్పష్టం చేశారు. రాష్ట్ర హక్కుల కోసం ...11లో

సమావేశానికి కమలం, గులాబీ దూరం

ఈ సమావేశానికి బీజేపీ, బీఆర్ఎస్ ఎంపీలు డుమ్మా కొట్టారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లతో పాటు రాష్ట్రానికి సంబంధించిన ఎంపీలందరికీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శుక్రవారం స్వయంగా ఫోన్ చేసి సమావేశానికి ఆహ్వానించారు. తమకు ఆహ్వానం ఆలస్యంగా అందిందనీ, పార్టీ కార్యక్రమాల కారణంగా ఎంపీల సమావేశానికి హాజరుకాలేమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి భట్టికి లేఖ రాశారు. భవిష్యత్‌లో ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తే.. ముందుగానే తెలియజేయాలని లేఖలో కోరారు. బీఆర్ఎస్ నుంచి మాత్రం ఇప్పటి వరకు అధికారికంగా ఎవరూ స్పందించలేదు.

మహిళా సంఘాలకు మండల కేంద్రాల్లో

రైస్ మిల్లులు, గోడౌన్లు

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

- 15 ఏండ్లకే సంఘాల్లో సభ్యత్వం
- 65 ఏండ్ల వరకు పొడిగింపు
- ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుస్తాం
- నా నమ్మకం, విశ్వాసం మహిళలే
- ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'నా నమ్మకం, విశ్వాసం మహిళలే. వారికి అండగా ఉంటాం. వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతాం. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసి ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయటమే తమ ప్రభుత్వ లక్ష్యం. ఆ నమ్మకంతోనే రాష్ట్రాన్ని ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుస్తానని చెబుతున్నా' అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చెప్పారు. ఐకేపీ కేంద్రాల నుంచి సేకరించిన ధాన్యాన్ని కొందరు రైస్‌మిల్లర్లు పందికొక్కుల్లా మెక్కుతున్నారనీ, రాష్ట్ర ప్రభుత్వానికి సకాలంలో ఇవ్వడం లేదని విమర్శించారు. ఆ బాధ నుంచి విముక్తి పొందేందుకు ప్రతి మండల కేంద్రంలోనూ ఓ రైస్‌మిల్లును, గోడౌన్‌లను మహిళా సంఘాలతో కట్టించి నిర్వహణ బాధ్యతను అప్పగిస్తామని ప్రకటించారు. మహిళా సంఘాలు మిల్లింగ్ చేసి ఆ బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు. పాఠశాలలు, కాలేజీలు, హాస్టళ్లకు చేసే ఆహార సరఫరాను కూడా మహిళా సంఘాలకే అప్పగించనున్నట్టు ప్రకటించారు. అందుకోసం విధి, విధానాలు రూపొందించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఇందిరా మహిళాశక్తి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు చెందిన 150 ఆర్టీసీ అద్దె బస్సులకు మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి పూజ చేశారు. అనంతరం బస్సులను జెండా ఊపి ప్రారంభించారు.

అనంతరం సభా ప్రాంగణంలో మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన సోలార్, ఫుడ్, కుట్టుమిషన్ స్టాళ్లను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, జూపల్లి, తదితరులతో కలిసి సీఎం పరిశీలించారు. సభ్యులను ఆయా స్టాళ్ల గురించి అడిగి వివరాలు తెలుసుకున్నారు. మహిళా సంఘాలకు కేటాయించిన సోలార్ ప్లాంట్లను వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. అనంతరం సభలో స్వయం సహాయక సంఘాలకు రూ.22,794.22 కోట్ల ఇందిరా శక్తి చెక్కును ఆవిష్కరించారు. బీమా, ప్రమాద బీమాకు సంబంధించి రూ.44.80 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పదేండ్ల పాటు మహిళలకు పట్టిన చంద్రగహణం వీడిందన్నారు. డ్వాక్రా గురించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కసారి కూడా ఆలోచించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 15 నెలల్లో తమ ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రజాపాలన తెచ్చిన మార్పు స్పష్టంగా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలు స్వేచ్ఛ, ఆత్మగౌరవాన్ని అనుభవిస్తున్నారనీ, తమ గళం వినిపిస్తున్నారని చెప్పారు. గతంలో వివక్షను ఎదుర్కొన్న మహిళ నేడు తలెత్తుకుని రాజధానిలో నిలబడిందన్నారు.

ఇందిరమ్మ రాజ్యం వచ్చాక మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామన్నారు. వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణ, రెసిడెన్షియల్ స్కూళ్ల విద్యార్థుల యూనిఫాంలు కుట్టే పని వారికి అప్పగించినట్టు తెలిపారు. ఇప్పటి వరకు 1.30 కోట్ల యూనిఫాంలను మహిళా సంఘాలు అందించాయని తెలిపారు. గతంలో రూ.25గా ఉన్న కుట్టుకూలిని రూ.75కు పెంచిన విషయాన్ని ...11లో

అంతర్జాతీయ యూనివర్సిటీలతో పోటీపడాలి 11లో..

- చదువులో రాణించాలి
- వచ్చే ఎన్నికల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలు
- నాయకులుగానూ ఎదగాలి
- విద్యార్థినులకు సీఎం రేవంత్‌రెడ్డి మార్గనిర్దేశం
- వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం నూతన భవన నిర్మాణాలకు శంకుస్థాపన

పోరాడుతాం..గెలుస్తాం

- పెట్టుబడిదారీ, మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా సీపీఐ(ఎం) మహిళా మార్చ్
- మహిళా నాయకుల నినాదాల హోరు
- పాల్గొన్న సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్, సుభాషిణి అలీ, కేంద్ర కమిటీ సభ్యులు

వివరాలు 3లో..

కార్పొరేట్ సేవకుడు మోడీ



- లేబర్ కోడ్‌లను తిప్పికొట్టాలి
- వైద్య పరికరాలపై జీఎస్టీని ఎత్తేయాలి
- కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి
- మే మొదటివారంలో దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య పిలుపు
- టీఎంఎస్ఆర్‌యూ జనరల్ కౌన్సిల్ సమావేశాలు ప్రారంభం

వివరాలు 3లో..

కోతల సీఎం

మహిళలకు చేసింది ఎడతెగని వంచనే : మాజీ మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పి కోతలు కోసిన రేవంత్ రెడ్డి ఏడాదిన్నర పాలనలో మహిళలకు చేసింది ఎడతెగని వంచనే అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు మిగిలింది ఎడతెగని వేదనే అనీ, మహిళలను కనీసం లక్షాధికారులుగా చేయని చేతగాని సర్కారు కాంగ్రెస్ సర్కార్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దాదాపు ...11లో

చి'వరి' వరకు సాగునీరు

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

నిరంతరం విద్యుత్ సరఫరా
అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలి : వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



నవ తెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

వేసవిలో తాగునీరు, వరి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమన్వయంతో పని చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి, నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. శనివారం నల్లగొండ కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా తాగునీరు, ఇరిగేషన్, విద్యుత్ అంశాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా, పంటలు ఎండిపోకుండా విద్యుత్ సరఫరా నిరంతరం కొనసాగే విధంగా సంబంధిత శాఖల సీనియర్ అధికారులు మొదలుకొని కిందిస్థాయి అధికారుల వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. మిషన్ భగీరథ అధికారులు ప్రజలకు తాగునీటి ఇబ్బంది ఏర్పడకుండా దృష్టి సారించాలని చెప్పారు. తక్షణం తాగునీటి సమస్యలను తీర్చేందుకు అవసరమైతే జిల్లా కలెక్టర్ల వద్ద నిధులు ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడి వెసులుబాటు కల్పిస్తామన్నారు. సీఎంతో చర్చించి శాసనసభ్యులకు ఎస్‌డిఎఫ్ కింద నిధులు ఇచ్చేలా చూస్తామని చెప్పారు. ఆయకట్టు చివరి వరకు సాగునీరు అందించి పంటలను కాపాడాలన్నారు. ఇంజినీరింగ్, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో నీటి సరఫరాపై పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. విద్యుత్ అధికారులు విద్యుత్ సమస్యలు రాకుండా ఎల్లప్పుడూ క్షేత్రస్థాయిలోనే తిరిగి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

రూ.15 కోట్ల నిధులు ఉంచాలని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా.. శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

తక్షణం తాగునీటి అవసరాలకు జిల్లా కలెక్టర్ల వద్ద ప్రతి జిల్లాకూ కనీసం రూ.5 కోట్లు, నల్లగొండ జిల్లా విస్తీర్ణం పెద్దగా ఉన్నందున రూ.15 కోట్ల నిధులు ఉంచాలని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. అధికారులు ఎక్కడ తాగునీటి సమస్య ఉంటే అక్కడికి వెళ్లి వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఏఎంఆర్ ప్రాజెక్టు కింద కెనాల్ విస్తరణ, లైనింగ్ చేపడితే సమృద్ధిగా నీరు అందించొచ్చని, ఉదయ సముద్రం మేజర్ కెనాల్ పూర్తి చేసి చెరువులకు నీరు అందిస్తే సాగునీటి సమస్య రాదని చెప్పారు. ఈ సమావేశంలో రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల కలెక్టర్లు ఇలా త్రిపాఠి, హనుమంతరావు, తేజస్ నందలాల్ పవార్, మిషన్ భగీరథ ఈఎన్‌సి కృపాకర్ రెడ్డి, ఇరిగేషన్ ఈఎన్‌సి హరిలాల్, ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ అజయ్ కుమార్, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అడిషనల్ కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, జయవీర్‌రెడ్డి, బాలునాయక్, బత్తుల లక్ష్మారెడ్డి, ఉత్తమ్ పద్మావతి, వేముల వీరేశం, మందుల సామేల్ తదితరులు పాల్గొన్నారు.

ధీరవనితల స్ఫూర్తిని కొనసాగిస్తాం

నవతెలంగాణ-ముషీరాబాద్

మహిళా శక్తిని చాటి.. ధీరవనితల స్ఫూర్తిని కొనసాగిస్తామని తెలంగాణ మహిళా కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ బండ్రు శోభారాణి అన్నారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో శనివారం ధీరవనితోత్సవాన్ని హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో హీరోలే కాదు షీరోస్ కూడా ఉన్నారని తెలిపారు. షీరోస్ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని, ఆడ పిల్లల్లో ఆత్మస్థైర్యం పెంచుతుందని అన్నారు. మహారాజులు కాదు మహారాణులున్నారని, సామాజిక, సనాతన సంప్రదాయ కట్టుబాట్ల సంకెళ్ల బద్దలు కొట్టండని ధైర్యాన్నందించారు. రాష్ట్రంలో జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. డాక్టర్ నళిని మాట్లాడుతూ.. మహిళా బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి 28 సంవత్సరాలు పూర్తయినా ఎందుకు అమలు చేయట్లేదని ప్రశ్నించారు. ఏకాభిప్రాయం పేరుతో బిల్లును ఆపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హక్కులు ఎవరి దయతో రావని.. మహిళా శక్తి చాటితేనే వస్తాయని తెలిపారు.తెలంగాణ బాలోత్సవ అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పురుషుడే కత్తి పట్టాలి, కలం పట్టాలి, రాజ్యమేలాలి, రాజవ్వాలన్న దురాగతాలను ఎదిరించిన బెలవాడి మల్లమ్మ, రాణి రుద్రమదేవి, రాణి శంకరమ్మ వంటివారి సాహసాలను మహిళలు పునికి పుచ్చుకోవాలని సూచించారు. సావిత్రిబాయి పూలే, మల్లు స్వరాజ్యం, చిందు ఎల్లమ్మ లాంటి ధీర వనితలు, స్ఫూర్తికాంతుల స్ఫూర్తితో సాగాలని అన్నారు. బాలోత్సవం ఉపాధ్యక్షులు కె.సుజావతి మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని అన్ని జిల్లాల్లో నిర్వహిస్తామని తెలిపారు. బాలోత్సవం కమిటీ సభ్యులు అంకమ్మ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి ప్రవాస భారతీయులు శివరామకృష్ణ జాస్తి పంపిన షీరోస్ పుస్తకాలు, సర్టిఫికెట్‌లు అందజేశారు. బాలోత్సవం కార్యదర్శి ఎన్.సోమయ్య, జి.బుచ్చిరెడ్డి ఇ.మమత, నృత్య గురువులు మాధభూషిణి రమణి సిద్ధి, ఇందిరా పరాశరం, రాజేశ్వరి మాధవి శర్మ, చూడామణి తదితరులు పాల్గొన్నారు.

కూలీల వాహనం బోల్తా

నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ

మిర్చికోత పనులకు వెళ్లి వస్తున్న కూలీల వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 16 మంది కూలీలకు గాయాలు కాగా అందులో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని రాంనగర్ గ్రామ సమీపంలో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. రాంనగర్ గ్రామానికి చెందిన ఓ రైతుకు మిర్చి కోత పనులకు గాను కమలాపురం గ్రామంలో ఉంటున్న 16మంది గొత్తికోయ కూలీలు శనివారం రామన్నగూడెంలో మిర్చికోత పనులకు వెళ్లారు. సాయంత్రం వేళ కూలీలను ఇంటికి తీసుకెళ్లేందుకు స్వయంగా రైతు టాటా ఎస్ వాహనంలో ఎక్కించుకొని తీసుకెళుతున్నాడు. ఈ క్రమంలో రాంనగర్-కమలాపురం మధ్య ప్రాంతంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. వాహనంలో ఉన్న 16మంది గొత్తికోయల్లో ఐదుగురికి తీవ్ర గాయాలు కాగా మిగతా నలుగురు పరిస్థితి విషమంగా ఉంది. మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డ కూలీలను హుటాహుటిన 108లో సామాజిక ఆస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన వారిలో పోడియం మున్ని, మూచకి గగ్గి, మూచకి లక్కు, కోవాసి శాంతి, పాయం లక్ష్మీ ఉన్నారు. మూచకి బాల్‌సింగ్, మూచకి ఐతు, మూచకరి పారు పరిస్థితి విషమంగా ఉంది. మాడవెసుకుమానుకు పొట్ట తెగి అందులో నుంచి పేగులు బయటికి వచ్చాయి. వీరిని మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించారు.

వాటర్ ట్యాంకర్ ఢీకొని బీటెక్ విద్యార్థి మృతి

నవతెలంగాణ-నిజాంపేట్

స్కూటీని వాటర్ ట్యాంకర్ బలంగా ఢీకొట్టడంతో బీటెక్ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు బీటెక్ విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాచుపల్లిలో జరిగింది. బాచుపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా నసురాబాద్ మండలం బొప్పాసుపల్లి గ్రామానికి చెందిన కేతావత్ నాను(21), అతని స్నేహితులు విశ్వనాథ్, కార్తీక్ బాచుపల్లిలోని వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి కళాశాలలో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నారు. శనివారం ఉదయం 7 గంటల సమయంలో ముగ్గురు కలిసి నగరంలోని బిర్లా మందిర్‌కు వెళ్లడానికి ప్రగతినగర్ సిగ్నల్ వద్ద హాస్టల్ నుంచి స్కూటీపై బయలుదేరారు. ప్రగతినగర్ కమాన్ సిగ్నల్‌కు సుమారు 100 మీటర్లకు ముందే వీరు వెళ్తున్న స్కూటీని వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన వాటర్ ట్యాంకర్ బలంగా ఢీకొట్టింది.

'ఆమె'కు మద్దతుగా ఉందాం

నారీశక్తికి వందనం | స్త్రీలు సమాజానికి వెన్నెముక

భారత రాష్ట్రపతి, ప్రధాని, ప్రతిపక్ష నేతల నుంచి శుభాకాంక్షల వెల్లువ



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రముఖుల అభినందనలు

న్యూఢిల్లీ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా పలువురు కేంద్ర మంత్రులు, ప్రముఖులు దేశంలోని మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు సాధించిన విజయాలు, ఘనతలు, సమాజంలో వారి భాగస్వామ్యాన్ని వివరించారు.

లింగ సమానత్వ ప్రపంచాన్ని తయారు చేద్దాం : ద్రౌపది ముర్ము

లింగ సమానత్వం, సాధికారత కోసం సమిష్టి ప్రయత్నాలకు రాష్ట్రపతి పిలుపునిచ్చారు. "అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు. మహిళలు సాధించిన విజయాలను మనం సెలబ్రేట్ చేసుకుంటాం. మహిళా హక్కులు, సమానత్వం, సాధికారత లక్ష్యాన్ని బలోపేతం చేయటానికి సమిష్టి ప్రయత్నాలు చేయాలని కూడా మనం నిర్ణయించుకుందాం. మన సోదరీమణులు, కుమార్తెలు సరిహద్దులను చెరిపేసి సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకెళ్తు ఉన్నత స్థానాలను అధిగమిస్తున్నారు. ఈ ప్రయాణంలో వారికి మద్దతిద్దామని మనం ప్రమాణం చేద్దాం. మహిళలు, బాలికలు భయం లేకుండా తమ కలలను కొనసాగించే లింగ-సమానత్వ ప్రపంచాన్ని మనం తయారు చేద్దాం" అని ఎక్స్‌లో ద్రౌపది ముర్ము రాసుకొచ్చారు.

మహిళా సాధికారత కోసమే మా ప్రభుత్వం : మోడీ

ప్రధాని మోడీ నారీశక్తికి వందనం అంటూ మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. వారి శక్తిని, తోడ్పాటును గుర్తిస్తూ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాలకు చెందిన మహిళలు తన సోషల్ మీడియా ఖాతాలను నిర్వహిస్తారని వివరించారు. "మహిళా దినోత్సవం సందర్భంగా నారీ శక్తికి వందనం. మహిళల సాధికారత కోసమే మా ప్రభుత్వం ఎల్లప్పుడూ పని చేస్తోంది. ఇది మా పథకాలు, కార్యక్రమాల్లో ప్రతిబింబిస్తుంది" అని వివరించారు. అలాగే, గుజరాత్‌లోని నవసారిలో లఖ్‌పతి దీదీలతో ఆయన సంభాషించారు. భారత అభివృద్ధిలో మహిళల చారిత్రక పాత్రను కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా గుర్తు చేశారు. మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రగతి, విజయం కోసం శతాబ్దాలుగా నారీశక్తి నాగరికతకు సాధికారతను కల్పించిందని వివరించారు.

మీతో.. మీ తరపున నిలబడతా : రాహుల్

మహిళలు సమాజానికి వెన్నెముక అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన సందేశంలో తెలిపారు. వారి అభివృద్ధికి అడ్డంకులు తొలగించే విషయంలో తన నిబద్ధతను రాహుల్ పునరుద్ఘాటించారు. "మహిళలు మన సమాజానికి బ్యాక్‌బోన్. వారి బలం, గొంతు మన దేశ భవిష్యత్తును రూపొందిస్తాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నేను మీతో, మీ తరపున నిలబడతాను" అని రాహుల్ ఎక్స్‌లో రాసుకొచ్చారు.



స్త్రీ సమానత్వం కోసం పోరాటం చేద్దాం

గౌరవంగా జీవించటం మా హక్కు అని నినదిద్దాం : అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో మల్లు లక్ష్మి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

స్త్రీ సమానత్వం కోసం పోరాటం చేద్దామని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. ఆ సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో ఐద్వా అధ్యక్షురాలు ఆర్ అరుణజ్యోతి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 'గౌరవంగా జీవించటం మా హక్కు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో హైదరాబాద్‌సిటీ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ పల్లె పద్మ, ఐద్వా ఉపాధ్యక్షులు టి జ్యోతి, హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి శశికళ, మేడ్చల్ జిల్లా కార్యదర్శి వినోద, సెంట్రల్ సిటీ నాయకురాలు పద్మ మాట్లాడారు. మల్లు లక్ష్మి ప్రసంగిస్తూ పాలకుల విధానాల ఫలితంగా దేశవ్యాప్తంగా మహిళలపట్ల తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. హక్కుల కోసం జరిగే పోరాటాలను అణిచివేస్తున్నారని చెప్పారు. సమాజంలో మహిళలు, బాలికలపై అనేక రకాల దౌర్జన్యాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు మహిళలను ఓట్లు వేసే యంత్రాలుగా ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. మహిళలకు అనుకూలంగా మాట్లాడి, చేతల్లో మొండి చేయి చూపటమేంటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఇందుకు ఉదాహరణ అని గుర్తు చేశారు. విద్య, వైద్యం అందని ద్రాక్షగా మారిందన్నారు. సరైన పౌష్టికాహారం లేక లక్షలాది మంది మహిళలు రక్త హీనతతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్‌స్పెక్టర్ పద్మ మాట్లాడుతూ మహిళా సమస్యలను పరిష్కరించేందుకు పోలీసు శాఖ నిరంతర కృషి చేస్తోందని చెప్పారు. అయితే.. మహిళలు కొన్ని విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. ఇంటి నుంచే పిల్లలకు సమాజం, విలువలు, ఒకరినొకరు గౌరవించుకునే లక్షణాన్ని పెంపొందించాలని చెప్పారు. టి జ్యోతి మాట్లాడుతూ మహిళల సాధికారత సాధనలో సమానత్వం పునాది అనే విషయాన్ని ఈ దినోత్సవం మరోసారి గుర్తుచేస్తోందన్నారు. అయితే ఇప్పటికీ స్త్రీ సమాజంలో రెండో తరగతి పౌరురాలుగానే పరిగణించబడుతోందని చెప్పారు. పనిలోనూ, వేతనాల్లోనూ వివక్ష కొనసాగుతోందని వాపోయారు. పనికి తగ్గ గౌరవం, కూలి దొరకటం లేదన్నారు. మరో పక్క పని ప్రదేశాల్లో దాడులు, దౌర్జన్యాలు జరిగినా వ్యవస్థలు బాధితుల పక్షాన ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుల విధానాల ఫలితంగా సమాజంలో అవిద్య నిరుద్యోగం, దరిద్రం పెరిగిందనీ, దీంతో హింస రేటు పెరుగుతోందని చెప్పారు.

మౌలిక వసతులు కల్పించాల్సింది ప్రభుత్వమే

ప్రజా సమస్యలపై సర్వే : వనపర్తి పర్యటనలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



నవతెలంగాణ -వనపర్తి రూరల్

ప్రజలకు మౌలిక వసతులను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది, అధికారులదేనని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని హరిజనవాడ, గాంధీనగర్‌లో శనివారం ప్రజాసమస్యలపై సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో జాన్‌వెస్లీ మాట్లా డుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సమస్యలపై ఆందోళనలు, సర్వే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రజల సమస్యలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా మన్నారు. అందరికీ గ్యాస్ సబ్సిడీ రావడం లేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని, మహిళలకు నెలకు రూ.2500 ఇవ్వాలని, వృద్ధులకు రూ.4000 పింఛన్ ఇవ్వాలని అన్నారు.

రేషన్ కార్డులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పర్యటనలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జబ్బర్, ఏ.లక్ష్మి, మండ్ల రాజు, పట్టణ కార్యదర్శి పరమేశ్వర చారి, నాయకులు గంధం మదన్, జి.బాలస్వామి, గంధం గట్టయ్య, నందిమల్ల రాములు, శ్రీను, జి.బాలరాజు, రాబర్ట్, మన్యం, సాయి లీల, కవిత, రేణుక, ఉమా, మద్దిలేటి పాల్గొన్నారు.

భావజాలరంగంలో వాస్తవాలను ప్రజలకు వివరించాలి

- కార్పొరేట్ దోపిడీ అర్థం కాకుండా భావోద్వేగాలను రెచ్చగొడుతున్న బీజేపీ : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భావజాల రంగంలో వాస్తవాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. భావజాల రంగంలో ముంచుకొస్తున్న ప్రమాదాన్ని ప్రజలకు వివరించేందుకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆ పార్టీ సీనియర్ నాయకులు జి రాములు అధ్యక్షతన హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కట్టబెట్టేందుకు పూనుకుంటున్నదని విమర్శించారు. కార్పొరేట్ దోపిడీ ప్రజలకు అర్థం కాకుండా ఉండేందుకు భావోద్వేగాలను రెచ్చగొట్టి ప్రజల మధ్య చీలికలు తీసుకొచ్చేందుకు బీజేపీ పూనుకుంటున్నదని అన్నారు. ఈ వాస్తవాలతోపాటు కార్పొరేట్ దోపిడీ ప్రజలకర్థమయ్యే విధంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. మైనార్టీలకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టి వారు పబ్బం గడుపుకుంటున్నారని అన్నారు.

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు ఎంవిఎస్ శర్మ మాట్లాడుతూ మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ప్రజానీకంలో పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టి లౌకిక శక్తులను విశాల ప్రాతిపదికన సమీకరించాలని చెప్పారు. రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జిల్లా, మండల స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. రాజ్యాంగ హక్కులను పరిరక్షించుకునేందుకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల జీవనోపాధిని కుంగదీస్తున్న ఆర్థిక సమస్యల మీద పోరాటం చేస్తూనే ప్రజల్లో చీలికలు తీసుకొచ్చే విభజన, విద్వేష విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. దళితులు, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ఉద్యమించాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. లౌకిక, అభ్యుదయ తాత్విక భావాలను సంస్కరణ ఉద్యమ నేతల జీవితాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి సాగర్, ఎండి అబ్బాస్, ఎండి జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

పోరాడుతాం... గెలుస్తాం

పెట్టుబడిదారీ, మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా సీపీఐ(ఎం) మహిళా మార్చ్

- మహిళా నాయకుల నినాదాల హోరు
- పాల్గొన్న సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్, సుభాషిణి అలీ, కేంద్ర కమిటీ సభ్యులు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పెట్టుబడిదారీ, మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా సీపీఐ(ఎం) మహిళా నాయకులు గళమెత్తారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా మార్చ్‌ను నిర్వహించారు. "మేము పోరాడుతాం, గెలుస్తాం" అనే నినాదాల హోరెత్తించారు. ఈ మార్చ్ మహిళా హక్కులు, న్యాయం కోసం కొనసాగుతున్న పోరాటానికి చిహ్నంగా మారింది. ఈ మార్చ్‌కు సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్, సుభాషిణి అలీ, కేంద్ర కమిటీ సభ్యులు పికె శ్రీమతి టీచర్, కెకె శైలజ, సీఎస్ సుజాత, రాష్ట్ర కమిటీ సభ్యురాలు జె.మెర్సికుట్టి అమ్మ, సుసాన్ కోడిలు నాయకత్వం వహించారు. ఈ మార్చ్ సీపీఐ(ఎం) కేరళ రాష్ట్ర 24వ మహాసభ జరిగిన కొడియేరి బాలకృష్ణన్ నగర్ వద్ద ప్రారంభమైంది. న్యాయం, సమానత్వం కోరుతూ మహిళలు నినాదాలు వినిపించారు. అనంతరం ఈ మార్చ్.. వి పార్క్ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా నేతలు లింగ, వర్గ అణచివేత నిర్మూలన, మహిళల విముక్తి, విప్లవాత్మక పరివర్తన దార్శనికతను వివరించారు. పితృస్వామ్యం, పెట్టుబడిదారీ విధానం రెండూ విచ్ఛిన్నమైన రోజు న్యాయం, సమసమాజం కోసం విస్తృత పోరాటం నుంచి మహిళల విముక్తి జరుగుతోందని స్పష్టం చేశారు.

'బేటీ బచావో బేటీ పడావో' వంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తూనే, మహిళలు ఎదుర్కొంటున్న హింస, వివక్షను పరిష్కరించడంలో విఫలమైన ఆర్ఎస్ఎస్ అనుబంధ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. మహిళలపై జరుగుతున్న దారుణాలను పదేపదే చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్న ప్రభుత్వ కపటత్వాన్ని సీపీఐ(ఎం) నేతలు ఎత్తి చూపారు. లైంగికహింస నుంచి వరకట్న మరణాలు, లింగ పక్షపాతం వరకు మహిళలపై నేరాలు పెరగడానికి దారితీస్తోన్నాయని అన్నారు. ముఖ్యంగా 'బేటీ బచావో బేటీ పడావో' కేవలం ప్రచార సాధనంగా ఉందని చెప్పారు. ఇది దేశంలోని మహిళలు, పిల్లల నిజమైన అవసరాలను తీర్చడానికి ఏమీ చేయలేదని అన్నారు. మహిళల భద్రత, విద్య, గౌరవంపై దృష్టి పెట్టడానికి బదులుగా, బీజేపీ ప్రభుత్వం మహిళా సాధికారత పునాదులను దెబ్బతీసే కార్పొరేట్ అనుకూల, మతపరమైన ఎజెండాను ముందుకు తీసుకెళ్లడానికి ప్రాధాన్యతనిచ్చిందని విమర్శించారు. ఈ ఎజెండా ప్రధానంగా ఉన్నత వర్గాలకు, కార్పొరేట్ ప్రయోజనాలకు ప్రయోజనం చేకూరుస్తుందని సీపీఐ(ఎం) నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. అణగారినవర్గాల మహిళలు, ముఖ్యంగా పేదలు, గ్రామీణ, మైనారిటీ మహిళలు ప్రభుత్వ నిర్లక్ష్యంతో బాధపడుతున్నారని అన్నారు. హింస, అసమానతను శాశ్వతం చేసే పితృస్వామ్య, పెట్టుబడిదారీ నిర్మాణాలను కూల్చివేసేందుకు న్యాయం, సమానత్వం కోసం పోరాటానికి, మహిళలకు విముక్తి కేంద్రంగా ఉన్న సమాజం కోసం పోరాడటానికి తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలో తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.



మహిళలపై హింసను అరికట్టాలి

- అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పోరాట స్ఫూర్తి దినంగా నిర్వహించాలి
- శ్రామిక మహిళలకు భద్రత కల్పించాలి : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

నవతెలంగాణ-చంపాపేట్

మహిళలు, చిన్నారులపై జరుగుతున్న హింసను అరికట్టాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పోరాటానికి స్ఫూర్తిగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. మహిళా దినోత్సవం సందర్భంగా సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా ఆధ్వర్యంలో సైదాబాద్ మండలం ఐఎస్ సదన్ డివిజన్ సంతోష్ నగర్ చౌరస్తా వద్ద భారీ ప్రదర్శన, సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా కార్మికుల పోరాటాల ఫలితంగానే అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం వచ్చిందన్నారు. ఆనాడు శ్రమ దోపిడీకి, సామ్రాజ్యవాద యుద్ధాలకు వ్యతిరేకంగా, ఓటు హక్కు, 8గంటల పని, శ్రమకు తగ్గ వేతనం వంటి డిమాండ్లతో పెద్దఎత్తున పోరాటం చేసి సాధించుకున్నారన్నారు. తిరిగి నేడు అలాంటి పోరాటాలు చేసే పరిస్థితులు రావడానికి పాలకవర్గాల నిర్లక్ష్యమే కారణమన్నారు. ఇప్పటికైనా చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో మహిళలకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

సీఐటీయూ శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ ఎస్వీ రమ మాట్లాడుతూ.. మహిళలం దరికీ సామాజిక భద్రత కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అందరికీ గ్రాట్యుటీ అమలు చేయాలని అన్నారు. ప్రసూతి, నెలసరి సెలవులు అమలు చేయాలని కోరారు. స్కీం వర్కర్లను కార్మికులుగా, ఉద్యోగులుగా గుర్తించా లని, కార్మిక చట్టాలను వర్తింపజేసి రెగ్యులర్ చేయాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర మాజీ కోశాధికారి ఎండి.అబ్బాస్ మాట్లాడుతూ.. రాత్రి వేళల్లో పనిచేస్తున్న శ్రామిక మహిళలకు భద్రత కల్పించాలని, మహిళలపై దాడులకు పాల్పడు తున్న వారిపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. జస్టిస్ వర్మ కమిటీ సిఫారసు లను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రావణ్ కుమార్, జిల్లా అధ్యక్షులు మీనా, కిషన్, కోటయ్య, జంగయ్య, ఐద్వా జిల్లా కార్యదర్శి శశికళ, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాలు నాయక్, అవాజ్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ సత్తార్, రాజ్ కుమార్, ప్రసాద్, రామ్‌కుమార్ ప్రమీల, కవిత తదితరులు పాల్గొన్నారు.



జీవన పరిస్థితులపై ప్రతికూల ప్రభావం

కనీస వేతనం రూ.26 వేలివ్వాలి

- స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలి
- అధికారుల వేధింపులు అరికట్టాలి : శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ ఎస్వీ రమ

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వాలు ఆహారం, ఆరోగ్యం, విద్య మొదలైన ముఖ్యమైన బాధ్యతల నుంచి తప్పుకోవడం వల్ల జీవన పరిస్థితులపై ప్రతికూల ప్రభావం పడుతోందని శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ ఎస్వీ రమ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమలానగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో 'కేంద్ర ప్రభుత్వ విధానం-మహిళలపై ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆమె మాట్లాడారు. దేశంలో మహిళలు చాలా దారుణమైన పరిస్థితుల మధ్య మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారని తెలిపారు. ముఖ్యంగా శ్రామిక మహిళ హక్కులపై వివక్ష, దాడులు విపరీతంగా పెరిగాయని చెప్పారు. నిత్యావసర వస్తువుల ధరల భారంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆహార పదార్థాలపైనా జీఎస్టీ విధించడం, అవసరమైన మందులపై, పెట్రోలియం ఉత్పత్తుల ధరలపై నియంత్రణ ఎత్తివేయడం వల్ల సామాన్యుల రోజువారీ ఖర్చులు భారీగా పెరిగాయని వివరించారు.

పురుషులతో సమానంగా పని చేస్తున్న మహిళలు వేతనంలో మాత్రం 40 శాతమే పొందుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రంగాల్లో మహిళలకు సమాన మైన పనికి సమాన వేతనం అమలు చేయాలని, స్కీం వర్కర్లని కార్మికులుగా, ఉద్యోగులుగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో రోజుకు రూ.600 చొప్పున వేతనంతో 200 రోజులు పని దినాలు కల్పించాలని కోరారు. మహిళల ఉపాధికి గ్యారెంటీ ఇవ్వాలని, హింసను నివారించడానికి కఠినమైన చర్యలు తీసుకోవాలని, జస్టిస్ వర్మ కమిటీ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమాజంలో సగ భాగంగా ఉన్న మహిళలకు పార్లమెంట్, అసెంబ్లీలో వెంటనే 33శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జె.చంద్రశేఖర్ మాట్లా డుతూ.. అంగన్‌వాడీ భవనాల కిరాయిలు, ఆరు నెలల కూరగా యల బిల్లు ఏడాదికి ఇస్తున్నారని చెప్పారు. మధ్యాహ్న భోజన కార్మికులకు వారు ఖర్చుపెట్టాక బిల్లు ఇవ్వడానికి ఆరు నెలలు పడుతోందని, ఇచ్చే రూ.వెయ్యి వేతనం ఎప్పుడు వస్తుందోనని ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఈ సెమినార్‌లో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.సునీత, బి.శోభారాణి, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎం.వినోద, ధరణి న్యూస్ ఎడిటర్ రోజారాణి, సీఐటీయూ నాయకులు ఎస్.శ్రీనివాస్, కె.ఉన్నికృష్ణన్, మధ్యాహ్న భోజనం యూనియన్ నాయకులు ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సేవకుడు మోడీ

లేబర్ కోడ్‌లను తిప్పికొట్టాలి | వైద్య పరికరాలపై జీఎస్టీని ఎత్తేయాలి

- కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి
- మే మొదటివారంలో దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి : సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య పిలుపు
- టీఎంఎస్ఆర్‌యూ జనరల్ కౌన్సిల్ సమావేశాలు ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రధాని నరేంద్ర మోడీ కార్పొరేట్ సేవకుడని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య విమర్శించారు. అంబానీ, అదానీ ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నారని అన్నారు. కార్పొరేట్ సంస్థలకు రూ.లక్షల కోట్లు రాయితీలు కల్పిస్తున్నారని చెప్పారు. ఇంకోవైపు కార్పొరేట్ పన్ను 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించారని వివరించారు. అన్ని విధాలుగా కార్పొరేట్ సంస్థలకు మోడీ అండగా నిలుస్తున్నారని అన్నారు. రెండురోజులపాటు జరగనున్న తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (టీఎంఎస్ఆర్‌యూ) రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రారంభమయ్యాయి. ప్రారంభ సూచికగా టీఎంఎస్ఆర్‌యూ పతాకాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చికోటి శ్రీధర్ ఆవిష్కరించారు. అనంతరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎస్ వీరయ్య మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నదని విమర్శించారు. దేశంలో నిరుద్యోగం పెరిగిందన్నారు. ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ప్రజల్లో కొనుగోలు శక్తి పడిపోయిందని చెప్పారు. దీంతో సరుకుల అమ్మకాలు తగ్గిపోయాయని వివరించారు. కార్మికులు, ఉద్యోగుల నిజవేతనాలు పడిపోయాయని అన్నారు. ద్రవ్యోల్బణం పెరిగిందనీ, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాలను విపక్ష పార్టీల నాయకులు చెప్పలేదనీ, ఎకనామిక్ సర్వే ప్రకటించిందని గుర్తు చేశారు. ప్రజల ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి అవకాశాలు పెంచాలనీ, కొనుగోలు శక్తి పెరగాలనీ, తద్వారా సరుకులు అమ్ముడయ్యేలా చూడాలని కోరారు. దాంతో ప్రభుత్వానికి పన్ను రూపంలో ఆదాయం వస్తుందన్నారు. పరిశ్రమలు విస్తరిస్తాయని చెప్పారు. అప్పుడు ఆర్థిక వ్యవస్థ బాగుపడుతుందని అన్నారు. కానీ మోడీ పాలనలో ఆర్థిక అసమానతలు పెరిగిపోయాయని విమర్శించారు. కార్పొరేట్ల ఆస్తులు విపరీతంగా పెరిగిపోతున్నాయనీ, కార్మికుల వేతనాలు పెరగడం లేదని చెప్పారు. శ్రమ దోపిడీ పెరిగిందనీ, సంపద పోగవుతున్నదని వివరించారు. శత కోటీశ్వరుల సంఖ్య 109 మంది నుంచి 200కు పెరిగిందని అన్నారు. ఇంకోవైపు కనీస వేతనం రోజుకు రూ.178 ఉంటే సరిపోతుందంటూ మోడీ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. అంటే నెలకు రూ.4,628తో కార్మికులు ఎలా బతకాలని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, ఆర్ఎస్ఎస్ నాయకులు నెలకు రూ.4,628తో ఎలా బతకాలో చూపించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని కోరారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యావైద్యం, గ్రామీణాభివృద్ధికి నిధులు తగ్గాయనీ, ఎరువుల సబ్సిడీ, ఉపాధి హామీ నిధుల్లో కోత విధించిందని విమర్శించారు. కానీ బడాబాబులకు మాత్రం రూ.ఏడు లక్షల కోట్ల రాయితీలను ప్రకటించిందని గుర్తు చేశారు. ఈ డబ్బుతో ఐదెకరాల్లోపు తొమ్మిది కోట్ల మంది రైతులకు రుణమాఫీ చేయొచ్చని సూచించారు. పేదలకిస్తే సబ్సిడీలు, ఉచితాలంటున్నారనీ, పెద్దలకిస్తే రాయితీలంటున్నారని చెప్పారు. దేశంలో ఆదాయపు పన్ను కట్టే వారు మూడు కోట్ల మంది ఉన్నారని వివరించారు. ఆదాయపు పన్ను కంటే జీఎస్టీ ద్వారా వసూలైన ఆదాయమే ఎక్కువని అన్నారు. రూ.12 కోట్లు అంతకంటే ఎక్కువ ఆదాయం ఉన్న వారికి సంపద పన్ను విధించాలని కోరారు. వారసత్వపు పన్ను వేయాలని సూచించారు. కార్పొరేట్ పన్నును పెంచాలని చెప్పారు. అనేక దేశాలు ఎర్రజెండా వైపు చూస్తున్నాయని అన్నారు. పెట్టుబడిదారీ విధానం సంక్షోభంలో ఉందన్నారు. సోషలిజమే ప్రత్యామ్నాయమని చెప్పారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. లేబర్ కోడ్‌లను తిప్పికొట్టాలని కోరారు. సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్‌కు కనీస వేతనం నిర్ణయించి తుది నోటిఫికేషన్ జారీ చేయాలని సూచించారు. ఈనెల 18న ఢిల్లీలో జరిగే సదస్సులో కార్మిక సంఘాలు కార్యాచరణను




నిర్ణయిస్తాయనీ, మే మొదటి వారంలో చేపట్టే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. మందుల ధరలను తగ్గించాలనీ, మందులు, వైద్య పరికరాలపై జీఎస్టీని ఎత్తేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ ఫార్మా సంస్థలను పునర్‌నిర్మించాలని చెప్పారు. ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను నిలిపేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, కార్యదర్శి జె వెంకటేశ్, బెఫీ రాష్ట్ర కార్యదర్శి పి వెంకట్రామయ్య, ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె పార్థసారథి, ఏఐఐఈఏ నేత రవీంద్రనాథ్, టీఎంఎస్ఆర్‌యూ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎ నాగేశ్వరరావు, టిఎంఎస్ఆర్‌యూ ప్రధాన కార్యదర్శి సిహెచ్ భానుకిరణ్ తదితరులు ప్రసంగించారు.

ఒకసారి పరిశీలిస్తే... గాంధీని చంపినవాడు హిందువే అయిన బ్రాహ్మణుడు. ఛత్రపతిపై కత్తివేటు వేసిన భాస్కర్ కులకర్ణి బ్రాహ్మణుడే. శివాజీ స్వరాజ్యాన్ని కబలించిన బాలాజీ విశ్వనాథ్ బ్రాహ్మణుడే. జ్యోతిరావ్ పూలే గారిని చంపటానికి వ్యక్తులను పంపిన కేశవభట్ బ్రాహ్మణుడే. శంభాజీని ఔరంగజేబుకు పట్టిచ్చిన రంగనాథ స్వామి బ్రాహ్మ ణుడు. దీన్ని ఆసరా చేసుకుని మతతత్వాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం ఎప్పుడయినా జరిగిందా! ఎప్పుడో కొన్ని వందల ఏండ్ల క్రితం జరిగి పోయిన చరిత్ర ఘటనలపై ద్వేషాన్ని నూరిపోయటం ఏ రకమైన సాంస్కృతిక హీనత్వం! చరిత్రలో హిందూమతంలోనే వైష్ణవ, శైవ యుద్ధాలు జరిగాయి కదా! వాటినీ ఇపుడు తిరగోడ్తారా! వైరాన్ని ఎగదోస్తారా!

చరిత్రపై వక్రకళ

చరిత్రపై దుమ్మెత్తి పోయటానికి ఇపుడు కళారంగాన్ని సాధనంగా వాడటం మొదలయింది. వాస్తవాలను కనుమరుగుచేసి, వక్రీకరణలతో కళారస గుళికల తయారీలో తలమునకలవుతున్న పాలకుల ఫీట్లు చూస్తే ఆశ్చర్యమేస్తుంది. ఆ వక్రీకరణలన్నీ ద్వేషంతో నింపడాన్ని, ఉన్మాదాన్ని పెంచడానికి ఉపయోగించడం అత్యంత దారుణమైన విషయం. మీరు గమనించినట్లయితే గత పదేండ్లలో మన బాలీవుడ్, టాలీవుడ్, ఇతర భాషా సినీ రంగంలో చారిత్రక సంఘటనలను మాతృకగా తీసుకుని వాటికి మతపరమైన ద్వేషాగ్నులు నింపే కథనాలను జోడించి వండి వారుస్తున్న సినిమాలు విపరీతంగా వస్తున్నాయి. 'పద్మావతి', 'బాహుబలి', 'ఆది పురుష్', 'రజాకార్', 'కేరళ ఫైల్స్', 'కాశ్మీరీ ఫైల్స్'... ఇలా అనేక సినిమాలు ఆరెస్సెస్, బీజేపీ అనుకూల హిందూత్వ, జాతీయవాదానికి అనుకూలంగా నిర్మించడం, వాటిని ఎన్నికల సందర్భంలో విరివిగా ప్రదర్శించి, రాజకీయ ప్రయోజనాన్ని పొందాలనే ప్రయత్నం చేయడం గమనించవచ్చు. మనువాద అణచివేతకు, దురహంకారానికి వారసులుగా ఉన్న వీరు, వీరుల, నాయకుల వారసత్వాన్ని పొందేందుకు చరిత్రనే వక్రీకరిస్తూ, అందరి కళ్లల్లో ద్వేషం పోస్తున్నారు. అందుకు సినిమా మాధ్యమాన్నీ పదునైన ఆయుధంగా ఎక్కుపెడుతున్నారు.

ఛావా సినిమా అందుకు ఓ చక్కని ఉదాహరణ. ఛత్రపతి శివాజీ కుమారుడు శంభాజీ మహరాజ్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన సినిమా అని చెపుతున్న దీనిలో అన్నీ అతిశయోక్తులు, వక్రీకరణలు నింపి మన ముందుకు తెచ్చారు. ఛత్రపతి శివాజీ గురించిన చరిత్ర ప్రసిద్ధ మయినది. తల్లి జిజియాభాయి గురించి కూడా మనం చదువుకున్నాము. గతంలో ఎప్పుడో తెలుపు నలుపులో శివాజీపై మరాఠీ సినిమా కూడా వచ్చింది. అందులో శివాజీ మరాఠా రాజ్యాధికారం స్వీకరించే సమయంలో గుడిలో పూజచేసి, వీర తిలకం దిద్దాల్సిన పూజారులు, శూద్రులకు వీర తిలకం దిద్దలేమని నిరాకరిస్తారు. అపుడు వేరే ప్రాంత బ్రాహ్మణులు వచ్చి, వారి ఎడమకాలు బొటనవేలుతో శివాజీ తలపై తిలకాన్ని దిద్దినారని చరిత్ర ఆధారంగా విన్నాము. ఇంతటి వివక్షను మనువాదుల నుండి ఎదుర్కొన్న రాజు ఛత్రపతి శివాజీ



ఇప్పుడు ఛత్రపతి శివాజీ హిందువుకు ప్రతినిధిగా వీరంగం వేస్తున్నారు ఈ సంఘ పరివారపు సనాతనులు. ఇది కదా విచిత్రమంటే! ఇపుడు అతని కుమారుడు శంభాజీని హీరోను చేసి, ఔరంగజేబును క్రూరునిగా చూపి, హిందూ మత ద్వేషిగా చిత్రీకరించే వంటకు 'ఛావా'ను వండారు. వాస్తవంగా శంభాజీని ఔరంగజేబుకు పట్టించిన వారు హిందువులే. శంభాజీని నిర్మూలించాక మరాఠాను ఏలింది కూడా హిందువులే. అసలు శంభాజీ అంత గొప్ప వీరుడు అని తెలిపే చారిత్రక ఆధారాలు ఏమీ లేవు. ఔరంగజేబు ఆరవ మొగలు చక్రవర్తి. దాదాపు యాభై ఏండ్లు పాలించాడు. ఇతను లక్షలాది హిందువులను ఊచకోత కోసాడని, వేలాది ఆలయాలు ధ్వంసం చేశాడని ప్రచారం చేస్తారు. వీటికి సరైన ఆధారలేవీ లేవు. సోదరులను, సంతానాన్ని హత్యలు చేయించాడని, జిజియా పన్ను విధిం చాడని చెబుతారు. అయితే రాజ్యాధికారం కోసం, అధికారం స్థిరపరచుకొనేందుకు, దాయాదులను తొలగించడం రాచరిక వ్యవస్థలో సహజం. డా॥ బి.ఎస్.పాండే పరిశోధక రచన ప్రకారం, రాజకీయ కారణాలవల్ల పన్నెండు ఆల యాలను, కొన్ని మసీదులను ధ్వంసం చేశాడని, వందకు పైగా హిందూ ఆలయాల నిర్మాణానికి, పోషణకు సహాయం చేశాడని, మతపరమైన తటస్థతను పాటించాడని తెలిపారు. సంస్కృతం నేర్చుకుని, ఉపనిషత్తులను, కావ్యాలను అనువాదమూ చేయించాడు. చక్రవర్తుల విలాస జీవితాన్ని తిరస్కరించాడు కూడా. అలాంటి ఒక చక్రవర్తిని, తమ మత విద్వేషానికి వాడటం దుర్మార్గం. అలసు దుర్మార్గాలు, హత్యలు చేసిన వారందరూ హిందూ వ్యతిరేకులేననే అసత్య ప్రచారం నిరంతరాయంగా చేస్తూనే ఉన్నారు.

ఒకసారి పరిశీలిస్తే... గాంధీని చంపినవాడు హిందువే అయిన బ్రాహ్మణుడు. ఛత్రపతిపై కత్తివేటు వేసిన భాస్కర్ కులకర్ణి బ్రాహ్మణుడే. శివాజీ స్వరాజ్యాన్ని కబలించిన బాలాజీ విశ్వనాథ్ బ్రాహ్మణుడే. జ్యోతిరావ్ పూలే గారిని చంపటానికి వ్యక్తులను పంపిన కేశవభట్ బ్రాహ్మణుడే. శంభాజీని ఔరంగజేబుకు పట్టిచ్చిన రంగనాథ స్వామి బ్రాహ్మ ణుడు. దీన్ని ఆసరా చేసుకుని మతతత్వాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం ఎప్పుడయినా జరిగిందా! ఎప్పుడో కొన్ని వందల ఏండ్ల క్రితం జరిగిపోయిన చరిత్ర ఘటనలపై ద్వేషాన్ని నూరిపోయటం ఏ రకమైన సాంస్కృతిక హీనత్వం! చరిత్రలో హిందూమతంలోనే వైష్ణవ, శైవ యుద్ధాలు జరిగాయి కదా! వాటినీ ఇపుడు తిరగోడ్తారా! వైరాన్ని ఎగదోస్తారా!

భారతదేశం అనాదిగా మత వైవిధ్యానికి, భిన్నసంస్కృతుల మేళవింపుకు ప్రసిద్ధి. హిందూ ముస్లిం, క్రిస్టియన్ల మధ్య సాంస్కృతిక సామరస్యాన్ని సూచించే దర్గాలు, సూఫీ సంతులు, పండుగలు, పీర్ల ఉత్సవాలు, రొట్టెలు పండుగలు, ప్రజలందరూ దీన్ని దెబ్బకొట్టి ప్రజల్లో విభజన సృష్టించేందుకు, శత్రుత్వాన్ని పెంచేందుకు వీళ్లు పూను కోవడాన్ని ప్రజలు ఆలోచించి తిప్పికొట్టాలి. సినిమాలు తీస్తున్నవారూ చరిత్రకు వక్రభాష్యం చెప్పటమూ మాను కోవాలి.ఇప్పటికే కోర్టు కేసు ఎదుర్కొంటున్న 'ఛావా' దర్శకుడు వక్రీకరణలపై క్షమాపణలు కోరటాన్ని గమనించవచ్చు!

సంపాదకీయం

జస్టిస్ ఓకా మరో అడుగు ముందుకేసి కవిత్వాన్ని అర్థం చేసుకోలేకపోవడం పట్ల ఆవేదన ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇదే సమస్య. ఎవరికీ సృజనాత్మకత పట్ల గౌరవం లేదు.మీరు అన్యాయానికి గురైనా ప్రేమతో తట్టుకోండని ఆ పాట చెబుతుంది. రక్తదాహం తీరని వారు మా మాట వినాలని అంటున్నది. మేము న్యాయం కోసం చేసే పోరాటంపై మీరు అన్యాయంగా దాడి చేసినా మేము ప్రేమతోనే ఎదర్కొంటామని ప్రకటిస్తున్నది" అని ఆయన వివరించారు. హైకోర్టు ఈ అంశాలను గమనంలోకి తీసుకోకపోవడం బట్టి చూస్తే దేశం ఎటుపోతుందో తెలియడం లేదని కపిల్‌సిబాల్ వ్యాఖ్యానించారు. దీనిపై కోపగించుకున్న సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మనం హైకోర్టు మీద వ్యాఖ్యలు చేయొద్దని అడ్డుతగిలారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు హైకోర్టుపై స్పందించకుండానే పోలీసులకు మాత్రం చురకలు వేశారు.

ఇటీవల డోనాల్డ్ ట్రంప్ మళ్లీ అధ్యక్షపదవి చేపట్టాక ప్రధానమంత్రి మోడీ ఆదరాబాదరాగా వెళ్లి కలసి రావడం అనేక వ్యాఖ్యలకు దారితీసిన సంగతి తెలిసిందే. ట్రంప్ విపరీత పోకడలనూ భారతీయ నిపుణుల, వ్యాపార వర్గాల ప్రయోజనాలపై వేటు వేసి తమ దేశానికి లాభం చేకూరేవిధంగా ఆయన అనేక హుకుందారీ చర్యలకు పాల్పడ్డారు. అయితే మోడీ వాటిలో దేన్నీ ప్రశ్నించలేకపోయారు. పైగా అవేవో మనకు మేలు చేసేవన్నట్టుగా విదేశాంగ మంత్రి జైశంకర్ సమర్థిస్తున్నారు. అదలా ఉంచితే ఆయన పర్యటన నేపథ్యంలో ఆనంద వికటన్ ఫిబ్రవరి 15న ఒక కేరికేచర్ ప్రచురించింది.ట్రంప్ ముందు మోడీ సంకెళ్లతో బందీగా ఉన్నట్టు అంటే స్వేచ్ఛ లేనట్టు అందులో చిత్రించింది. ఈ కార్టూన్ అమెరికాతో సంబంధాలకు హానికరమంటూ ఆనందవికటన్ వెబ్‌సైట్‌ను అమాంతం నిలిపేసింది కేంద్రం.

మీడియా సృజన స్వేచ్ఛ, సభ్యతా విలువలు



తెలకపల్లి రవి

ఏపీ,తెలంగాణ రాష్ట్రాల్లో సోషల్ మీడియా ద్వారా వారి వారి ప్రతినిధులు, నాయకులు చేసిన వ్యాఖ్యానాలు, ప్రయోగించిన బూతుపురాణాలపై ఎడతెగని వివాదాలు నడుస్తున్నాయి. కేసులూ, అరెస్టులూ ఎలా ఉన్నా ఆ ధోరణులు మాత్రం మారడం లేదు. సినీ,మీడియా రంగాల్లో ఎప్పుడూ ముందుండే వాళ్లు సోషల్ మీడియాను కూడా వ్యాపార మార్గంలో మళ్లించడంతో అనేక అవాంఛనీయ ధోరణులు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో అసలు మీడియా, సోషల్ మీడియా, ప్రయోజనాలు, ప్రజాకోణం మరుగున పడిపోతున్నాయి. జాతీయ స్థాయిలో మీడియా స్వేచ్ఛ గురించిన పోరాటంతో సంబంధం లేని రాజకీయ తగాదాగా ఇది మారిపోయినట్టు కనిపిస్తుంది గానీ నిజానికి అదే కీలకమైన కోణం. ఈ వారం సుప్రీంకోర్టు, మద్రాసు హైకోర్టు, రాజస్థాన్ హైకోర్టుతో సహా దీనికి సంబంధించి చేసిన వ్యాఖ్యానాలు, ఇచ్చిన ఆదేశాలు చూస్తే ఈ వాస్తవం గోచరిస్తుంది. '75 ఏండ్ల స్వాతంత్ర్యం తర్వాత కూడా మీకు ప్రాథమిక హక్కులంటే ఏమిటో తలకెక్కలేదని' సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఓకా ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసిందంటే ఇదెంత తీవ్రమైన పోరాటంగా ఉందో అర్థమవుతుంది. తమిళనాడులో ఆనంద వికటన్ వెబ్‌సైట్ వ్యవహారం కూడా ఇందుకు సంబంధించి కీలక సంకేతాలు అందిస్తున్నది. స్థానిక వివాదాల్లో మునిగితేలుతున్న తెలుగు మీడియా, ప్రాంతీయ నేతలూ వీటిని పరిశీలిస్తారా?

సుప్రీం ఆగ్రహమెందుకు?

భావ ప్రకటనా స్వేచ్ఛపైన అసహనం, మూఢనమ్మకాలను, మత ఛాందసాలను ప్రశ్నిస్తే దాడి ఇప్పుడు సర్వసాధారణంగా తయారైనాయి. అంతర్జాతీ య అధ్యయనాలు, నివేదికలు కూడా భారతదేశంలో పరిస్థితిపై ఆందోళన వెలిబుచ్చుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒకప్పటి కవులూ, రచయితల వ్యాఖ్యానాలు వీరు సహించి ఉండేవారా? అని మాలాంటి వాళ్లం తరచూ అడుగుతుంటాం. ఉదాహరణకు వేమన పద్యాలు ఉటంకిస్తే, త్రిపురనేని రామస్వామి, జాషువా వంటివారి చరణాలు గుర్తుచేస్తే భరించగలరా? అని సందేహాలు వింటుంటాము. ఈ ఇద్దరు నాయకుల్లో ఎవరు మెరుగని ఎవరైనా అడిగితే ఎవరైతేనేం, ఒక్కొక్కరు మహాహంతకులు అని మహా ప్రస్థానంలో శ్రీశ్రీని ఉటంకించాననుకోండి. నాయకులను హంతకు డన్నారని వాదించొచ్చు. బుద్ధిలేనివాడు దేవుడెట్లాయరా అని వేమన రాసింది చెప్పామనుకోండి, అది దైవదూషణగా చిత్రించవచ్చు. సరిగ్గా ఇప్పుడు అలాటి సమస్యే గుజరాత్‌లో వచ్చింది. ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి రాజ్యసభ సభ్యుడు. కాంగ్రెస్ తరపున ఎన్నికైన ఈయన ఉర్దూ భాషాకవి, అవార్డు గ్రహీత కూడా. కాంగ్రెస్‌లో చేరిన కొద్ది కాలంలోనే ఆయన్ను ప్రమోట్ చేసి ఎంపీగానూ, మైనార్టీ సెల్ చైర్మన్‌గానూ నియమించారు. కవి సమ్మేళనాల్లో ఆయన కవితలు బాగా ఆకర్షి స్తుంటాయట. ఇటీవల ఆయన జామ్‌నగర్‌లో సామూహిక వివాహాలకు హాజరైన సందర్భంలో చదివిన కవిత వీడియో పోస్ట్ చేశాడు. 'ఏ కూన్‌కే ప్యాసే బాత్ సునో..(రక్త పిపాసులారా ఈ మాట వినండి)' అంటూ.. పైన పూలు కురుస్తుండగా ప్రతాప్‌గర్హి నడుస్తున్నట్టు ఉన్న ఈ 46 సెకండ్ల పోస్టుకు బాగా స్పందన రావడమే గాక, కింద ఇది మత రాజకీయాలకు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్య అన్నట్టు స్పందనలు కనిపించాయి. వెంటనే జామ్ నగర్ పోలీసులు ఇది భిన్నమతాల మధ్య విద్వేషాలు పెంచేవిధంగా ఉందంటూ కిషన్ నందా అనే వ్యక్తి నుంచి ఫిర్యాదు వచ్చిందని ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రతాప్‌గర్హి ఇది నిజానికి ప్రేమను పెంచేందుకు ఉద్దేశించిందని వివరిస్తూ తనపై కేసు కొట్టేయాలని అహ్మదాబాద్ హైకోర్టును ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. ఈ కవిత మీరే రాశారా లేక మరెవరినైనా ఉటంకించా చెబుతూ అఫిడవిట్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఇది తాను రాయలేదనీ మూలమేమిటో కచ్చితంగా తెలియదు గాని అందుబాటులో ఉన్న సమాచారం మేరకు ప్రఖ్యాత కవి ఫైజ్ అహ్మద్ ఫైజ్‌దో లేక హబీబ్ జలీబ్‌తో కావచ్చని చాట్ జీపీటీతో సహా చెబుతున్నాయని సమా ధానంలో తెలియజేశారు.(వాస్తవానికి ఇది ఫైజ్ పాటగా సినిమాల్లో కూడా వాడారు) ఈపాట ద్వారా తాను ప్రేమ, అహింస సందేశం ఇవ్వడానికి ప్రయత్నించానని కూడా పేర్కొన్నారు.తాను ఏదో నేరం చేసినట్టు ఎఫ్ఐఆర్ కూడా చెప్పడం లేదని ఆయన వాదించారు. అయితే ఈపాటలో పదాలు వింటే రాజ్యాన్ని ఎదుర్కొమ్మని చెప్పడం స్పష్టంగా అర్థమవుతుందని ప్రాసిక్యూషన్ వాదించింది. విచారణకు నిందితుడు సహకరించడం లేదని రాష్ట్ర ప్రభుత్వం కూడా అందుకు వంతపలికింది. మొత్తానికి అహ్మదాబాద్ హైకోర్టు ఎఫ్ఐఆర్ కొట్టివేయడానికి తిరస్కరించింది. సోషల్‌మీడియా పోస్టుల ప్రభావం ఎంతటిదో తెలుసు గనక ఒక ఎంపీగా ప్రతాప్‌ఘర్హి బాధ్యతగా వ్యవహరిం చాలని ఆయనకే సలహాలిచ్చింది.

ఈ దశలో తనపై పోలీసులు చర్య తీసుకోకుండా ఆపాలంటూ ప్రతాప్‌గర్హి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కపిల్‌సిబాల్ ఆయన తరపున వాదించగా జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భయాన్ ధర్మాసనం ఆయనపై కేసులో ఎలాంటి చర్యలు తీసుకోవద్దని గుజరాత్ పోలీసులను ఆదేశించింది. అంతకంటే కీలకంగా జస్టిస్ ఓకా చేసిన పైవ్యాఖ్యలు సంచలనం కలిగించాయి. ఈ పాట మతానికి గానీ, జాతికి గానీ వ్యతిరేకం కాదని ఆయన స్పష్టం చేశారు. నిజానికి ఇది అహింసను బోధిస్తున్నది. మతంతో ఏ సంబంధం లేదు. ఏ విధంగానూ జాతి వ్యతిరేక చర్య కానేకాదని పేర్కొంది. జస్టిస్ ఓకా మరో అడుగు ముందుకేసి కవిత్వాన్ని అర్థం చేసుకోలేకపోవడం పట్ల ఆవేదన ఆగ్రహం వ్యక్తం చేశారు." ఇదే సమస్య. ఎవరికీ సృజనాత్మకత పట్ల గౌరవం లేదు.మీరు అన్యాయానికి గురైనా ప్రేమతో తట్టుకోండని ఆ పాట చెబుతుంది. రక్తదాహం తీరని వారు మా మాట వినాలని అంటున్నది. మేము న్యాయం కోసం చేసే పోరాటంపై మీరు అన్యాయంగా దాడి చేసినా మేము ప్రేమతోనే ఎదర్కొంటామని ప్రకటిస్తున్నది" అని ఆయన వివరించారు. హైకోర్టు ఈ అంశాలను గమనంలోకి తీసుకోకపోవడం బట్టి చూస్తే దేశం ఎటుపోతుందో తెలియడం లేదని కపిల్‌సిబాల్ వ్యాఖ్యానించారు. దీనిపై కోపగించుకున్న సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మనం హైకోర్టు మీద వ్యాఖ్యలు చేయొద్దని అడ్డుతగిలారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు హైకోర్టుపై స్పందించ కుండానే పోలీసులకు మాత్రం చురకలు వేశారు."పోలీసులు కూడా కొంతైనా సున్నితత్వం చూపించాలి, చదివి అర్థం చేసుకోవాలి.రాజ్యాంగం ఆమోదించిన 75 ఏళ్ల తర్వాత కూడా మీ పోలీసులకు భావప్రకటనా రీతులు, వ్యక్తీకరణలు తెలుసుకోవాలని" హితం చెప్పారు. ఇది కూడా తుషార్‌మెహతాకు నచ్చలేదు. పోలీసులు కవిత్వం ఆస్వాదించాలనడం మరీ అతిశయంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. ఇది ఫైజ్‌ది కాదు రోడ్డు పక్క చెట్టుకింద కవితలాంటిదేనని దెప్పి పొడిచారు. అంతకుముందు న్యాయమూర్తి మాటల్లో మహాత్మాగాంధీ కూడా అన్యాయాన్ని ప్రేమతో ఎదుర్కొవాలన్నారని చెప్పినప్పుడు ఈ కవితను మరీ మహాత్ముడితో పోల్చవద్దని అభ్యంతరం చెప్పారు. ఈ మొత్తం వ్యవహారంపై సుప్రీంకోర్టు తీర్పు వాయిదా వేసింది గానీ పోలీసులు పెట్టిన కేసు, హైకోర్టు సమర్ధన, తుషార్‌మెహతా అదే వాదించడం పరిస్థితికి అద్దం పడుతుంది.

సెన్సార్ కాదు, క్రమబద్ధీకరణ

సరిగ్గా ఈ కేసు విచారణ రోజునే సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్ యే ట్యూబర్ రణవీర్ అల్హాబాదియా దాఖలు చేసిన పిటిషన్‌పై కీలక సూచనలు చేశారు. ఇవి నాణేనికి మరోవైపును కూడా చూపించాయి. అనేక సామాజిక అంశాలు చర్చకు పెట్టే అల్హాబాదియా ఇటీవల చేసిన కొన్ని వ్యాఖ్యలు దుమారం రేపాయి. మీ తల్లి దండ్రుల శృంగారం పిల్లలు చూడటం, దానిపై వారి భావనల గురించి రణవీర్ ఇటీవల ఒక షోలో అనుచిత వ్యాఖ్యలు చేశారు. దానిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమైన తర్వాత ఆయన కార్యక్రమాలను నిలిపేస్తూ ఫిబ్రవరి 18న



ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి రాజ్యసభ సభ్యుడు. కాంగ్రెస్ తరపున ఎన్నికైన ఈయన ఉర్దూ భాషాకవి, అవార్డు గ్రహీత కూడా. కాంగ్రెస్‌లో చేరిన కొద్ది కాలంలోనే ఆయన్ను ప్రమోట్ చేసి ఎంపీగానూ, మైనార్టీ సెల్ చైర్మన్‌గానూ నియమించారు. కవి సమ్మేళనాల్లో ఆయన కవితలు బాగా ఆకర్షి స్తుంటాయట. ఇటీవల ఆయన జామ్‌నగర్‌లో సామూహిక వివాహాలకు హాజరైన సందర్భంలో చదివిన కవిత వీడియో పోస్ట్ చేశాడు. 'ఏ కూన్‌కే ప్యాసే బాత్ సునో..(రక్త పిపాసులారా ఈ మాట వినండి)' అంటూ.. పైన పూలు కురుస్తుండగా ప్రతాప్‌గర్హి నడుస్తునట్టు ఉన్న ఈ 46 సెకండ్ల పోస్టుకు బాగా స్పందన రావడమే గాక, కింద ఇది మత రాజకీయాలకు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్య అన్నట్టు స్పందనలు కనిపించాయి. వెంటనే జామ్ నగర్ పోలీసులు ఇది భిన్నమతాల మధ్య విద్వేషాలు పెంచేవిధంగా ఉందంటూ కిషన్ నందా అనే వ్యక్తి నుంచి ఫిర్యాదు వచ్చిందని ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

సుప్రీంకోర్టు ఉత్తర్వులిచ్చింది. దానిపై రణవీర్ అరెస్టు చేయొద్దంటూనే ఆయన కార్యక్రమాలను నిలిపేసింది. ఈ నిలిపివేతను తొలగించాలంటూ ఆయన తరపున న్యాయవాది అభినవ్ చంద్రచూడ్ పిటిషన్ వేశారు. తన క్లయింట్ పైన 280 మంది ఆధారపడి ఉన్నారనీ, అతనేదో అపహాస్యం కోసం, కావాలని అలా మాట్లాడలేదని సంజాయిషీ ఇచ్చారు. దానిపై జస్టిస్ సూర్యకాంత్ నిలిపివేత ఉత్తర్వులను సవరిస్తూ రణవీర్ షో కొనసాగించడానికి అనుమతించారు. అదే సమయంలో నైతికత హుందాతనం పాటించాలనీ, భారతీయ సమాజంలో సువ్యవస్థితమైన నైతిక ప్రమాణాలకు అనుగుణంగా నడుచుకోవలని హితవు పలికారు. దారి తప్పి వ్యవహరించి ప్రాథమిక వాక్ స్వాతంత్ర్యంపై సెన్సార్‌షిప్‌ను కొనితెచ్చుకోవద్దని హెచ్చరించారు. ఇంటిల్లిపాదినీ నవ్వించగలిగేదే మంచి హాస్యమని, దుర్భాషలతో ఎవరికీ ఎబ్బెట్టు అనిపించకూడదనీ ఆదేశించిన జస్టిస్ సూర్యకాంత్ బాలివుడ్‌లో మనకు గొప్ప హాస్యనటులున్నారని ప్రశంసించారు. హాస్యం,అసభ్యత,వికృతానందం వీటి మధ్య తేడా పాటిం చాలన్నారు. ఇలాంటివాటిని క్రమబద్ధం చేసేందుకు ఏదైనా యంత్రాంగాన్ని సూచించాలని తుషార్ మెహతాను కోరారు.

ఆనంద వికటన్‌కూ అనుమతి

ఇక నూరేళ్లుగా నడుస్తున్న ప్రసిద్ధ తమిళ వార పత్రిక ఆనందవికటన్‌కూ ఈ ఆంక్షల సెగ తప్పలేదు. అది రాజకీయ కోణంతో కూడినది కావడం మరింత విశేషం. ఇటీవల డోనాల్డ్ ట్రంప్ మళ్లీ అధ్యక్షపదవి చేపట్టాక ప్రధానమంత్రి మోడీ ఆదరాబాదరాగా వెళ్లి కలసి రావడం అనేక వ్యాఖ్యలకు దారితీసిన సంగతి తెలిసిందే. ట్రంప్ విపరీత పోకడలనూ భారతీయ నిపుణుల, వ్యాపార వర్గాల ప్రయోజనాలపై వేటు వేసి తమ దేశానికి లాభం చేకూరేవిధంగా ఆయన అనేక హుకుందారీ చర్యలకు పాల్పడ్డారు. అయితే మోడీ వాటిలో దేన్నీ ప్రశ్నించలేకపోయారు. పైగా అవేవో మనకు మేలు చేసేవన్నట్టుగా విదేశాంగ మంత్రి జైశంకర్ సమర్థిస్తున్నారు. అదలా ఉంచితే ఆయన పర్యటన నేపథ్యంలో ఆనంద వికటన్ ఫిబ్రవరి 15న ఒక కేరికేచర్ ప్రచురించింది.ట్రంప్ ముందు మోడీ సంకెళ్లతో బందీగా ఉన్నట్టు అంటే స్వేచ్ఛ లేనట్టు అందులో చిత్రించింది. ఈ కార్టూన్ అమెరికాతో సంబంధాలకు హానికరమంటూ ఆనందవికటన్ వెబ్‌సైట్‌ను అమాంతం నిలిపేసింది కేంద్రం. ఎందుకంటే మెటా వంటి ప్లాట్‌ఫాంల నిర్వాహకులు కేంద్రం ఆదేశాలు చాలావరకూ అమలు చేస్తుంటారు. దీనిపై ఆ పత్రిక న్యాయపోరాటం చేసింది. ఆ కార్టూన్ తప్పనుకుంటే అది తొలగించమని ఆదేశాలివ్వాలి గానీ ఇంత చరిత్ర గల తమ సంస్థ సైట్‌నే మూసేయడం ఏంటని ప్రశ్నించింది.దానిపై చివరకు మద్రాసు హైకోర్టు మోడీ కేరికేచర్ లేకుండా దాన్ని పున: ప్రారంభించు కోవచ్చని అనుమతినిచ్చింది.

ఆర్నాబ్ కేసే వేరు!

మొత్తంగా తమకు నచ్చని మీడియా సోషల్ మీడియాలపై కేంద్రం రాష్ట్రాల పాలకులు వివిధ రకాలుగా సాగించే వేధింపులూ, ఆంక్షలపై అనేక ఉదాహరణలున్నాయి. అసలు యూట్యూబ్ కంటెంటును మొత్తంగా తమ గుప్పిట్లో పెట్టుకోవడానికి కొన్ని చట్టాలు కూడా తీసుకొచ్చారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం 69ఎ ఇందుకు సాధనంగా వుంది. దానిపై అభ్యంతరాలొచ్చాయి కూడా. అదే సమయంలో తమకు నచ్చినవారి పట్ల మాత్రం కేంద్రం ద్వంద్వ నీతిని పాటించడం పరిపాటి. ఆ జాబితాలో అగ్రగణ్యుడు ఆర్నాబ్ గోస్వామి. ఇంతకూ కేసేమిటంటే 2022లో రాజస్థాన్‌లోని అల్వార్‌లో ఒక దేవాలయ విధ్వంసం జరిగిందంటూ రిపబ్లిక్ టీవీ హిందీ ఛానల్ కథనం ప్రసారం చేసింది. అప్పుడు అక్కడ కాంగ్రెస్ సర్కారుంది.

ఈ కథనం ప్రసారం చేయడంతో ఆగక దానికి 'జహంగీర్‌పూర్‌కు ప్రతీకారమా?'అని ట్యాగ్ తగిలించింది రిపబ్లిక్ టీవీ. దానిపై కాంగ్రెస్ ప్రతినిధి పవన్ ఖేరా ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ దాఖలైంది. ఈలోగా అక్కడ బీజేపీ అధికారంలోకి వచ్చింది. ఢిల్లీలో జరిగిన ఘటనపై ఆరోపణల నేపథ్యంలో తాము ఈ ట్యాగ్ తగిలించామే గానీ వేరే దురుద్దేశం లేదనీ, తమ కథనం వల్ల ఎలాంటి గొడవలు జరగలేదని ఆర్నాబ్ సమర్థించుకున్నారు.రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఫర్జానంద్ అలీ ఈ వాదనలతో ఏకీభవిస్తూ పూర్తి కేసు తేలేవరకూ ఆర్నాబ్‌పై ఎలాంటి చర్య తీసుకోవద్దని తాజాగా ఆదేశించారు. ఇన్నిరోజుల్లో పోలీసులు ఏ సాక్ష్యాలు సేకరించారని ప్రశ్నించారు. కరోనా రోజుల్లోనే అనేక అవాస్తవాలు ప్రసారం చేసిన ఆయన్ను ఆదుకున్న తీరు చూశాం. హత్రాస్ ఘటన తర్వాత అక్కడకు వెళ్లిన కేరళ జర్నలిస్టు సిద్ధిక్ కప్పన్‌ను మూడేళ్లపాటు జైలులో పెట్టిన కేంద్రం అప్పటి మహారాష్ట్ర ప్రభుత్వం అర్నాబ్‌ను అరెస్టుచేస్తే స్వయంగా హోంమంత్రిని రంగంలోకి దింపి విడుదలయ్యేందుకు కృషి చేసింది. ఈ కేసు మరోసారి ఆ సన్నివేశాన్ని కళ్లముందు నిలబెట్టడం లేదా? ఏమైనా మీడియా కథనాలు, స్వేచ్ఛ, సభ్యత, బూతులు, అసత్యాలు, విద్వేష ప్రచారాలు, పార్టీలను, వ్యక్తులను బట్టి, కుల మతాలను బట్టి గాక ప్రజాస్వామిక విలువలు, ప్రజాజీవిత ప్రమాణాలను బట్టి నడవాలని కోరుకోవాలి. ■

ప్రజల గుండెనిండా..'కాసాని' ఎర్రజెండా...

కామ్రేడ్ కాసాని ఐలయ్య. బహుశా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ పేరు తెలియని వ్యక్తి ఉండకపోవచ్చు. ప్రత్యేకించి కొత్తగూడెం ప్రాంతంలో మాస్ కమ్యూనిస్టు లీడర్ అంటే గుర్తొచ్చే పేరు కూడా కాసాని. ఉమ్మడి రాష్ట్రం నుండి సీపీఐ(ఎం)రాష్ట్ర కమిటీ సభ్యునిగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏర్పడ్డాక మొదటి కార్యదర్శిగా పనిచేశారు. యువకుడిగా ఎర్రజెండా చేతబట్టి తుదిశ్వాస విడిచే వరకు ప్రజలతో, ప్రజా పోరాటాలతో పెనవేసుకున్నది కాసాని జీవితం. తాను నమ్మిన శ్రామిక వర్గ సిద్ధాంతం కోసం ఎత్తిన ఎర్రజెండాను దించకుండా, నిబద్ధతగల కమ్యూనిస్టుగా పనిచేసిన కాసాని జనవరి 25న తుదిశ్వాస విడిచారు. అర్ధ శతాబ్దానికి పైగా కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేసి ఎన్నో ఆట ఒకాలు, నిర్బం ధాలు, శత్రువుల దాడులను ఎదుర్కొని తన జీవితాన్ని త్యాగం చేసిన నిబద్ధతగల కమ్యూనిస్టు యోధుడు.



లిక్కి బాలరాజు
9701406173

కాసాని ఐలయ్య 1951 జులై 8న ఉమ్మడి వరంగల్ జిల్లా గంగదేవిపల్లికి గ్రామంలో జన్మించాడు. పదోతరగతి వరకు చదువుకున్న ఆయన 1968లో టెలిఫోన్ డిపార్ట్మెంట్‌లో లైన్‌మేన్‌గా చేరాడు. ఉద్యోగం పర్మినెంట్ అవు తుందని ఇంటర్వ్యూకి వెళ్లగా, మంచి మార్కులు వచ్చినప్పటికీ లంచం ఇవ్వలేదనే కారణంతో అతన్ని పర్మినెంట్ చేయలేదు. దీంతో అధికారులపై కాసానికి కోపమొచ్చి అక్కడే తన సర్టిఫికెట్లు చించి, వారి ముఖాన కొట్టి చిన్న వయసులోనే అవినీతిపై ధిక్కారస్వరాన్ని వినిపించాడు. గంగదేవిపల్లిలో వందెకరాల ప్రభుత్వ పంచరాయి భూమిని పటేళ్లు, పట్వారీలు ఆక్రమించు కుని అమ్ముకుంటుండగా తన స్నేహితుడు రాజమౌళితో కలిసి కామ్రేడ్ నాగయ్య నేతృత్వంలో జరిగిన పోరాటంలో భాగ స్వామి అయ్యాడు. ఆ పోరాటం విజయవంత మయ్యాక కమ్యూనిస్టు ఉద్యమం పట్ల బలమైన నమ్మకంతో సీపీఐ(ఎం)లో చేరాడు.

'పేదలు ఒక్కటైతే సమస్యలు సాధించవచ్చు - గడ్డి పోచలను తాడుగా పేనితే ఏనుగునైన బంధించవచ్చు' అని కామ్రేడ్ నాగయ్య గారు చెప్పిన మాటలు మరింత ఉత్తేజాన్నిచ్చాయి. ఆయనిచ్చిన వియత్నాం పోరాటం, చైనాపై అరుణతార పుస్తకాలు కాసాని కమ్యూనిస్టు ఉద్యమంలోకి రావడానికి ప్రేరణ కలిగించాయి. ఆ చైతన్యంతోనే నూటయాభై కుటుంబాలున్న గ్రామంలో తొంభైఐదు శాతం సీపీఐ(ఎం)లో చేరే విధంగా కృషిచేశాడు. అలాగే చుట్టుపక్కల గ్రామాల్లోనూ పార్టీని నిర్మించాడు.

ఒకరిలో ఒకరై, పోరాటాల్లో మమేకమై...

1974లో ప్రస్తుత సుజాతనగర్ మండలం సీతంపేట పంచాయతీ పరిధిలోని రెడ్డిపాలెం గ్రామానికి కుటుంబంతో సహా వల సొచ్చి వ్యవసాయం చేసుకుంటుండగా, పార్టీలో పనిచేస్తానని తన తండ్రితో చెప్పగా ఆయన ఒప్పుకోకపో వడంతో భార్య లక్ష్మిని తీసుకుని కట్టు బట్టలతో బయటకొచ్చాడు. గ్రామంలోనే పూటకొక ఇంట్లో అన్నం తినుకుంటూ పార్టీ నిర్మాణానికి అంకితమయ్యాడు. సీతంపేట, రాంజీతండా గ్రామాల్లో మలేరియా జ్వరాలు వచ్చి సరైన వైద్యమందక ప్రజల ప్రాణాలు కోల్పోతుంటే చలించిపోయాడు. సుందరయ్యగారి స్ఫూర్తితో ఇల్లందు వెళ్లి ఒక డాక్టర్ దగ్గర ఇంజక్షన్ వేయడం, టాబ్లెట్లు ఇవ్వడం నేర్చుకొని తానే స్వయంగా ప్రజలకు వైద్యసేవలందించాడు. కాసాని దంపతులిద్దరూ కూలీరేట్ల పోరాటం, సారా వ్యతిరేక ఉద్యమాలు నిర్వహించి సుజాతనగర్, జూలూరుపాడు, ఏన్కూరు, చంద్రుగొండ, కొత్తగూడెం, పాల్వంచ ప్రాంతాల్లో మార్క్సిస్టు పార్టీ విస్తరణకు, నిర్మాణానికి విశేషమైన కృషి చేశారు.

ప్రారంభంలో దంపతులిద్దరూ వారి కుమారుడు లెనిన్‌తో కలిసి సైకిల్ మీద గ్రామాలు తిరుగుతూ, పాటలు పాడుతూ, డప్పు కొడుతూ ప్రజలను చైతన్యం చేశారు. ప్రధానంగా వ్యవసాయ కూలీలను సంఘటితపరిచి కూలీ రేట్ల పోరాటంలో పాల్గొనేలా చేసి రేట్లు పెంచి విజయం సాధించారు. ఇది భూస్వాములకు కంటగింపుగా మారి సుజాతనగర్‌లో ఇల్లు కూడా కిరాయికి దొరక్కుండా, కిరాయికి వెళ్లిన ప్రతి ఇంటి నుండి బయటికి పంపించే విధంగా భూస్వాములు కుట్రలు చేశారు. అయినా మొక్కవోని ధైర్యంతో కూలీరేట్ల పెంపు కోసం, భూస్వాములు,పెత్తందారుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తూ బక్క జీవులకు వెన్నుగా నిలిచాడు. ఈ పోరాట క్రమంలోనే భూస్వాములు, పెత్తందారులు,సోదర కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఏడు సార్లు కాసానిపై హత్యాయత్నం చేశారు. ఈ దాడుల నుండి ప్రజలే కామ్రేడ్ కాసానిని కంటికి రెప్పలా కాపాడుకున్నారు. రాత్రిపూట కాసాని ఇంటిమీద ఏ క్షణంలోనైనా దాడి జరుగుతుందని గ్రహించిన కార్యకర్తలు ప్రతిరోజు తన ఇంటి వద్ద రాత్రిపూట రక్షణగా నిలబడ్డారు. 1993 తిమ్మరావు పేటలో మీటింగ్ జరుగుతుండగా కాంగ్రెస్ గుండాలు కాసానిపై దాడి చేయడానికి ప్రయత్నించగా అతన్ని రక్షించబోయి ఎస్ఐ అహ్మద్ వారి చేతిలో హత్యకు గురయ్యాడు.



తాను చనిపోవడానికి వారం రోజుల ముందు సుజాతనగర్‌లోని ఏడు గ్రామ పంచాయ తీలను కొత్తగూడెం కార్పొరేషన్‌లో కలపొద్దని పెద్ద ఉద్యమానికి శ్రీకారం చుట్టాడు. కలెక్టరేట్ ధర్నాకి ప్రజల్ని కదిలించడానికి తానే స్వయంగా ఇరవై గ్రామాలు తిరిగి అర్బన్ స్వభావం రాని పల్లె ప్రాంతాలను కార్పొరేషన్ లో కలపడం వలన జరిగే నష్టమేమిటో వివరించి ప్రజల్ని చైతన్యం చేశాడు. డయాలసిస్ పేషెంట్ అయినప్పటికీ ఏమాత్రం ఆలోచించకుండా ఈ పోరాటంలో కీలక పాత్ర పోషించి ప్రజల్ని కదిలించాడు. అందుకే కాసానితో ప్రయాణం చేసిన ప్రతి ఒక్కరికి అనిపిస్తుంది, ఓపిక ఉన్నంతవరకు కాదు ఊపిరి ఉన్నంతవరకు ఎర్రజెండా మోయాలని.నడుస్తున్న కాలానికి ఉదయించే సూర్యునిలా చైతన్య జ్వాలలు రగిలించిన కామ్రేడ్ కాసానికి విప్లవ జోహార్లు.

ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న నాయకుడు

కూలిరేట్ల పోరాటం, సారా వ్యతిరేక ఉద్యమం, ఇండ్ల స్థలాల పోరాటం, సింగరేణి సిడిఎస్ సమ్మె ఆర్టీసీ సమ్మె, భూస్వాములు, పెత్తం దారులకు వ్యతిరేకంగా జరిపిన పోరాటాలు కాసానిని ప్రజానాయకుడిగా ముద్రవేశాయి. 1997 నుండి 2014 వరకు సాగిన ఇళ్ల స్థలాల పోరాటంలో పాత కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలో సుమారు పదిహేను వేల మందికి ఇళ్ల స్థలాలు ఇప్పించడంలో కామ్రేడ్ కాసాని పోరాటం స్ఫూర్తిదాయకమైనది.ఈ పోరాటంలో భాగంగా ఆమరణ నిరాహార దీక్ష చేసి చావు నోట్లో తలపెట్టి పేదలకు ఇళ్ల స్థలాలు దక్కేలా కృషి చేశాడు. జైలుకు సైతం వెళ్లాడు. జైలు నుంచి విడుదలయ్యాక ప్రజలు పెద్ద ఎత్తున బ్రహ్మరథం పట్టారు. పేదల కోసం సాగించిన గుడిసెలు పోరాటం గుడిసెల ఐలయ్యగా పేరు తెచ్చింది. 2007లో చేసిన ఆమరణ నిరాహార దీక్ష ప్రభుత్వ మెడలు వంచి నేరుగా రైతులు వద్ద నలభై ఎకరాల భూమి కొనుగోలు చేసి పేదలకు పంపిణీ చేసే విధంగా కాసాని నేతృత్వంలో పోరాటం కొనసాగింది. ఆనాడు సీపీఐ(ఎం)కు ఉమ్మడి రాష్ట్రంలోనే ఇది గొప్ప విజయం.

సర్పంచ్‌గా తనదైనశైలిలో...

సుజాతనగర్ సర్పంచిగా ఇరవై ఏళ్ల పాటు తను పనిచేయడంతో పాటు మరో పదిహేనేళ్లు కున్సోత్ ధర్మ, గండమాల భాస్కర్,కాసాని లక్ష్మీ పనిచేయడానికి ఆయన కృషి విశేషమైనది. మొత్తమ్మీద ముప్పైఐదు సంవత్సరాల పాటు సుజాతనగర్ మేజర్ గ్రామపంచాయతీకి సీపీఐ(ఎం) నాయకత్వాన సుపరిపాలన, నీతివంతమైన ప్రజాపాలన అందించి ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దిన నాయకుడిగా ఆయన సేవలందించాడు.రూపాయికే ఇరవై లీటర్ల మినరల్ వాటర్ అందించి పంచాయతీ నిధులను ప్రజల కోసం ఎలా ఖర్చు చేయాలో చూపించిన పరిపాలనదక్షుడు కాసాని.ప్రస్తుతం నడుస్తున్న ఎన్నికల ప్రక్రియను మనం గమనిస్తూనే ఉన్నాము. ఎన్నికల్లో రాజకీయ నాయకులు ప్రజలకు డబ్బులిచ్చి ఓట్లు అభ్యర్థిస్తారు, కానీ కాసాని దీనికి భిన్నంగా తన ఎన్నికల ఖర్చుకు ప్రజలే డబ్బులు ఇవ్వాలని నోటివ్వండి - ఓటేయ్యండి నినాదంతో సుజాతనగర్ పంచాయతీ ఎన్నికల్లో ప్రచారం నిర్వహించగా, ప్రజలు రెండు లక్షల రూపాయలు ఆర్థిక సాయం చేయడంతో పాటు నాలుగు వందల ఓట్ల మెజారిటీతో సర్పంచ్‌గా గెలిపించారు. వామపక్ష ఐక్యత కోసం మాటలతోనే సరిపెట్టకుండా ఆచరణలో విశేషమైన కృషి చేశాడు. సోదర సీపీఐ నుండి ఎవరైనా పార్టీని వీడుతుంటే వ్యక్తిగతంగా వారి వద్దకు వెళ్లి 'మీరు పార్టీ మారొద్దని కమ్యూనిస్టు పార్టీలోనే ఉండాలని 'వారికి విజ్ఞప్తి చేసి నిలబెట్టేవారు.2023 అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం సీపీఐ అభ్యర్థిగా కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు పోటీ చేసినప్పుడు పార్టీ పిలుపు మేరకు తనకు తీవ్రమైన జ్వరం వచ్చినప్పటికీ చేతికి క్యాన్‌లా తన కారుకి గ్లూకోస్ బాటిల్ పెట్టుకుని మరీ ప్రచారం నిర్వహించి సాంబశివరావు గెలుపునకు కృషి చేశాడు.

చివరిశ్వాస వరకు ప్రజల కోసమే...

మార్క్సిస్టు పార్టీ నాయకుడిగా ప్రజలతో మమేకమవుతూ అతి సాధారణమైన జీవితాన్ని గడిపాడు. రాజకీయంగా భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, ఇతర రాజకీయ పార్టీల నాయకులు సైతం వ్యక్తిగతంగా అభిమానించేవారు, ఇష్టపడేవారు, గౌరవించేవారు. కామ్రేడ్ కాసాని మర ణించిన రోజు పార్టీ శ్రేణులతో పాటు ఇతర రాజకీయ పార్టీల నాయకత్వం కొత్తగూడెం నుండి సుజాతనగర్ వరకు పది కిలోమీటర్లు కాసాని అంతిమయాత్రలో కాలినడకన పాల్గొని తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు.నైతిక విలువలు పాటిస్తూ, ఆదర్శంగా, నిరాడంబరంగా జీవించడం కార్యకర్తలు అలవర్చుకోవాలని, ప్రజల చేత ప్రేమించబడాలని నిత్యం కార్యకర్తలకు కాసాని బోధించేవాడు. ఏదో ఒక ప్రజా సమస్యను తీసుకుని నిరంతరం ప్రజల్ని కదిలించి పోరాటాలతో ఉగ్రరూతలూగిస్తూ, మాస్ పోరాటాలు నిర్మించాలని పరితపించేవాడు. అందుకే తనకు ఎన్ని అనారోగ్య సమస్యలు వచ్చినా లెక్కచేయకుండా పట్టుదలతో గుండె ధైర్యంతో కడవరకు పోరాటాల్లో ఉన్నారు. తాను చనిపోవడానికి వారం రోజుల ముందు సుజాతనగర్‌లోని ఏడు గ్రామ పంచాయతీలను కొత్తగూడెం కార్పొరేషన్‌లో కలపొద్దని పెద్ద ఉద్యమానికి శ్రీకారం చుట్టాడు.కలెక్టరేట్ ధర్నాకి ప్రజల్ని కదిలించడానికి తానే స్వయంగా ఇరవై గ్రామాలు తిరిగి అర్బన్ స్వభావం రాని పల్లె ప్రాంతాలను కార్పొరేషన్ లో కలపడం వలన జరిగే నష్టమేమిటో వివరించి ప్రజల్ని చైతన్యం చేశాడు. డయాలసిస్ పేషెంట్ అయినప్పటికీ ఏమాత్రం ఆలోచించ కుండా ఈ పోరాటంలో కీలక పాత్ర పోషించి ప్రజల్ని కదిలించాడు. అందుకే కాసానితో ప్రయాణం చేసిన ప్రతి ఒక్కరికి అనిపిస్తుంది, ఓపిక ఉన్నంతవరకు కాదు ఊపిరి ఉన్నంతవరకు ఎర్రజెండా మోయాలని.నడుస్తున్న కాలానికి ఉదయించే సూర్యునిలా చైతన్య జ్వాలలు రగిలించిన కామ్రేడ్ కాసానికి విప్లవ జోహార్లు.

(నేడు సుజాతనగర్‌లో కామ్రేడ్ కాసాని సంస్మరణసభ) ■

రుణాల చెల్లింపు కోసం బ్యాంకుల వేధింపులు



పాడి రైతుల ఆవేదన

నవతెలంగాణ - శంకరపట్నం : పాడి గేదెల పెంపకం కోసం 9 సంవత్సరాల క్రితం బ్యాంకులో రుణాలు తీసుకున్న పాడి రైతులు, కొంత డబ్బు చెల్లించినప్పటికీ బ్యాంకు అధికారులు మిగిలిన రుణం, వడ్డీతో కలిపి లక్ష రూపాయలు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రుణాలు తీసుకున్న డబ్బు చెల్లించకపోతే ఇంటికి తాళం వేస్తామని బెదిరిస్తున్నారని రైతులు శనివారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి రైతులు 9 సంవత్సరాల క్రితం పాడి గేదెల పెంపకం కోసం బ్యాంకులో రుణాలు తీసుకున్నామని,కొంత రుణం చెల్లించినప్పటికీ, బ్యాంకు అధికారులు మిగిలిన రుణం మరియు వడ్డీ కలిపి లక్ష రూపాయల పైనే చెల్లించాలని, డబ్బు చెల్లించకపోతే ఇంటికి తాళం వేస్తామని బ్యాంకు అధికారులు పాడి రైతులను బెదిరిస్తున్నారు. సహాయం అందించాలని, బ్యాంకుల వేధింపులను ఆపాలని కోరుతూ రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. రైతు రుణమాఫీ లాగానే పాడి రైతుల ఇల్లు మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. సమావేశంలో గరిగే కోటేశ్వర్, మొలుగూరి తిరుపతిగౌడ్, జనగాం రమేష్, దొంగల సతీష్, దొంగల లక్ష్మణ్, బోడ తిరుపతిరెడ్డి, తిప్పిరెడ్డి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

బెస్ట్ అంగన్‌వాడీ టీచర్‌గా పద్మకు సన్మానం

నవతెలంగాణ - గంగాధర



గంగాధర మండలం గర్శకుర్తి గ్రామానికి చెందిన చిప్ప పద్మ బెస్ట్ అంగన్‌వాడి టీచర్‌గా ఎంపిక కాగా, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేల సత్పతి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని పద్మను బెస్ట్ అంగన్‌వాడి టీచర్‌గా ఎంపిక చేయగా, కలెక్టర్ చేతుల మీదుగా సన్మానం పొందారు. ఆటపాటల మధ్య విద్య నేర్పే అంగన్‌వాడి పాఠశాలలో చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పుతూ ఉత్తమ అంగన్‌వాడీ టీచర్ ఎంపిక కావడం పట్ల సీడీపీవో నర్సింగరాణి, సూపర్ వైజర్ రేణకతోపాటు పలువురు పద్మను అభినందించారు.

మహిళల ప్రగతితోనే సమాజ అభివృద్ధి

- కలెక్టర్ పమేలా సత్పతి

- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

నవతెలంగాణ - కరీంనగర్

మహిళలు ఉన్నత చదువులు చదివి, ఆర్థిక ప్రగతి సాధిస్తేనే సమాజం అభివృద్ధి చెందుతుందని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళలు తప్పనిసరిగా చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని, బాలురతో సమానంగా బాలికలను పెంచి ఉన్నత చదువులు చెప్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. చదువుతోనే సమాజంలో గౌరవం, గుర్తింపు వస్తాయని.. ఎంత కష్టమైనా ఉన్నత చదువులు చదవాలని బాలికలకు సూచించారు. మహిళలు ఏ రంగంలో ఉన్నా బాధ్యతలు మర్చిపోవద్దని.. అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. ఉన్నత చదువులు, ఆర్థిక స్వేచ్ఛ మహిళల సొంతమైతే సాధికారత సాధ్యమవుతుందన్నారు. సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి మాట్లాడుతూ..మంచి, చెడు చెప్పి విచక్షణ కలిగిన పిల్లలుగా తీర్చిదిద్దాలన్నారు. రాష్ట్ర చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శోభారాణి మాట్లాడుతూ.. ఎవరో వస్తారని ఎదురు చూడకుండా మనకు మనం ఎదగాలన్నారు. బాలికల హక్కులు, మహిళల కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న చట్టాలను వివరించారు. అనంతరం కేకు కట్‌చేసి కలెక్టర్‌ను వివిధ శాఖల ఉన్నతాధికారులు సన్మానించారు. శ్రీనిధి రుణాల్లో పనితీరు కనబరిచినందుకు జమ్మికుంట, హుజురాబాద్ పట్టణ సమాఖ్య అధ్యక్షురాళ్లకు సర్టిఫికెట్, మెమోంటో అందించారు. బాలభవన్ చిన్నారులు, వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన కరాటే విన్యాసాలు, యోగ ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులను కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సబిత, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, జిల్లా అదనపు వైద్యాధికారి సుజాత, మెప్మా పీడీ వేణుమాధవ్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి, సీడీపీఓలు, అధికారులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్



విన్యాసాలు చేస్తున్న విద్యార్థినులు

హక్కుల కోసం మహిళలు ఉద్యమించాలి

ఐద్వా జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి



నవతెలంగాణ - కరీంనగర్

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని కోతిరాంపూర్‌లోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గుడికందుల సంధ్య అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 78సంవత్సరాలు కావస్తున్నా మహిళలకు ఇంకా సరైన స్వాతంత్ర్యం రాలేదని, అడుగడుగున మహిళలు అణచివేతకు, వేధింపులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు రాజకీయంగా హామీలు ఇస్తూ అధికారంలోకి వచ్చాక విస్మరిస్తున్నారని అన్నారు. దేశంలో మనుధర్మశాస్త్రం పేరా మహిళలని అణిచివేస్తూ, మహిళలు వంటింటి కుందేలుగానే ఉండాలని భావిస్తున్నారని.. బేటి బచావో, బేటి పడావో నినాదాలుగానే మిగిలిపోతున్నాయని దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోతుందని రోజు రోజుకు మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అరికట్టవలసిన ప్రభుత్వాలు నిద్రావస్థలో ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదైనా ఘటనలు జరిగినప్పుడే తూతూమంత్రంగా పర్యటనలు చేసి చేతులు దులుపుకుంటున్నారని, శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టడం లేదని అన్నారు. మహిళల రక్షణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని, 33శాతం రిజర్వేషన్లు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళల హక్కుల సాధనకు ఉద్యమించాలని అన్నారు. అనంతరం ఐద్వా ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు ద్యావా అన్నపూర్ణ, నగర కార్యదర్శి చేని రోజా, జి.సంధ్య, టౌన్ ఉపాధ్యక్షురాలు అరుణ, లక్ష్మి, గొట్టి ముక్కుల మమత, బి.కవిత, భవాని, యమునా, స్వప్న, బి.రాజమణి, కె. దీపిక, కె.సుజన, ఎం.శాంతవ్వ, సరోజ, మనమ్మ లక్ష్మి రజిని, కనకలక్ష్మి, మానస, అనిత, అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

నవతెలంగాణ - జమ్మికుంట



జమ్మికుంట పట్టణంలోని సంజీవని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం ఉచిత మెగా మహిళా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 300పైగా మహిళలకు 3000 రూపాయల విలువైన పరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ముషం ప్రణీత ఎంఎస్ (ఓబిజి) గైనకాలజిస్ట్ గర్భిణులు, ఇతర మహిళలను పరీక్షించి సలహాలు సూచనలు చేశారు. డాక్టర్ ఊడుగుల అనిత ఎంఎస్, జనరల్ అండ్ లాపరోస్కోపిక్ సర్జన్ స్త్రీల అనేక రకాల సమస్యలకు పరీక్షించి, సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ముషం సురేష్, డాక్టర్ కిషోర్ కుమార్ కామిశెట్టి, డాక్టర్ ఊడుగుల సురేష్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టులో మహిళా దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ - హుజురాబాద్

హుజురాబాద్ కోర్టు ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను, మెగాలోక్ అదాలత్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ జడ్జి పిబి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మహిళలు చైతన్యవంతం అయితే ఆ కుటుంబం మొత్తం బాగుపడుతుందని, మహిళలే సమాజాభివృద్ధికి, దేశాభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. కార్యక్రమంలో మెజిస్ట్రేట్‌లు జి.స్వాతి, పద్మసాయిశ్రీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోస్కుల శ్రీనివాస్, ఏజీపీ గుర్రం శ్రీనివాస్, సిఐలు తిరుమల్‌గౌడ్, వి.రవి, బార్ అసోసియేషన్ కార్యదర్శి మట్టెల తిరుపతి, లోక్ అదాలత్ సభ్యులు వై.అరుణ్ కుమార్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి వినతి

నవతెలంగాణ - హుజురాబాద్



హుజురాబాద్ నియోజకవర్గంలో ఉన్న దేవాలయాల అభివృద్ధికి, అర్చకుల సమస్యలపై దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండ సురేఖను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి కాంగ్రెస్ హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రణవ్‌బాబు వినతిపత్రం ఇచ్చారు. అపర భద్రాద్రిగా పేరొందిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి త్వరలోనే కమిటీని ఏర్పాటు చేస్తామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు ఘనంగా నిర్వహిస్తామని మంత్రికి తెలిపారు.

నల్లగొండ లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ - తిమ్మాపూర్

తిమ్మాపూర్ మండలం నల్లగొండ శ్రీ సీతారామ లక్ష్మీ నృసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా నిర్వహించాలని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం మహాత్మా నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ముఖ్యంగా రథోత్సవం, బండ్లు తిరిగే రోజు ఎలాంటి అపశృతులు దొర్లకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నల్లగొండ దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ బండారు లక్ష్మణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మీనారాయణగౌడ్, నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాస్‌రావు, గొట్టేముక్కల సంపత్‌రెడ్డి, గొట్టిముక్కుల సంపత్‌రెడ్డి, మార్క నర్సయ్య, నేదునూరి ఎల్లయ్య, కాసర్ల సమ్మయ్య, రొడ్డ సాగర్, డైరెక్టర్లు గాజుల అంజయ్య, బి.శ్రీనివాస్, కె.లక్ష్మీరాజం, ఆలయ కార్యనిర్వాహక అధికారి నాగుల అనిల్ కుమార్ పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో నూతన ఆవిష్కరణలు

సైన్స్ ఫెయిర్ ప్రారంభోత్సవ సభలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

నవతెలంగాణ - మానకొండూర్



ప్రదర్శనలను తిలకిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

నూతన ఆవిష్కరణలకు శాస్త్ర, వైజ్ఞానిక ప్రదర్శనలు తోడ్పడతాయని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మానకొండూర్ మండల కేంద్రంలోని వేద హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన శాస్త్ర విజ్ఞాన ప్రదర్శన సైన్స్‌ఫెయిర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాస్త్ర, వైజ్ఞానిక ప్రదర్శనలు వల్ల విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యాలను పెంచవచ్చన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న శాస్త్ర సాంకేతిక (విజ్ఞాన, గణితశాస్త్ర) నైపుణ్యాలను వెలికితీసి వారి ప్రతిభకు సైన్స్ ఫెయిర్‌లు పదును పెడతాయన్నారు. విద్యార్థుల్లో విజ్ఞానం పెంపుతోపాటు నూతన ఆలోచనలు రేకెత్తించేందుకు ఉపాధ్యాయుల కృషి చేయాలన్నారు. అన్ని విద్యాసంస్థల్లో సైన్స్ ఫెయిర్‌లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. పాఠశాల దశ నుంచి సైన్స్, గణితం సబ్జెక్టుల్లో పట్టు సాధించే విధంగా విద్యార్థులను తయారు చేయడంలో ఈ ప్రదర్శనలు ఎంతో దోహదం చేస్తాయని పేర్కొన్నారు. అన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తమ విద్యార్థులను వైజ్ఞానిక ప్రదర్శనలోని ఉప అంశాల వారీగా ప్రాజెక్టులను తయారు చేసేలా చూడాలన్నారు. విద్యార్థులు ఉన్నత ఆశయాలతో ముందుకు సాగాలని, భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాక్షించారు. రైతు కోసం 'సైన్స్ అండ్ టెక్నాలజీ' పేరుతో రూపొందించిన పలు ప్రాజెక్టులను ప్రదర్శించిన విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు. ఈ సమావేశంలో వేద స్కూల్ ప్రిన్సిపాల్ శ్యాంసుందర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి.రామకృష్ణారావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సంపత్‌గౌడ్, పార్టీ నాయకులు సుదగోని లక్ష్మినారాయణగౌడ్, ఒగ్గె దామోదర్, ముద్దసాని శ్రీనివాస్‌రెడ్డి, కొండ్ర సురేష్, తాళ్లపల్లి నరేష్, నాగిశెట్టి రాజయ్య, వాల అంజిత్‌రావు, ఇర్ఫాన్, బండి మల్లేశం, చలిగంటి సంపత్, ఏగోళపు శ్రీనివాస్, సాయిరి దేవయ్య, తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటైనా నైతికంగా కాంగ్రెస్‌దే విజయం

సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



నవతెలంగాణ - కరీంనగర్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటైనా నైతికంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించాడని.. ఓటర్లకు అవగాహన కల్పించి ఉంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి 5వేలపైన మెజారిటీతో గెలిచే వాడని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ.. ప్రాధాన్యత ఓట్ల గురించి చిన్న చిన్న తప్పుల వల్ల ఓటు చెల్లకుండా పోతుందని తెలియక పోవడం వల్ల 28వేల ఓట్లు వృథా అయ్యాయన్నారు. అందులో సగానికిపైగా కాంగ్రెస్ అభ్యర్థికి చెందినవే ఉన్నాయని అన్నారు. మెజారిటీ ఓటర్ల తీర్పు కాంగ్రెస్ అభ్యర్థి వైపు ఉన్నా సాంకేతికంగా ఓటమి చెందారని, దీనికి బీజేపీ నాయకులు విర్రవీగడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఓటర్లు ఈవీఎంలకు అలవాటు పడ్డారని, ఓటర్లు కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి పేరుకు ఎదురుగా కొంతమంది 01 అని ఓటర్ లిస్టులో 2వ స్థానంలో ఉండడం వల్ల 02 అని రైట్ గుర్తు పెట్టి ఇలా దాదాపు 15వేలకు పైచిలుకు ఓట్లు చెల్లని ఓట్లు వేశారని వీరందరూ కూడా కాంగ్రెస్ పార్టీకి మద్దతుగానే వేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో సమన్వయం గురించి సునీల్‌రావు మాట్లాడడమేంటని, కొత్తగా బీజేపీలో చేరిన ఆయన మొదలు అక్కడ అసమ్మతివాదుల గురించి తెలుసుకుని మాట్లాడాలని హితవుపలికారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ గురించి మాట్లాడే స్థాయి సునీల్‌రావుది కాదన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రవీందర్‌సింగ్ బీఆర్ఎస్ కండువా కప్పుకొని నామినేషన్ దాఖలు చేశాడని ఆయనకు ఆ పార్టీ మద్దతు ఇవ్వకుండా చీకటి ఒప్పందం ప్రకారం బీజేపీకి మద్దతు ఇచ్చిందని ఆరోపించారు. సమావేశంలో నాయకులు కొరివి అరుణ్ కుమార్, శ్రవణ్ నాయక్, అర్ష మల్లేశం, నగేష్ ముదిరాజ్, జీడి రమేష్, దండి రవీందర్, దన్న సింగ్, మామిడి సత్యనారాయణరెడ్డి, కుర్ర పోచయ్య, చాంద్ పాషా, మహమ్మద్ బారీ, బషీర్, వాడి వెంకట్‌రెడ్డి, ఆంజనేయులు, సాయిరాం పాల్గొన్నారు.

అవోపా అభివృద్ధికి కృషి చేస్తా

అధ్యక్షుడు ఆకినపెల్లి శ్రీనివాస్

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



నవతెలంగాణ - జమ్మికుంట

ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని జమ్మికుంట అధ్యక్షుడు ఆకినపెల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జమ్మికుంటలోని అవోపా భవనంలో ఆకినపెల్లి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి అయితు ఈశ్వర్ ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి కొండ్లె నగేష్, ఆర్థిక కార్యదర్శి మంచాల రాంబాబు, అదనపు ప్రధాన కార్యదర్శి రావికంటి పవన్ కుమార్, ఉపాధ్యక్షులు గందె ప్రవీణ్ కుమార్, బచ్చు శివకుమార్, ఇతర కార్యవర్గ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శిగా తాడిశెట్టి సురేష్, వ్యాంసాని రమేష్, చందా శివకుమార్, యాద శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పుల్లూరి చంద్రశేఖర్, యాద చంద్రశేఖర్, మహిళా విభాగం ప్రతినిధి రావికంటి పద్మ, లెంకలపెల్లి శరత్ కుమార్, లీగల్ అడ్వైజర్ రావికంటి మధుబాబు, మీడియా కన్వీనర్ భూపతి సంతోష్, నూక సురేష్ బాబు సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలి

మాజీ కౌన్సిలర్ ప్రతాప తిరుమల్ రెడ్డి



నవతెలంగాణ - హుజూరాబాద్ టౌన్ : ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని, మంచి ఆహారం, స్వచ్ఛమైన నీరు తీసుకోవాలని 4వ వార్డు మాజీ కౌన్సిలర్ ప్రతాప తిరుమల్‌రెడ్డి అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కౌన్సిలర్ తిరుమల్‌రెడ్డి స్వగృహంలో శ్రీరామ హాస్పిటల్ సహకారంతో జనరల్ ఫిజిషియన్, డయాబెటాలజిస్టు శ్రీకర్ మోడెపు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి మున్సిపల్ కమిషనర్ కెంసారపు సమ్మయ్య, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, వైద్యురాలు మౌనిక, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, మహిళలు సందర్శించారు. ఉచిత వైద్య శిబిరాన్ని తిరుమల్‌రెడ్డి ప్రారంభించగా వైద్యులు షుగర్, బీపీ, అవసరమున్న వారికి రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసిన శ్రీరామ హాస్పిటల్ యాజమాన్యాన్ని, వైద్యులను తిరుమల్‌రెడ్డి అభినందించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గందె రాధికతో పాటు మహిళలను, వైద్యులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో హాస్పిటల్ యాజమాన్యం నంభి భరణికుమార్, ముష్కె శ్రీనివాస్, పూరి, సిబ్బంది ఐషు, అంజలి, సునీత, దీపిక, సంధ్య, సతీష్, నిఖిల్‌రెడ్డి, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ మాత్రమే అనేక పాత్రలు పోషిస్తారు

- జిల్లా జడ్జి ప్రతిమ

నగరంలో మహిళల వాక్‌థాన్





నవతెలంగాణ - కరీంనగర్

కరీంనగర్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన 3కే వాక్‌థాన్ మహిళలలో అపూర్వమైన ఉత్సాహాన్ని నింపింది. కరీంనగర్ రన్నర్స్ అండ్ సైక్లిస్ట్ అసోసియేషన్ (కేఆర్‌సీఏ) ఆధ్వర్యంలో అంబేద్కర్ స్టేడియం నుండి ప్రారంభమైన ఈ వాక్‌థాన్‌లో కేఆర్ సీఏ అధ్యక్షులు, ఐవీ హైస్కూల్ వ్యవస్థాపకులు పసుల మహేష్, పద్మావతి, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ విమల, ఇతర ప్రముఖులు గాయత్రి, స్వప్న, కావ్య హేమ, రవీందర్, శివ, శ్రీనివాస్, సంతోష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా జిల్లా జడ్జి ప్రతిమ హాజరై మహిళలకు ప్రోత్సాహాన్నిచ్చారు. ఈ సందర్భంగా జడ్జి ప్రతిమ మాట్లాడుతూ స్త్రీ ఒక్కరు మాత్రమే అనేక పాత్రలు పోషిస్తారన్నారు. తల్లిగా, సోదరిగా, భార్యగా, ఉద్యోగస్తురాలిగా సమాజానికి తోడుగా నిలుస్తారని కొనియాడారు. మహిళల త్యాగాన్ని గౌరవించే దినంగా మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, ఆత్మవిశ్వాసమే అసలైన ఆయుధమని అన్నారు.

ఉరుకుల పరుగుల జీవితంలో వాకింగ్ అంటే పెద్దగా తెలియని నగరంలో 1500మందికిపైగా మహిళలు చిన్నా, పెద్దా తేడా లేకుండా ఈ వాక్‌థాన్‌లో పాల్గొనడం విశేషం. ఐవీ హైస్కూల్, సిద్ధార్థ పాఠశాల ఉపాధ్యాయులు, గృహిణులు, చేనేత వస్త్రాలు, ఏకరూప దుస్తులు ధరించిన మహిళలు అంబేద్కర్ స్టేడియం నుండి ప్రతిమ మల్టీప్లెక్స్ వరకు వాక్ చేసి తిరిగి స్టేడియంకు చేరుకున్నారు. వాక్‌లో పాల్గొన్న మహిళలందరికీ కేఆర్ సీఏ సభ్యులు ప్రత్యేకంగా మెడల్స్ అందజేయడంతో పాటు రిఫ్రెష్మెంట్స్ కూడా ఏర్పాటు చేశారు. ఈ వాక్‌థాన్‌ను విజయవంతం చేయడంలో జిల్లా పాలన యంత్రాంగం, కిడ్స్ మాల్ బృందం పూర్తిస్థాయిలో సహకరించాయి. వీరందరికీ కేఆర్ సీఏ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రజనీ ఫెర్టిలిటీ సెంటర్‌లో మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ - కరీంనగర్



లక్కీడ్రా తీస్తున్న గాయని మధుప్రియ

ప్రతి మగాడి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటే, ప్రతి స్త్రీ శక్తి వెనుక పురుషుడి సహకారం కూడా ఉండాల్సిందే అని ప్రముఖ గాయని మధుప్రియ అన్నారు. శనివారం నగరంలోని రెనె హాస్పిటల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రజనీ ఫెర్టిలిటీ సెంటర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మధుప్రియ ముఖ్య అతిథిగా హాజరై, మహిళల పాత్ర, సంతాన సాఫల్య వైద్య సేవల ప్రాముఖ్యతపై తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సృష్టికి మూలం అమ్మే. ఆడపిల్ల అస్తిత్వమే ఆనందపూరిత సమాజ నిర్మాణానికి ఆధారం అని వ్యాఖ్యానించారు. ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించిన రెనీ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ బంగారి స్వామి, డైరెక్టర్ డాక్టర్ రజనీ ప్రియదర్శిని దంపతుల సేవా గుణాన్ని అభినందించారు. ప్రతి ఏటా రూ. 20 లక్షల విలువైన సంతాన సాఫల్య సేవలను ఉచితంగా అందించటం గొప్ప సేవామూర్తిని తలపిస్తోంది అని ఆమె అన్నారు.

లక్కీడ్రా

ఉచిత ఫర్టిలిటీ సేవలు పొందేందుకు అర్హులైన 10 మందిని లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. మొత్తం 348 మంది రిజిస్ట్రేషన్లు చేసుకోగా, లక్కీ డ్రాలో ఎంపికైన 10మందికి లక్షల రూపాయల విలువైన ఆధునిక వైద్య సేవలను ఉచితంగా అందించనున్నట్లు ఆస్పత్రి యాజమాన్యం వెల్లడించింది.

ఈ సందర్భంగా డాక్టర్ బంగారి స్వామి మాట్లాడుతూ చిన్న స్థాయిలో ప్రారంభమైన మా సేవా ప్రయాణం, ఇప్పుడు సామాజిక బాధ్యతగా రూపుదిద్దుకుందన్నారు. ఏటా రూ.50లక్షలకు పైగా ఉచిత వైద్య సేవలు అందించడం గర్వకారణం అని తెలిపారు. డాక్టర్ రజనీ ప్రియదర్శిని మాట్లాడుతూ తమ అత్త పేరిట ఉచిత సంతాన సాఫల్య వైద్యాన్ని అందించడం ఎంతో సంతృప్తిని కలిగిస్తోందని అన్నారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా గాయని మధుప్రియను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ బుర్ర మధుసూదన్‌రెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించగా, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రారెడ్డి, డీన్ డాక్టర్ మునీష్, గుండె వైద్య నిపుణుడు డాక్టర్ దినకర్ తాటిమట్ల, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ నిఖిల్ లక్ష్మణ్, డాక్టర్ లతీష్‌రెడ్డి, నాన్-క్లినికల్ డైరెక్టర్ మేకల అరవింద్‌రావు, జనరల్ మేనేజర్ పవన్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌ను అవమానపరిచిన దుండగులను కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-ఎండపల్లి


నిరసన తెలుపుతున్న నాయకులు

సారంగాపూర్ మండలంలోని నాగునూర్ గ్రామంలో గుర్తు తెలియని దుండగులు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి శుక్రవారం చెప్పుల మాల వేయడం అవమానకరంగా భావిస్తూ రాష్ట్ర సీనియర్ దళిత సంఘ నాయకులు చుంచు మల్లేశం అధ్వర్యంలో ఎండపల్లి మండలంలో రాజారాంపల్లి గ్రామ కూడలి వద్ద నిరసన తెలిపారు. వెంటనే కఠినంగా దుండగులను శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సీనియర్ నాయకులు పడిదేం వెంకటేష్, జిల్లా నాయకులు. గాధం భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి లింగం పల్లి లక్ష్మణ్, మాజీ మండల అధ్యక్షుడు బోయిని సతీష్, యువత మంతెన సంజీవ్, సురేష్, శ్రీను, అరికిళ్ల మహేందర్. చొప్పదండి రాములు మంతెన రాజు, దుర్గం కృష్ణ పాల్గొన్నారు.

మై ఆటో ఈజ్ సేఫ్

నవతెలంగాణ-కోరుట్ల



మై ఆటో ఈజ్ సేఫ్‌తో ప్రయాణం సురక్షితం అని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా కోరుట్ల పోలీస్‌ల ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం మై ఆటో ఈజ్ సేఫ్ అనే కార్యక్రమాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యూ ఆర్ కోడ్ యాప్ ద్వారా క్యూ ఆర్ కోడ్ ప్రతి ఆటోకు రిజిస్ట్రేషన్ చేసి క్యూ ఆర్ కోడ్ స్టిక్కర్ అతికించి ఉంచుతారని దీంతో మహిళలు పిల్లలు ఆటోలో విలువైన వస్తువులు మరిచిపోయిన, ఆటోలో ప్రయాణం చేసిన సురక్షితమని అన్నారు. క్యూ ఆర్ కోడ్ రిజిస్ట్రేషన్ చేసిన ఆటో ప్రతి పోలీస్ స్టేషన్‌లో అన్ని వివరాలు ఉంటాయని అన్నారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాములు, సీఐ సురేష్‌బాబు, ఎస్ఐలు శ్రీకాంత్, శ్యామ్ రాజ్, నవీన్‌కుమార్, రాం చంద్రం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చింతలకుంట తూము, కట్ట మరమ్మతులు పూర్తయ్యేది ఎప్పుడు?

నవతెలంగాణ- మేడిపల్లి



మేడిపల్లి మండలంలోని కల్వకోట గ్రామంలోని చింతలకుంట తూము పునర్నిర్మాణం, కట్ట మరమ్మతు కోసం ఎఫ్‌డిఆర్ 2022-23 అంచనా విలువ రూ.8.50 లక్షలు మంజూరు అయ్యాయి. నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో కాకపోవడంతో కల్వకోట గ్రామస్తులు, రైతులు ఇబ్బంది పడుతు న్నారు. సంబంధిత సదరు కాంట్రాక్టర్ తూము పునర్నిర్మాణం చేసినప్పటికిని కట్ట మరమ్మత్తు రాళ్లను పొందుపరచుటలో అలసత్వం వల్ల పూర్తిస్థాయిలో పని జరగలేదని గ్రామస్తులు తెలిపారు. పనులు శరవేగంగా జరిగేలా సంబంధిత అధికారులు ప్రత్యక్ష పర్యవేక్షణ చేయాలని పనుల పురోగతి అయ్యే విధంగా చూడాలని గ్రామస్తులు కోరారు.

జువ్వాడి కృష్ణారావు పరామర్శ


నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం


పరామర్శిస్తున్న కష్ణారావు

ఇబ్రహీంపట్నం మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దూదిగామ గంగాధర్ తల్లి శనివారం మృతి చెందింది. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, గంగాధర్ స్వగ్రామం మండలంలోని కోమటి కొండాపూర్‌లో మృతదేహానికి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన అంతిమయాత్రలో పాల్గొన్నారు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ , వైస్ చైర్మన్ వెంకటరెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మాజీ సర్పంచ్లు జలేష్ మాజీ ఎంపీపీ టీసీలు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహాన్ని అవమానించిన దుండగులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-రాయికల్



పట్టణంలోని కోరుట్ల క్రాసింగ్ వద్ద గల అంబేద్కర్ కాంస్య విగ్రహానికి జై భీమ్ యూత్ సభ్యులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం రాష్ట్ర మాల సంక్షేమ సంఘం సభ్యులు చెంగలి గంగాధర్,జై భీమ్ యూత్ సభ్యులు మాట్లాడుతూ.. సారంగాపూర్ మండలం నాగునూరు గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన దుండగులను వెంటనే గుర్తించి,చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు ఆకు రాజేందర్, బైరి రాజేందర్,బూరం నర్సయ్య,ముక్కెర శ్రీనివాస్, ఆకుల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పటేల్ విగ్రహంపై తొలగించిన ముసుగు

-నవతెలంగాణ ఎఫెక్ట్


నవతెలంగాణ-రాయికల్



ఎన్నికల కోడ్ ముగిసినా... మహనీయులపై తొలగని ముసుగు శీర్షికన నవతెలంగాణ దినపత్రికలో శనివారం ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించి ఎన్నికల కోడ్ నియమాల వల్ల సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహంపై వేసిన ముసుగును మున్సిపల్ సిబ్బందితో తొలగించారు. అధికారుల స్పందన పై స్థానికులు, పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఇష్టా రెస్టారెంట్‌పై మున్సిపల్ అధికారులు దాడులు

నవతెలంగాణ-కోరుట్ల



పట్టణంలోని ఇష్టా హోటల్‌లో మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించారు. నిల్వ ఉంచిన చికెన్, ఆహార పదార్థాలను మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకుని, హోటల్‌లో వాడుతున్న నూనె, పాత్రలు పరిశీలించి సుమారుగా రూ.10వేల జరిమానా విధించారు. హోటల్‌లో వండే పదార్థాలు శుభ్రంగా ఉండాలని, ఇలాంటివి మళ్ళీ జరిగితే భారీగా నష్ట పరిహారం విధించి హెటల్‌ను సీజ్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ క్రాంతికుమార్, శానిటరీ ఇన్స్పెక్టర్ బాలే అశోక్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలులో దళారుల దందా

నవతెలంగాణ- మేడిపల్లి




ఉమ్మడి మేడిపల్లి మండలంలోని పోరుమళ్ళ, కట్లకుంట, తొంబర్రావుపేట్, మేడిపల్లి, దమ్మన్నపేట, మన్నెగూడెం, తదితర గ్రామాలలో దళారులు రైతుల పంట కల్లాల వద్ద కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుం టున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాల యంలో నామమాత్రపు బిల్లులతో యథేచ్ఛగా క్యాంటర్ల ద్వారా మొక్కజొన్న సంచులను మార్కెట్ సెలవు దినాలలో తరలిస్తున్నారు. ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని దళారుల దాడుల నుండి రైతన్నలను కాపాడాలని రైతు సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్


పనులు ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్, కలెక్టర్


మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రభుత్వం ప్రోత్సహకం అందిస్తుందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. రూ.5 కోట్లతో చేపట్టనున్న మహిళా శక్తి భవన నిర్మాణానికి భూమి పూజ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్‌తో చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని, రాబోయే ఐదేళ్లలో కోటి మందిని కోటీశ్వరులుగా తయారు చేసేందుకు ప్రభుత్వం కంకణం కట్టుకుందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదని పేర్కొన్నారు. మహిళల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యనిస్తుందన్నారు. జగిత్యాల జిల్లాలో 90 శాతం రుణమాఫీ జరిగిందని, రెండు లక్షల వరకు ఉన్న రైతులకు రుణమాఫీ జరిగిందని తెలిపారు. మిగతా వారికి కూడా త్వరలోనే రుణమాఫీ జరుగుతుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని వీటిని ఓర్వలేకనే బిఆర్ఎస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లాలో మహిళా సంఘాల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని స్వయం సహాయక బృందాలు సాధికారతకు కల్పించడానికి వారి జీవనోపాధి బలోపేతం చేయడానికి మహిళ శక్తి కార్యక్రమం అమలు చేస్తుందన్నారు. వచ్చే ఐదేళ్ల కాలంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మొత్తం స్వశక్తి సంఘాలు 15150 ఉన్నాయని, మొత్తం గ్రామ సమాఖ్య సంఘాలు 565 మండల సమైక్య సంఘాలు 18, జిల్లా సమైక్య జగిత్యాల సమైక్య ఒకటి ఉందని తెలిపారు. జిల్లాలో 0 వడ్డీ కింద స్వశక్తి మహిళలకు బ్యాంకు లింకేజీ ద్వారా ఒక్కో సంఘానికి రూ.20లక్షలు మంజూరు చేయడం జరిగిందని, 7071 సంఘాలకు 722.00 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని వెల్లడించారు. మిల్క్ ఎనిమల్స్ గ్రౌండింగ్ యూనిట్ ద్వారా మొత్తం 89 యూనిట్లకు 82,77 లక్షల రుణం ప్రభుత్వం మంజూరు చేస్తుందని, పౌల్ట్రీ యూనిట్ మొత్తం యూనిట్లో 1683 రుణం 2.93 లక్షలు మంజూరు చేసిందని పేర్కొన్నారు. పౌల్ట్రీ మదర్ యూనిట్ ద్వారా 18 యూనిట్లు 78 లక్షలు, మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్ ద్వారా ఒక్క యూనిట్‌కు రూ.10 లక్షలు ప్రభుత్వం ద్వారా మంజూరు చేస్తుందని చెప్పారు. జిల్లాలో 15 మహిళా సంఘాలకు 15 బస్సులు అందిస్తున్నామని, ఆ బస్సులు లీజు ఇస్తుందని దీని ద్వారా మహిళా సభ్యులకు ఒక నెలకు 77 వేల రెంటు ప్రభుత్వం చెల్లిస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.ఎస్ లత, ఎస్పీ అశోక్ కుమార్, ఆర్డీవో మధు సుధన్, డీఆర్డీవో రఘు వరుణ్, డీఎస్పీ మాజీ మున్సిపల్ చైర్మన్ జ్యోతి, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళా సాధికారికతోనే సమాజ అభివృద్ధి

జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

మహిళా సాధికారికతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసు కార్యాలయంలో విధి నిర్వహణలో రాణించిన మహిళా పోలీస్ సిబ్బందిని ఎస్పీ సన్మానించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మహిళల్లో సంకల్ప శక్తి ఎక్కువగా ఉందని, వారు ఏదైనా సాధించగలరని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లోనూ ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారని దేశంలో అన్ని రంగాల్లో పురుషుల కంటే మహిళలు వివిధ రంగాల్లో మెరుగ్గా రాణిస్తున్నారని పేర్కొన్నారు. హిళా అధికారులందరూ పోలీసు శాఖలో భాగమై సమాజానికి చేస్తున్న సేవను పేర్కొన్నారు. జిల్లా మహిళా సిబ్బంది సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ భీమ్‌రావు, డీఎస్పీలు రఘు చంధర్, రాములు, మహిళా ఎస్‌లు గీత, సుప్రియ, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు కిరణ్‌కుమార్, వేణు, ఎస్బి ఇన్స్పెక్టర్ ఆరిఫ్ అలీ ఖాన్ పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న మహిళ సిబ్బంది


రాయికల్: మాట్లాడుతున్న ఈజీఎస్ ఏపీవో దివ్య



మాట్లాడుతున్న విజయ లక్ష్మి

26 మంది విశిష్ట మహిళలకు పురస్కారాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. శనివారం సిటీజేన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో శ్రావణి సాంస్కృతిక సంస్థ సహకారంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశిష్ట న్యాయవాదులు పి.లావణ్య, డి.రమ్యకృష్ణలను, మహిళా సంఘాల నేతలు కస్తూరి శ్రీమంజరి, గంగం జలజ, బైరి రాధలను, సోషల్ వర్కర్ జే.సుమలతను, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, శారద, నాగమణి, రెవెన్యూ ఉద్యోగిని రాణి తోపాటు 26 మంది వివిధ రంగాలకు చెందిన విశిష్ట మహిళలను మహిళా రత్న పురస్కారాలతో తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి డి.విఠల్, ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, ఉపాధ్యక్షుడు పి.సి.హన్మంత్ రెడ్డి, శ్రావణి సంస్థ అధ్యక్షుడు దిండిగాల విఠల్, బీ.సీ.మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గంగం జలజ, సీనియర్ సిటీజేన్స్ జగిత్యాల మండల అధ్యక్షురాలు బైరి రాధ పాల్గొన్నారు.

కోరుట్ల :మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో మాజీ ఎంపీపీ తోట నారాయణ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. కేక్ కట్ చేసి మహిళా పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రస్తుత సర్పంచ్ తోట శారద లింగారెడ్డి, కార్యదర్శి నరేష్ ఆకుల గంగాధర్, మహిళా సంఘాల నాయకులు, ఏఎన్ఎం యమున, ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు

కోరుట్ల పట్టణంలో సీ.ప్రభాకర్ స్మారక గ్రంథాలయంలో చెన్న విశ్వనాథం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ఎంపీడీఓ కటకం ప్రభు, రాస భూమయ్య మహిళా నాయకులు పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలోని శ్రీ గ్రీన్ వుడ్,ప్రగతి,విస్డం పాఠశాలల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాస రచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. శ్రీ గ్రీన్ వుడ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంపీవో కె.సుష్మ, మాజీ జడ్పీటీసీ జాదవ్ అశ్విని, ఈజీఎస్ ఏపీవో దివ్య హాజరై మాట్లాడుతూ... నేటి సమాజంలో అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు పూర్తి సాధికారత సాధించాలని,ఝాన్సీ లక్ష్మీబాయి, సరోజినీ నాయుడు, చాకలి ఐలమ్మ, కల్పనా చావ్లా, కిరణ్ బేడీ,సైనా నెహ్వాల్ వంటి వారిని ఆదర్శంగా తీసుకొని బాలికలందరూ సమాజంలో ఆదర్శంగా తయారవ్వాలని దానికి అనుగుణంగా విద్యార్థి దశ నుండి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రిన్సిపల్, కరస్పాండెంట్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎండపల్లి: మహిళలు లేనిది ప్రపంచం లేదని సమస్త జగతికి ప్రాణాలు మహిళ అని తెలంగాణ ఆర్యవైశ్య పేద కుటుంబాల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సముద్రాల రమేష్ గుప్తా అన్నారు. శనివారం ఎండపల్లి మండలం అంబారీపేట గ్రామంలో మహిళా దినోత్సవం సందర్భంగా ఉపాధి హామీ పనులకు వెళ్లి వస్తున్న మహిళాలకు 80 మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు, అల్లంల రాజయ్య, ఎనగంటి దుబ్బయ్య, ఆరెల్లి రాహుల్, జాడి బాపు, తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలటౌన్: ఇంటికి దీపమైన ఇల్లాలు వెలుగుతోనే కుటుంబం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, అలాంటి ఇల్లాలును అన్ని రంగాల్లో ముందు ఉంచుతూ అన్నింటిలో పట్టం కడుతూ పైచేయిగా నిలపడంలో కాంగ్రెస్ ముందుందని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్‌రెడ్డి అన్నారు. ధర్మపురి మండల కేంద్రంలో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలకు హాజరై మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఆర్థిక స్వాలంబానకు అవసరం అయిన అన్ని ప్రయత్నాలు చేస్తుందన్నారు. ప్రతి పథకం మహిళల పేరుమీద ఉండేలా పథకాలకు రూపకల్పన చేస్తూ, అందులో మహిళలను భాగస్వాములను చేస్తూ సాధికారత వైపు అడుగులు వేసేలా ప్రయత్నం చేస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి శోభారాణి, నాగలక్ష్మి, సరిత, గోపిక, లావణ్య, మమత, జక్కు పద్మ, సంతోషీ, అరుణ, లత, రజిత, పద్మ స్వప్న, రూప తదితరులు పార్గొన్నారు.


ఉద్యోగులను సన్మానిస్తున్న గ్రామస్తులు

మెట్‌పల్లి: మండలంలోని ఆత్మనగర్ గ్రామంలో మహిళా ఉద్యోగులను గ్రామపంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. వివిధ శాఖల్లో పని చేస్తున్న వసంత,హేమ, సుజాత, నాగమణి, రేఖ,,ఆదర్శ మహిళలు సుశీల, నీలమ్మ, న్యాయవాది సుమలత ,గ్రామపంచాయతీ ఉద్యోగి అరుణను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నిజాముద్దీన్, చిలివేరి విజయ్, బండా రాజేందర్, మహిళలు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న యూట్యూబ్ విలేకరి అరెస్ట్

నవతెలంగాణ-మెట్‌పల్లి

మెట్‌పల్లి పట్టణంలో విలేకరిగా చలామణి అవుతూ అమాయకుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతూ, ప్రభుత్వ అధికారులపై నిరాధారణ ఆరోపణలు చేస్తున్న ఆర్ఆర్ న్యూస్ విలేకరి రాజశేఖర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు. సదరు వ్యక్తి గత కొంత కాలంగా విలేకరిగా చెప్పుకుంటూ ఆర్ఆర్ న్యూస్ పేరిట యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్నాడు. ఆదాయ మార్గాలు లేకపోవడంతో విలేకరి ముసుగులో అమాయక ప్రజలు, వ్యాపారులు, ప్రభుత్వ అధికారులను బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు వసూలు చేస్తున్నాడు. ఉన్న అమాయక ప్రజలతో తాను విలేకరినని, పోలీసులతో పరిచయాలు ఉన్నాయని నమ్మించి, సమస్యలను పరిష్కరిస్తానని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఫిబ్రవరి 12, 2025న రాజేశ్వరరావుపేటలో అక్రమ మొరం రవాణాను అడ్డుకోవడానికి వెళ్లిన ఇరిగేషన్ సబ్-డివిజన్ డీఈఈ లక్కంపల్లి అరుణోదయ్ కుమార్‌ను కొందరు వ్యక్తులు అడ్డుకుని, బ్లాక్ మెయిల్ చేసి రూ.1,50,000 వసూలు చేసినట్లు రాజశేఖర్ తెలుసుకొని, ఆ అధికారిని బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు వసూలు చేయాలని పథకం వేశాడు. మార్చి5, 2025న ఎస్ఆర్ఎస్పీ క్యాంపులో ఆ అధికారిని బెదిరించి లక్ష రూపాయలు డిమాండ్ చేశాడు. లేనిపక్షంలో తన ఛానల్‌లో తప్పుడు కథనాలు ప్రచురిస్తానని బెదిరించగా భయపడిన ఆ అధికారి రూ.5 వేలు ఇచ్చి మిగతా డబ్బులు తర్వాత ఇస్తానని చెప్పాడు. ఈ విషయాన్ని అడ్డుపెట్టుకొని పోలీసుల ప్రతిష్టను దెబ్బతీయాలని భావించి, సోషల్ మీడియాలో 'ఆర్ఆర్ న్యూస్ తెలంగాణ' అనే వాట్సాప్ గ్రూపులో ఇరిగేషన్ అధికారి నుండి అక్షరాల 1,50,000 తీసుకున్న రౌడీ షీటర్.. ఫిర్యాదు చేసినా పట్టించుకోని సిఐ ఆర్ఆర్ న్యూస్ తెలంగాణకు ఆశ్రయించిన ఇరిగేషన్ అధికారి సిఐ ఎవరికి అమ్ముడు పోయారు..?" అనే తప్పుడు కథనాన్ని ప్రచురించాడు.

ఈ వార్తను చూపి అరుణోదయ్ కుమార్‌ను మళ్లీ బ్లాక్ మెయిల్ చేసి మిగతా డబ్బుల కోసం ఒత్తిడి తెగ విసిగిపోయిన సదరు అధికారి చేసిన ఫిర్యాదు మేరకు అతనిపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. విలేకరుల ముసుగులో ఎవరైనా ఇబ్బందులు చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.

కామర్స్‌తో ఉజ్వల భవిష్యత్తు

జగిత్యాల కామర్స్ ఫోరం ఆవిర్భావ సభలో వక్తలు



నవతెలంగాణ-జగిత్యాలటౌన్ :కామర్స్‌తో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని జగిత్యాల కామర్స్ ఫోరం వ్యవస్థాపకులు శ్రీపాద నరేష్, ఎస్.కె.ఎన్.ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ అరిగెల అశోక్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో ఓ ఫంక్షన్ హాల్‌లో వాణిజ్య శాస్త్ర అధ్యాపకులతో కలిసి జగిత్యాల కామర్స్ ఫోరంను ప్రారంభించారు. కామర్స్‌తో విద్యార్థులకు అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని, కామర్స్ అనేది సేవా రంగం కిందికి వస్తుందని అన్నారు. సైన్స్ విద్యార్థులకు సైతం కామర్స్ చదవడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలతో పాటు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఇంటర్మీడియట్ స్థాయి నుండే కామర్స్‌ను చదవడం ద్వారా కామర్స్ మేలుకులను సులభంగా నేర్చుకోవచ్చు అని తెలిపారు. కామర్స్‌ను హైస్కూల్ స్థాయి నుంచి ఒక సబ్జెక్టుగా ప్రభుత్వం పెట్టాలని వారు కోరారు. తద్వారా విద్యార్థులకు చిన్నతనం నుండే కామర్స్‌పై అవగాహన పెరుగుతుందన్నారు. కామర్స్‌ను హై స్కూల్ స్థాయి నుంచి ఒక సబ్జెక్టుగా పెట్టేందుకు త్వరలోనే తెలంగాణ విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళిని కలిసి వినతి పత్రం సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రయివేట్ జూనియర్, డిగ్రీ కళాశాలల అధ్యాపకులు, రెసిడెన్షియల్ కాలేజిల అధ్యా పకులు, కేజీబీవీ అధ్యాపకులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి, పట్టణాభివృద్ధికి సహకరించండి

జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్

నవతెలంగాణ-జగిత్యాల



జగిత్యాల పట్టణ ప్రజలు సకాలంలో ఆస్తి పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను బకాయిలపై కలెక్టర్ సత్యప్రసాద్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. అత్యధిక బకాయిలు ఉన్న వారిపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలో రూ.1355.07 లక్షల ఆస్తి పన్ను బకాయిలుండగా ఎరియర్స్ రూ.572.53 లక్షలు, ప్రస్తుత బకాయి రూ.782.54 లక్షలు, ఇప్పటివరకు రూ.699.80 లక్షలు వసుల య్యాయని తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పట్టణాభివృద్ధి ప్రజల సహకారంతోనే సాధ్యమన్నారు. వంద శాతం పన్ను వసూలు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్, బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులకు సూచించారు. బకాయిలు ఉన్న వారికి నోటీసులు జారీ చేయడం, ఇంకా చెల్లించని వారి ఆస్తులను పురపాలక సంఘ చట్టం-2019 చర్యలు తీసుకో వాలన్నారు. ఈ తనిఖీల్లో రెవెన్యూ ఆఫీసర్ కనకయ్య, రెవెన్యూ ఇన్స్పెక్టర్ గోపాల్, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను 100 శాతం పూర్తి చేయాలి


నవతెలంగాణ-కోరుట్ల

పట్టణంలో ఆస్తి పన్ను 100 శాతం మార్చి 31 లోపు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ వి. రామకృష్ణ బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్‌లను ఆదేశించారు. శనివారం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించిన కమిషనర్ ఆస్తి పన్ను కట్టని వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ప్రతి ఇంటి యజమాని సకాలంలో ఆస్తి పన్నుతో పాటు కాళి ప్లాట్ ఎల్ఆర్ఎస్ కట్టాలని, దాంతో ప్రతి దుకాణ యజమానులు ట్రెడ్ లైసెన్సు తీసుకోవాలని సూచించారు. వారి వెంట మున్సిపల్ ఆర్ఐ క్రాంతికుమార్ పాల్గొన్నారు.

ప్రయివేట్ ఉపాధ్యాయులకు హెల్త్ స్కీం వర్తింపజేసేందుకు కృషి చేస్తా

నల్గొండ టీచర్స్ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి

నవతెలంగాణ-జగిత్యాలటౌన్



రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ప్రవేశ పెట్టనున్న హెల్త్ స్కీమ్‌ను ప్రయివేట్ ఉపాధ్యాయులకు వర్తింపజేసేందుకు కృషి చేస్తాం అని నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. శ్రీపాల్ రెడ్డి ఎమ్మెల్సీగా గెలిచిన మొదటిసారి జగిత్యాలకు వచ్చిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని విద్యానగర్ రామాలయంలో ఉపాధ్యాయులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. వారు మాట్లాడుతూ.. పీఆర్టీయూ టీఎస్ సంఘం ఏ రాజకీయ పార్టీకి అనుబంధం కాదని, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ప్రభుత్వంతో కలిసి పని చేస్తుందన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ స్కీమ్ రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే అమలు చేస్తుందని ఆయన తెలిపారు. శ్రీపాల్‌రెడ్డిని జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్య క్రమంలో జిల్లా అధ్యక్షుడు బోయినపల్లి ఆనంద రావు, ప్రధాన కార్యదర్శి యాల్ల అమర్నాథ్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు వుజగిరి జమున, శశికళ, జయప్రద పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ సంస్కృతం స్పాట్ వాల్యుయేషన్ ప్రారంభం

నవతెలంగాణ-జగిత్యాల టౌన్

జగిత్యాల జిల్లా కేంద్రంలో ఈనెల పదో తేదీ నుంచి ఇంటర్మీడియట్ మూల్యాంకనం ప్రారంభం కానుంది. ముందుగా సంస్కృతం సబ్జెక్టులో ప్రథమ, ద్వితీయ సంవత్సర సంస్కృతం జవాబు పత్రాల మూల్యాంకనం జిల్లా కేంద్రంలోని ఎస్ కే ఎన్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరగనుంది. సంస్కృత అధ్యాపకులు ఈ నెల 10వ తేదీన ఉదయం 10 గంటలకు తమ అపాయింట్మెంట్ ఆర్డర్, కళాశాల నుంచి రిలీవింగ్ ఆర్డర్, బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్ జిరాక్స్‌తో రిపోర్ట్ చేయాలని మూల్యాంకన కేంద్రం క్యాంప్ ఆఫీసర్ బి. నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల లాగిన్‌లో అపాయింట్మెంట్ ఆర్డర్ గల ప్రతి అధ్యాపకుడు విధిగా ఈ మూల్యాంకన ప్రక్రియలో భాగస్వాములు కావాలని, ఎవరికి కూడా మినహాయింపు లేదని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


నవతెలంగాణ-పెగడపల్లి

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎస్సీ కమిషన్ జాతీయ కమిటీ సభ్యుడు రామచంద్రంను రామగుండంలోని తన నివాసంలో శనివారం తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇరుగురాల ఆనందం కలిశారు. ఈ సందర్భంగా ఇరుగురాల ఆనందం మాట్లాడుతూ.. ప్రయివేట్ విద్యాసంస్థలలో రిజర్వేషన్ కల్పించాలని, అసైన్డ్ భూములను పేద ప్రజలకు పంపిణీ చేయాలని, సమాజంలోని సాంఘిక దురాచారాల నిర్మూలనకు కృషి చేయాలని కోరారు.

ఉరేసుకుని పెళ్లి కొడుకు ఆత్మహత్య

ఇరు కుటుంబాల్లో అలుముకున్న విషాదఛాయలు

నవతెలంగాణ - మెట్‌పల్లి:



తెల్లవారితే పెళ్లి ఇల్లంతా సందడి,పెళ్లి పనుల్లో అమ్మాయి,అబ్బాయి కుటుంబ సభ్యులు బిజీబిజీగా పెళ్లి పనుల్లో తనమునకలై ఎవరి పనుల్లో వారు ఉండగా పిడుగు లాంటి వార్త రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ సంఘటన మెట్‌పల్లి మండలం వెల్లుల్ల అనుబంధ గ్రామం రామచంద్రంపేట్‌లో శనివారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం లక్కినపల్లి కిరణ్(37)కి అదే గ్రామానికి చెందిన యువతితో పెద్దలు పెళ్లిని కుదిర్చారు. ఆదివారం పెళ్లి కోసం ఇరు కుటుంబాల్లో పెళ్లి పనులు పూర్తి చేసుకున్నారు. ఈ క్రమంలో వరుడు కిరణ్, పెళ్ళికూతురుతో కలిసి ప్రీ వెడ్డింగ్ షూటింగ్ పూర్తి చేసుకొని శుక్రవారం రాత్రి ఇంటికి చేరుకున్నాడు.రాత్రి భోజన అనంతరం తన రూములోకి వెళ్లి పడుకొన్నాడు. ఏం జరిగిందో తెలియదు తెల్లవారేసారికి వరుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కిరణ్ ఓ ప్రయివేట్ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్నట్లు సమాచారం ,అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న తన కుమారుడు పెళ్లి అనంతరం ఇరు కుటుంబాల్లో సమస్యలు వస్తాయని,పెళ్లి ఇష్టం లేక మనోవేదనతో ఉరేసకుని మృతి చెందాడు. మృతుడి తల్లి లక్కినపల్లి లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్టు


గంజాయితో పట్టుబడ్డ యువకులు

నవతెలంగాణ - మెట్‌పల్లి: గంజాయి అమ్మి డబ్బులు సంపాధించాలనే ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి పోలీసులు వెంపేట రోడ్డులో ఎస్ఆర్ గార్డెన్స్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానం వచ్చి మోటారు సైకిల్‌ను ఆపి తనిఖీ చేయగా గంజాయి అభ్యమైనట్టు పోలీసులు తెలిపారు. విచారించగా ఇబ్రహీంపట్నం మండలం ఎర్రాపూర్‌కి చెందిన సునావత్ సాయి నాయక్, నిర్మల్ జిల్లా సత్తెనపల్లి గ్రామానికి చెందిన అజ్మీర శ్రీనివాస్ నాయక్, ఇద్దరు పీపీపీ కలిసి నిర్మల్ జిల్లా కొమ్ముగూడెంలో చౌహాన్ రమేష్ నాయక్ వద్ద గంజాయి కొని వాటిని 8 చిన్న ప్యాకెట్‌లుగా మార్చి సొమ్ము చేసుకోవాలని మెట్ పల్లికి తీసుకువస్తున్నట్లు తెలిపారు. సాక్షుల సమక్షంలో పంచనామా నిర్వహించి, మోటార్ సైకిల్ రెండు మొబైల్‌లు, 200 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. గంజాయి విక్రయించిన చౌహాన్ రమేష్‌ను త్వరలోనే పట్టుకుంటామని, ఎవరైనా గంజాయి అమ్మినా, సేవించిన చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

రాజన్న సిరిసిల్ల ఎస్పీ బాధ్యతల స్వీకరణ

- ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటాం
- నూతన ఎస్పీ గిటే మహేష్ బాబాసాహెబ్


రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న గిటే మహేష్ బాబాసాహెబ్

నవతెలంగాణ - సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీగా 2020 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన గిటే మహేష్ బాబాసాహెబ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలోని ప్రజలకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటూ, చట్ట పరిధిలో వారి సమస్యలను పరిష్కరిస్తామని, ప్రజల భద్రత, రక్షణే ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో అఖిల్ మహాజన్ నుంచి గిటే మహేష్ బాబాసాహెబ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ అధికారులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, జిల్లా పరిధిలోని సామాన్యులకు భరోసా కల్పించే విధంగా పోలీసింగ్ ఉంటుందని, శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆబ్కారీశాఖలో అవినీతి మత్తు..

- అవినీతికి కేరాఫ్‌గా వేములవాడ అబ్కారీ శాఖ!?
- తీరు మార్చుకోని ఎక్సైజ్ ఉద్యోగులు, సిబ్బంది

నవతెలంగాణ - వేములవాడ :

ఆబ్కారీ శాఖ అప్రతిష్ట మూటగట్టుకుంటున్నది. అవినీతి ఆరోపణలు.. నిత్యం వివాదాలతో ఆ శాఖ పరువు బజారున పడుతున్నది. తీవ్ర అవినీతి ఆరోపణలు, అక్రమ వ్యవహారాలు, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరు ఎక్సైజ్ శాఖను అపహాస్యం చేస్తున్నాయి. ఇటీవల సిరిసిల్ల జిల్లా అబ్కారీ శాఖ అధికారి, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌లను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. వేములవాడలో ఓ ప్రైవేట్ లాడ్జిలో 50 కేజీల బెల్లంతో పట్టుబడిన కానిస్టేబుల్‌ను వదిలేసి, గుర్తు తెలియని వ్యక్తులపై కేసు నమోదు చేశారు. మహాశివరాత్రి జాతర సమయంలో వైన్ షాపులు మూసివేయగా, మరుసటి రోజు ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో మద్యం అమ్ముతూ పట్టుబడిన వ్యక్తిని వదిలేశారు. ఉదయం కోడి కూయకముందే పర్మిట్ దుకాణం తెరిచినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో చిత్ర రెస్టారెంట్ అండ్ బార్ సంబంధించి ప్రభుత్వ ఆదేశాలు, నియమ నిబంధనలు పాటించకుండా ట్రేడ్ లైసెన్స్ లేకుండానే 2బి లైసెన్స్ రెన్యువల్ చేసి, క్రమశిక్షణ రాహిత్యంగా వ్యవహరిస్తూ జిల్లా యంత్రాంగానికి ఇబ్బందులు గురి చేసినందుకుగాను సిరిసిల్ల జిల్లా అబ్కారీ శాఖ అధికారి ఎస్.పంచాక్షరి, తప్పుడు వివరాలు నివేదికలను సమర్పించినందుకు గాను ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ గులాం ముస్తఫాలను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వేములవాడ పట్టణంలో గత కొద్ది రోజుల క్రితం ఓ ప్రైవేట్ లాడ్జి లో సుమారు 50కేజీల బెల్లంతో సహా ఒక వ్యక్తిని వేములవాడ అబ్కారీ అధికారులు పట్టుకున్నారు, పట్టుబడ్డ వ్యక్తి వరంగల్ జిల్లాకి చెందిన కానిస్టేబుల్ కావడంతో అతన్ని వదిలేసి గుర్తు తెలియని వ్యక్తులవద్ద బెల్లం పట్టుబడ్డట్టు చిత్రీకరించారు. మహాశివరాత్రి జాతర సమయంలో వేములవాడ పట్టణంలోని వైన్ షాపులను తాత్కాలికంగా బందు చేశారు. మరుసటి రోజు ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో ఓ మద్యం దుకాణం నిర్వాహకుడు మద్యం అమ్ముతూ ద్విచక్ర వాహనంతో సహా వేములవాడ అబ్కారీ ఎస్సైకి పట్టుబడ్డాడు, ఆ మద్యం దుకాణం యజమాని సూచనతోఎస్సై పట్టుకున్న ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేవలసింది పోయి వదిలేసి కేవలం మద్యం అమ్మిన వ్యక్తిపై మాత్రమే కేసు నమోదు చేశారు. ఉదయం కోడి కూయకముందే పర్మిట్ దుకాణం తీసినట్టు ఎన్ని ఫిర్యాదులు అందినా అబ్కారీ శాఖ అధికారులు పర్మిట్ దుకాణం వారికి సమాచారం చేరవేస్తారు అనే ఆరోపణలు ఉన్నాయి. కానీ వారి పై ఎలాంటి చర్యలు తీసుకోరు. దీనిని బట్టి అబ్కారీ అధికారులనుపై మద్యం దుకాణదారులు శాసించే స్థాయికి ఎదిగారు అని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆబ్కారీ అధికారులకు ఆడిందే ఆట, పాడిందే పాటగా మారింది. మామూ ళ్ల మత్తులో ఊగుతూ తూగుతూ, తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


శివరాత్రి రోజున ఆబ్కారీ ఎస్సై వదిలేసిన ద్విచక్ర వాహనం..

లక్ష్యాలు మరిచి...

సీఎం రేవంత్ రెడ్డి సర్కారు ఆబ్కారీ శాఖకు కొన్ని లక్ష్యాలను నిర్దేశించింది,ఇందులో ప్రధానంగా బెల్టు షాపుల నియంత్రణ, గంజాయి రవాణా కట్టడి ముఖ్యమైనవి. ఇవేవి పట్టించుకోకుండా నిత్య ఆబ్కారీ అధికారులు, సిబ్బంది వేములవాడ పట్టణంలోని వివిధ గ్రామాలలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న నిర్వాహకుల నుండి ప్రతినెలా మామూలు వసూలు చేస్తున్నారని విమర్శలు చాలానే ఉన్నాయి. ఎక్సైజ్‌లో అక్రమాలను అరికట్టేందుకు పని చేసే ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగమైతే చుట్టపు చూపునకే పరిమితమైంది. గత ప్రభుత్వంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నిరంతరం దాడులు నిర్వహించేది. మఫ్టీలో మద్యం



దుకాణాల్లో సాధారణ వ్యక్తుల్లా వెళ్లి తనిఖీలు చేపట్టేది. దీంతో అధిక ధరల నియంత్రణ జరిగింది. కల్తీ మద్యం వంటిది కానరాకుండా పోయింది. ప్రస్తుతం ప్రతి గ్రామాలలో వీధి వీధికి ఒకటి రెండు చొప్పున బెల్ట్ షాపులు నిర్వాహకులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల చర్యలేవీ కానరాకపోవడంతో అనేక అక్రమాలు చాప కింద నీరులా జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. ఎక్సైజ్ శాఖ అధికారులు బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారు అనే విధంగా సిబ్బంది ఉద్యోగుల చర్యలు తనిఖీలు చేపట్టడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఏ అధికారి వచ్చినా మారని తీరు..

ఉద్యోగోన్నతులు, బదిలీల పేరిట ఎవరు వచ్చినా పరిస్థితిలో మాత్రం మార్పు కనిపించడంలేదు. కొన్నాళ్లుగా జిల్లాలో వెలుగు చూస్తున్న ఉదంతాలు రాష్ట్రస్థాయిలోనూ చర్చనీయాంశంగా మారాయి. ఎక్సైజ్ శాఖలో కింది స్థాయిలో పనిచేస్తున్న కానిస్టేబుల్ మొదలు ఎస్‌హెచ్‌వోలు, సీఐ, ఈఎస్ స్థాయి వరకు అవినీతి ఆరోపణ మత్తు గుప్పుమంటున్నాయి.ఎక్సైజ్ శాఖలోని కొంత మంది స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, సీఐలు మద్యం విక్రయాలతోపాటు మామూళ్ల వసూళ్లలోనూ టార్గెట్లను పెట్టుకుని, పని చేస్తున్నారని ,అవినీతికి పాల్పడిన వారిపై సస్పెన్షన్ వేటు వేస్తున్నా.. అధికారుల్లో కనీస స్పందన, మార్పు కానరాకపోవడం విస్తు గొల్పుతున్నది.

ఎల్‌ఆర్‌ఎస్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం, 25శాతం రాయితీ


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

నవతెలంగాణ - సిరిసిల్ల :

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని జిల్లాలోని అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్-2020 కింద రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 25లక్షల దరఖాస్తులు వచ్చాయని, గత సెప్టెంబర్ 2024లో జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం కొన్ని దరఖాస్తులు క్రమబద్ధీకరణ అయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం కొన్ని నూతన నిర్ణయాలు తీసుకుందని, ఎల్‌ఆర్‌ఎస్ ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో రుసుము చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవచ్చని తెలిపారు. మార్చి 31వ తేదీ వరకు క్రమబద్ధీకరణ చేసుకుంటే చెల్లించాల్సిన రుసుములో 25శాతం మినహాయింపు ఉంటుందని, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా నూతన దరఖాస్తులు స్వీకరించి మున్సిపల్ శాఖకు పంపి క్రమబద్ధీకరిస్తారని కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో 42 వేలకు పైగా దరఖాస్తులు

క్రమబద్ధీకరించని భూములలో రిజిస్ట్రేషన్లు, నిర్మాణాలకు అనుమతి ఉండదని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా క్రమబద్ధీకరణ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో 42,942 దరఖాస్తులు స్వీకరించామని, అందులో 34,229 దరఖాస్తులు ప్రాసెస్ చేయబడ్డాయని, మిగిలిన దరఖాస్తులు వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్నాయని ఆయన తెలిపారు.

పరిశీలన ప్రారంభం

2020లో రూ. 1000 చెల్లించి ఎల్‌ఆర్‌ఎస్‌లో దరఖాస్తు చేసుకున్న వారి అర్జీల పరిశీలన ప్రారంభమైందని, ప్లాటు రిజిస్ట్రేషన్ చేసుకున్న వాటి వాల్యుయేషన్ ప్రకారం ఎల్‌ఆర్‌ఎస్‌లో దరఖాస్తు ఫీజు వేస్తారని, దీంతో దరఖాస్తుదారులకు లాభం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. దరఖాస్తుదారులు తమ పురపాలక, సంబంధిత కార్యాలయాల్లో సంప్రదించి ప్లాటును రెగ్యులరైజ్ చేసుకోవాలని సూచించారు.

టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణలో ఇబ్బందులు, అనుమానాలు నివృత్తి చేసేందుకు కలెక్టరేట్ కార్యాలయంలో 18002331495 టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులో ఉంటుందని, ప్రభుత్వ పని దినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సేవలు అందిస్తారని కలెక్టర్ తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు


మహిళా ఉద్యోగులు, ఆశా వర్కర్లు, కార్మికులకు సన్మానం


ముస్తాబాద్ : మహిళలను సన్మానిస్తున్న మేజర్ గ్రామపంచాయతీ ఈవో రమేష్


మహిళా ఉద్యోగులను సన్మానించిన తహసిల్దార్

నవతెలంగాణ - ముస్తాబాద్ : ముస్తాబాద్ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామ పంచాయతీలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ఆశా వర్కర్లు, గ్రామ పంచాయతీ మహిళా కార్మికులు, వివిధ స్థాయిల్లోని మహిళా ఉద్యోగులను అధికారులు సన్మానించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సురేష్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బీరయ్య, మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈవో రమేష్ సహచర మహిళా ఉద్యోగులను, ఆశా వర్కర్లను, మహిళా కార్మికులను, మాజీ సర్పంచ్ సుమతిని, మహిళా సంఘాల నాయకురాళ్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మహిళా ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.

మహిళా పారిశుద్ధ్య కార్మికులకు బీఆర్‌ఎస్ నాయకుల సన్మానం


ఎల్లారెడ్డిపేట : మహిళ పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : మహిళ పారిశుధ్య కార్మికులను బీఆర్‌ఎస్ మండల యువజన విభాగం నాయకుడు చందనం శివరామకృష్ణ శనివారం ఘనంగా సన్మానించారు. ఎల్లారెడ్డి పేట మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయితీలో పనిచేస్తున్న మహిళ సిబ్బందిని అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా శివరామకృష్ణ సన్మానించారు. ప్రతినిత్యం ప్రజల బాగోగులకు, గ్రామ పరిశుభ్రత పట్ల శ్రద్ధ వహిస్తూ, వారి ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజల ఆరోగ్య రీత్యా పనిచేస్తున్న పంచాయతీ మహిళ కార్మిక సోదరిమణులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వారి సేవను గుర్తించి శాలువాతో సత్కరించి వారికి చేతి గ్లౌజులు, మాస్కులు అందించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ ఛైర్మెన్ ఆకుల మురళీ మోహన్ గౌడ్, బిఆర్‌ఎస్ పార్టీ యూత్ పట్టణ అధ్యక్షులు దొనుకుల కల్యాణ్ పాల్గొన్నారు.

వృద్ధులతో అంగన్వాడి టీచర్ల మహిళా దినోత్సవం

ఎల్లారెడ్డిపేట మండల అంగన్వాడి టీచర్లు మహిళ అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా గంభీరావుపేట మండల కేంద్రంలోని అనాధ వృద్ధాశ్రమంలో ఉన్న మహిళలకు శనివారం అంగన్వాడి టీచర్లు శుభాకాంక్షలు తెలిపి, మేమున్నాము అనే ధైర్యాన్ని కల్పించారు. అనాథ ఆశ్రమంలో ఉన్న మహిళలకు పండ్లు, బిస్కెట్స్, బ్రెడ్ ప్యాకెట్లు అందజేసి సాటి మహిళగా వారికి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా అనాథ ఆశ్రమం వ్యవస్థాపకులు, మాజీ జెడ్పిటిసి మల్లుగారి నర్సాగౌడ్ మాట్లాడుతూ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా నాలుగు సంవత్సరాల నుండి అంగన్వాడి టీచర్లు శృద్ధాశ్రమానికి వచ్చి వారికి సన్మాన కార్యక్రమాలు ఏర్పాటు చేసి సాటి మహిళలుగా మేమున్నాము అనే ధైర్యాన్ని కల్పిస్తున్న సోదరీమణులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు కొర్రి సునిత, నేవూరి నర్మద, సులోచన, కవితలు పాల్గొన్నారు.

మహిళామణులను సన్మానించిన నాయకులు


కొనరావుపేట: సుద్దాలలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు


కొనరావుపేట: కొలనూర్ మార్గదర్శి పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులు

నవతెలంగాణ - కొనరావుపేట :

మండలంలోని పలు గ్రామాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, మహిళలందరూ సమానత్వం కోసం పోరాడాలని, అన్ని రంగాల్లోనూ ముందుకు సాగి అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. మహిళలు పిల్లల పట్ల ప్రత్యేక దృష్టి సారించి, మెరుగైన సమాజం కోసం కృషి చేయాలని సూచించారు. మహిళలందరికీ స్ఫూర్తిగా నిలిచిన పలువురు మహిళా మణులను ఆయా గ్రామాల్లో శాలువాలతో సత్కరించారు. మరిమడ్ల గ్రామంలో పారిశుద్ధ్య కార్మికురాలు కుమ్మరి లక్ష్మిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి దిలీప్ కుమార్, జింక శ్రీనివాస్, పులక మల్లేష్, బొల్లం శ్రీనివాస్, తిక్కల చిరంజీవి, దర్శనాల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కొలనూర్ మార్గదర్శి పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను పాఠశాల కరస్పాండెంట్ మండల చిరంజీవి ఘనంగా శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సుద్దాల గ్రామంలో మహిళా దినోత్సవం సందర్భంగా గ్రామ పంచాయతీ ఆవరణలో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘ సీఏలు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను గ్రామ పెద్దలు, మాజీ ప్రజా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్ కచ్చకాయల బాల్రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ఎర్రవెల్లి నాగరాజు, బీఆర్‌ఎస్ నాయకులు ఉప్పుల అంజయ్య, భీమ్ ఆర్మీ నాయకులు దొబ్బల ప్రవీణ్, కాంగ్రెస్ మండల నాయకులు ఉప్పుల గంగయ్య, దొబ్బల నరేష్, రొండి అజయ్, పంచాయతీ కార్యదర్శి అభిలాష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ వృద్ధాశ్రమం, అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో వేడుకలు


గంభీరావుపేట ఆశ్రమ నిర్వహకుడిని సన్మానం చేస్తున్న అంగన్వాడీ టీచర్లు

నవతెలంగాణ - గంభీరావుపేట :

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గంభీరావుపేట మండల కేంద్రంలోని మా అనాథ వృద్ధాశ్రమంలో శనివారం ఎల్లారెడ్డిపేట అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. వృద్ధాశ్రమంలోని వద్దులకు సబ్బులు, బిస్కెట్లు, పండ్లు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ, నాలుగు సంవత్సరాలుగా ఆశ్రమంలోని వృద్ధులకు తాము అండగా ఉన్నామని, ఎల్లప్పుడూ ఉంటామని భరోసా కల్పించారు. అనాథ వృద్ధులను ఆదరించి, అన్ని సేవలూ అందిస్తున్న నర్సయ్య గౌడ్‌ను అంగన్‌వాడీ టీచర్లు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నర్మద, కవిత, సులోచన, సునీత, వృద్ధులు పాల్గొన్నారు.

మహతి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో


సిరిసిల్ల టౌన్ : కేక్ కట్ చేస్తున్న మహిళ దంత వైద్యులు

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ :

సిరిసిల్ల పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మహతి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మహిళ దంత వైద్యులు హాజరయ్యారు. కాగా విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థుల సమక్షంలో దంత వైద్యుల బృందం ప్రత్యేకంగా రూపొందించిన కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. దంత పరీక్షలు నిర్వహించిన వైద్యులందరినీ కళాశాల నిర్వాహకులు ఘనంగా శాలువాలతో సత్కరించారు. వేడుకలను పురస్కరించుకొని విద్యార్థులు తమ సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో దంత వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పి రాజు, డాక్టర్ గోపి, శివరామకృష్ణ, గీత, స్నేహ, ఆకాంక్ష, రమ్య, త్రిసంధ్య, దీపిక, కళాశాల ప్రిన్సిపల్ భూమేష్, ఉపన్యాసకులు స్వామి, వేణుగోపాల్, రమేష్, రాజిరెడ్డి, వైష్ణవి, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా సిబ్బందితో బ్లూ కోల్ట్ విధులు


వేములవాడ రూరల్ : బ్లూ కోల్ట్ విధులు నిర్వహించిన మహిళా సిబ్బంది..

నవతెలంగాణ - వేములవాడ రూరల్ :

మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల్లో నూతనోత్తేజం నింపుతూ వేములవాడ రూరల్ ఎస్సై మారుతి సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వేములవాడ రూరల్ మహిళా సిబ్బంది లహరి ప్రియా, స్వరూప బ్లూ కోల్ట్ విధులు నిర్వహించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, అన్ని రంగాల్లో రాణించాలని మహిళా సిబ్బందితో బ్లూ కోల్ట్ విధులు నిర్వహించడం అభినందనీయమని ఎస్సై మారుతి అన్నారు. విధుల్లో భాగంగా పెట్రో కార్ గస్తీ, పాయింట్ బుక్ చెకింగ్, డయల్ 100, ఎంవో అఫెండర్ చెకింగ్ వంటి విధులు నిర్వహిస్తూ సమాజంలో మహిళల్లో ధైర్యాన్ని నింపే దిశగా మహిళా పోలీసు సిబ్బంది పని చేస్తున్నారని ఆయన తెలిపారు.

మెగా లోక్ అదాలత్‌తో కేసులకు సత్వర పరిష్కారం

జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి




జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయిని సన్మానిస్తున్న మహిళా న్యాయవాదులు కోర్టు సిబ్బంది ..

నవతెలంగాణ - వేములవాడ :

మెగా లోక్ అదాలత్‌ల ద్వారా కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని వేములవాడ జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి అన్నారు. జాతీయ న్యాయసేవా సాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టుల్లో మెగా లోక్ అదాలత్ జరిగింది. ఇందులో భాగంగా వేములవాడ కోర్టులో మెగా లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించినట్లు జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి తెలిపారు. రాజీ ద్వారా పరిష్కారానికి అవకాశం ఉన్న కేసులను ఈ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. అదాలత్ తీర్పునకు అప్పీల్ ఉండదని, అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవడం రాజీకి రాజమార్గమని ఆమె అన్నారు.

కోర్టులో ఘనంగా మహిళా దినోత్సవం

మహిళా దినోత్సవం సందర్భంగా వేములవాడ జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయిని మహిళా న్యాయవాదులు, కోర్టు సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జడ్జి మహిళా న్యాయవాదులను, కోర్టు మహిళా సిబ్బందిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం, ఏజీపీలు బొడ్డు ప్రశాంత్ కుమార్, పుప్పాల భాను కష్ణ, ఏపీపీ విక్రాంత్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అవధూత రజనీకాంత్, న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, నాగుల తిరుమల్ గౌడ్, విద్యాసాగర్ రావు, రేగుల దేవేందర్, పోత్తురు అనిల్ కుమార్, గోపికృష్ణ, కటుకం జనార్దన్, పెంట రాజు, గొంటి శంకర్, నక్క దివాకర్, గుజ్జ మనోహర్, బొడ్డు గంగరాజు, గుండా రవి, నాగుల సంపత్ కుమార్, బీమా మహేష్, గడ్డం సత్యనారాయణరెడ్డి, గోగిఖరి శ్రీనివాస్, బొజ్జ నరేష్, నర్సింగరావు, మహేష్, అనిల్, మల్లేష్, జనార్దన్, శ్రీకాంత్, ఆదిత్య, నాగేంద్రబాబు, మహిళా న్యాయవాదులు అన్నపూర్ణ, సుజాత, పద్మ, సరితా, పావని, నయమా నాసారి, మమత తదితరులు పాల్గొన్నారు.

వరికి చలి దెబ్బ..

- పొట్టకు రాని పొలాలు
- ఆందోళనలో అన్నదాతలు



నవతెలంగాణ - చందుర్తి :

చందుర్తి మండలంలో అన్నదాతలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఒకవైపు సాగునీరు అందుతుందా లేదా అనే సందిగ్ధత, మరోవైపు చలి తీవ్రత వారిని కలవరపెడుతోంది. పొట్టకు వచ్చిన వరి పొలాలు చలి కారణంగా ఆగిపోతున్నాయి. మార్చి నెల వచ్చినా చలి తీవ్రత తగ్గకపోవడంతో నవంబర్‌లో సాగు చేసిన వరి ఇంకా పొట్ట దశకు చేరుకోలేదు. మండలంలో 18 వేల ఎకరాల వరకు వరి సాగు చేసినట్లు తెలుస్తోంది. చందుర్తి, మాల్యాల, తిమ్మాపూర్ గ్రామాల పరిధిలో కొంతమేర వరి పొట్ట దశకు చేరుకుంది. 15 రోజుల ముందు సాగు చేసిన రైతులు కొంతమేర లాభపడ్డారని తెలుస్తోంది.

చలి తీవ్రతతో వరికి ఇబ్బంది

వరి పొట్టకు వచ్చే దశలో ఎండలతో పాటు ఉక్కపోత ఉంటే తొందరగా పొట్టకు చేరుకునే అవకాశం ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. చలి కారణంగా వరి పొట్ట ఆలస్యంగా వచ్చే అవకాశం ఉంది. దీంతో మరో నెల ఆలస్యమయ్యే అవకాశం ఉంది. మరోవైపు వేసవిలో నీటి ఎద్దడి కారణంగా పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉంది. చలి తీవ్రత కారణంగా వరి సాగుపై ప్రభావం పడి రైతులకు ఆశించిన దిగుబడి రాకపోవచ్చు.

మృతురాలి కుటుంబానికి నష్టపరిహారం అందజేత


మృతురాలి కుటుంబానికి నష్టపరిహారం అందజేస్తున్న సెస్ ఛైర్మన్

నవతెలంగాణ - తంగళ్లపల్లి :

ప్రాణం ఎంత అమూల్యమైనదో, పోతే తిరిగిరాదని సెస్ ఛైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. తంగళ్ళపల్లి మండలం తాడూరు గ్రామానికి చెందిన రైతు మధుప్రియ గత సంవత్సరం జనవరిలో వ్యవసాయ పొలంలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి మృతి చెందారు. ఆమె కుటుంబానికి సెస్ ఛైర్మన్ శనివారం నష్టపరిహారం అందజేశారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉండగా, వారి పేర్లపై చెరో రూ.2.25 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, మరో రూ.50 వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పొలాల వద్ద పనిచేసేటప్పుడు జాగ్రత్త వహించాలని సూచించారు. విద్యుత్ వైర్లను ఎక్కువ దూరం కర్రల సహాయంతో తీసుకెళ్లవద్దని, ఏదైనా సమస్య ఉంటే సెస్ అధికారులకు తెలియజేస్తే విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెస్ ఏఈ మధుకర్, ఏఏఓ దేవేందర్, నవీన్ రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన నియామకం



నియామక పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

తెలంగాణ రక్షణ సమితి (డెమోక్రటిక్) రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడుగా గుంటుక సంపత్ ని నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు నరాల సత్యనారాయణ తెలిపారు. శనివారం ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన సమావేశంలో నియామక పత్రాన్ని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా గుంటక సంపత్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తోడేటి శంకర్ గౌడ్, డాక్టర్ వాసంపల్లి ఆనంద్ బాబు,ఈదునూరి నర్సింగ్, నేరెళ్ల జైపాల్ గౌడ్, కొండ అశోక్ మహారాజ్, గోరిట్యాల రమేష్ పాల్గొన్నారు.

ఇద్దరు ఎక్సైజ్ అధికారుల సస్పెన్షన్

నవతెలంగాణ -సిరిసిల్ల :

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇద్దరు ఎక్సైజ్ అధికారులను సస్పెండ్ చేసినట్లు ఎక్సైజ్ ఉన్నతాధికారులు తెలిపారు. సిరిసిల్ల జిల్లా అబ్కారీ శాఖ అధికారి ఎస్. పంచాక్షరి, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గులాం ముస్తఫాలను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్ర రెస్టారెంట్ అండ్ బార్‌కు సంబంధించి ప్రభుత్వ ఆదేశాలు, నియమ నిబంధనలు పాటించకుండా ట్రేడ్ లైసెన్స్ లేకుండానే 2బి లైసెన్స్ రెన్యువల్ చేసినందుకు, తప్పుడు వివరాలు నివేదికలు సమర్పించినందుకు వారిని సస్పెండ్ చేశారు.

నిత్యావసర సరుకుల అందజేత



నవతెలంగాణ-గోదావరిఖని:
అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గోదావరిఖని విఠల్ నగర్‌లో గల అమ్మ పరివార్ ఆశ్రమంకు నాగారం గ్రామ పంచాయతీ శాలపల్లికి చెందిన మహిళలు 50 కిలోల బియ్యం, 5వేల రూపాయల విలువజేసే నిత్యావసర సరుకులను శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బత్తిని నాగమణిగౌడ్, కుందరపులక్ష్మి, కుందరపు వెంకటమ్మ, కొండి పద్మ, బండి పద్మ, బండి రజిత, బండి లక్ష్మి, బొద్దున కనకమ్మ, కొయ్యడ రమ, కొయ్యడ లావణ్య, కుందారపు స్వరూప, కుందారపు విజయ, శాంతమ్మ, ముత్యం తిరుపతమ్మ, సొల్లు లక్ష్మి, సొల్లు రాజేశ్వరి, నాగమణి, శోభ, స్వప్న, సరిత, లలిత, లచ్చమ్మ, శైలజ, లావణ్య, స్వాతి, రాజేశ్వరి, శారద, వసంత తదితరులున్నారు.

జిల్లాలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-గోదావరిఖని:
మహిళలకు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లోనూ సమాన హక్కులు ఉన్నాయని, మహిళా అధికారులందరూ తమ పూర్తి శక్తితో పని చేయాలని, తమ కలల సాకారం కోసం అహర్నిశలు పాటుపడాలని డీసీపీ అడ్మిన్ సి.రాజు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కమిషనరేట్ పోలీసు కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించి, మహిళా అధికారులు, సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి, అనంతరం మహిళా సిబ్బందికి శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా డీసీపీ అడ్మిన్ సి.రాజు మాట్లాడుతూ స్త్రీ లేకపోతే సృష్టి లేదని, ప్రతి స్త్రీని గౌరవించాలని అన్నారు. మహిళల్లో సంకల్ప శక్తి ఎక్కువగా ఉంటుం దని, వారు ఏదైనా సాధించగలరని అన్నారు.మహిళలు అన్ని రంగాల్లోనూ ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారని, దేశంలో అన్ని రంగాల్లో పురుషుల కంటే మహిళలు మెరుగ్గా రాణిస్తున్నారని పేర్కొన్నారు. మహిళా అధికారులందరూ పోలీసు శాఖలో భాగమై సమాజానికి చేస్తున్న సేవను పేర్కొంటూ, మహిళలు పలు రంగాలలో సాధిస్తున్న విజయాలు రానున్న తరాలకు మార్గ దర్శకంగా నిలుస్తాయని, మహిళా అధికారులందరూ ధైర్యంగా ఉండాలని, తమ వృత్తిపరమైన బాధ్యతలను గౌరవంగా నిర్వహించాలని సూచించారు. జిల్లా మహిళా సిబ్బంది సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు దామోదర్, సంపత్, ఆర్ఎస్ఐలు ప్రవీణ్, వెంకట్, వివిధ విభాగాల మహిళ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సింగరేణి సేవా సమితి ఆర్జీ-1 ఆధ్వర్యంలో...
నవతెలంగాణ-గోదావరిఖని:
ఒక తల్లిగా, బిడ్డగా, చెల్లిగా, అక్కగా, భార్యగా, వదినగా, అత్తగా, పిన్నిగా ఇలా రకాల పాత్రలు పోషిస్తూ అక్షయపాత్రలా స్త్రీమూర్తులందరూ సేవలందిస్తున్నారని సింగరేణి సిఅండ్ఎండి ఎన్.బలరాం సతీమణి శారద బలరాం, ఆర్జీ 1 జిఎం డి.లలిత్ కుమార్, ఆర్జీ 1 సేవా అధ్యక్షురాలు డి.అనిత లలిత్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్స వాన్ని పురస్కరించుకొని సింగరేణి సేవా సమితి ఆర్జీ 1 ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్‌సిఓఎ క్లబ్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సింగరేణి సిఅండ్ఎండి ఎన్.బలరాం సతీమణి శారద బలరాం, ఆర్జీ 1 జిఎం డి.లలిత్ కుమార్, ఆర్జీ 1 సేవా అధ్యక్షురాలు డి.అనిత లలిత్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, ప్రతి ఒక్క మహిళా కష్ట పడి ఉన్నత స్థానాలను అధిరోహించాలని, ప్రస్తుతం మహిళలు, పురుషులకు సమానంగా అన్ని రంగాలలో రాణిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రటరీ స్వామి, సిఎంఓఐ ప్రెసిడెంట్ బి.మల్లేశం, డిజిఎం పర్సనల్ కిరణ్ బాబు, సీనియర్ పిఓ హన్మంత రావు, శ్రావణ్ కుమార్, సేవా సెక్రటరీ శిరీష చంద్ర శేఖర్, జాయింట్ సెక్రటరీ బీనాసింగ్, సోనాలి భైద్య, లక్ష్మీ శిరీష, కో-ఆర్డినేటర్లు తిరుపతి, రవి కుమార్ తదితరులున్నారు.

నవతెలంగాణ-జూలపల్లి
పెద్దాపూర్ గ్రామంలో మహిళా దినోత్సవ సందర్భంగా గ్రామంలో ఉన్న మహిళలందరికీ క్రీడా పోటీలు నిర్వహించి, శాలువాతో సన్మానం చేసి, కేక్‌కట్ చేశారు. గెలిచిన మహిళలకు బహుమతులు అందజేశారు. కీచులటపల్లి గ్రామంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించి మహిళలను శాలువతో ఘనంగా సన్మానించారు. చీమల పేట గ్రామంలో అంగన్వాడి టీచర్ రాజనర్సమ్మ గ్రామంలోని యువత మహిళలల శాలువాతో ఘనంగా సన్మానించి మహిళా దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ రఘువీర్ సింగ్, డాక్టర్ సంపత్ రెడ్డి, గజ్జల సతీష్, కరాటే సంకెళ్ల లక్ష్మీనరసయ్య కొత్త శకుంతల రవీందర్ రెడ్డి, గుర్రం స్వామి, బొజ్జ శ్రీను, పాల్గొన్నారు.

నవతెలంగాణ-యైటింక్లైన్ కాలనీ:
సెక్టార్ 3 సింగరేణి పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళా టీచర్స్‌ని వివిధ ఆటలపోటీలు నిర్వహించి, ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుందర్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-ఎలిగేడు
ఎలిగేడు మండలంలోని గ్రామపంచాయతీలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన గ్రామసభల్లో గృహహింస, బాల్య వివాహాల నిరోధక చట్టం,లింగ నిర్ధారణ నిరోధక చట్టం వంటి మహిళలకు నిర్దేశించిన పలు చట్టాలపై పంచాయతీ కార్యదర్శులు వివరించారు. అనంతరం ఆయా గ్రామాల్లో మాజీ మహిళా ప్రజా ప్రతినిధులు, హెల్త్ సిబ్బంది, అంగన్ వాడీ కార్యకర్తలు, వీవోఏలను శాలువాలతో సత్కరించారు. ఈ కార్య క్రమాల్లో జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్ పర్సన్ మండిగా రేణుక, మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతి,కార్య దర్శులు సురేష్, పున్నమయ్య, పాపన్న పాల్గొన్నారు.

నవతెలంగాణ-ఓదెల
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ దీకొండ రమేష్ అధ్వర్యంలో మహిళ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ పోలీస్ సిబ్బందికి, మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్ఐ దీకొండ రమేష్ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో మహిళలు ఏదో ఒక్క రంగంలో అని కాకుండా విద్య, వైద్య,పారిశ్రామిక, అంతరిక్ష, పరిశోధనా రంగాల్లో రాణించడం హర్షనీయమన్నారు. అన్ని రంగాల్లోనూ మహిళల దే పోటీ అని,వారికి ఎవరు సాటిరారన్నారు. మహిళా సాధికారితతోటే అభివృద్ధి సాధ్యం అని, ప్రతి ఒక్క మహిళ అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ లు సుధాకర్, వీరస్వామి, రత్నా కర్,లక్ష్మి రాజం, హెడ్ కానిస్టేబుల్ కిషన్, పోలీస్ సిబ్బం ది శ్రీనివాస్,రాము, రాజేందర్,శివశంకర్,రాజు ఉన్నారు.

నవతెలంగాణ-మంథని
ప్రతి మహిళ ఆకాశమే హద్దుగా ఎదగాలని మంథని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పుట్ట శైలజ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మంథని పట్టణంలోని రాజగృహలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా ముందడుగు వేయాలన్నారు. ఆనాడు సావిత్రీబాయి పూలే గొప్ప ఆలోచనతో అక్షరజ్ఞానం నేర్చుకున్న ప్రతి మహిళ అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మంథని నియోజకవర్గంలోని మహిళలకు ఈ సందర్భంగా ఆమె అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుబాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



గోదావరిఖనిలో కేక్ కట్ చేస్తున్న మహిళా పోలీసులు

గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో..
నవతెలంగాణ-గోదావరిఖని:
గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఘనసన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ హాజరై మహిళా పోలీసులు ఎస్ఐలు సోనియా, ఓబులమ్మ, కానిస్టేబుల్స్ జ్యోతి, వెంకటలక్ష్మి,ప్రవలిక, రచన, కష్ణవేణిలకు శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ మాట్లాడుతూ మహిళా మాతృమూర్తులందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐలు ఇంద్రసేనా రెడ్డి, రవీందర్, ఎస్ఐలు రమేష్, భూమేష్, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

11వ డివిజన్‌లో...
నవతెలంగాణ-గోదావరిఖని:
ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామగుండం కార్పొరేషన్ 11వ డివిజన్ సంజయ్ నగర్‌లో శనివారం ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలచే కేక్ కట్ చేయించి సంబురాలను జరిపారు. అనంతరం ఆలయ ఫౌండేషన్ నాయకులు తీట్ల రమేష్ బాబు, లంక సురేష్ మున్సిపల్ స్వీపర్స్, లత, మణెమ్మ, బుదమ్మా, శంకరమ్మలకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు గద్దం లక్ష్మి, చంద్రగిరి లత, గద్దం బుచ్చమ్మ, లంక లచ్చమ్మ, దూడపాక అమతమ్మ, మల్లక్క, గంగరపు కవిత, గద్దం దీప్తి, సోమిడి మానస, తదితరులున్నారు.



ఎలిగేడులో...



జూలపల్లిలో..



మంథనిలో...

కుక్కల దాడిలో మేకలు మృతి

నవతెలంగాణ-జూలపల్లి
మండలంలోని పెద్దాపూర్ గ్రామంకు చెందిన కొండ గంగమ్మ రమేష్‌లకు చెందిన మేకలపై కుక్కలు దాడి చేశాయి. కుక్కల దాడిలో మూడు మేకలు చనిపోయాయి. సుమారుగా 20 వేల రూపాయల నష్టం జరిగిందని కుటుంబ సభ్యులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోని ఆదుకోవాలని కోరుతున్నారు.



మృతిచెందిన మేకలు

అత్యాచారం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జి.జ్యోతి



నవ తెలంగాణ-పెద్దపల్లి టౌన్
ఆశా వర్కర్ అత్యాచార ఘటనను నిరసిస్తూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు పెద్దపల్లి జెండా సెంటర్‌లో ప్లే కార్డులు చూపుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి మాట్లాడుతూ ఆశావర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న దళిత మహిళ శివరాత్రి జాతర డ్యూటీ ముగించుకొని ఇంటికి వెళ్తున్న క్రమంలో ఆమెను బెదిరించి అత్యాచారం చేయడం దారుణమన్నారు. బాధితురాలికి సీఐటీయూ అండగా నిలబడి ఆందోళన చేసిన ఫలితంగానే అధికార యంత్రాంగంలో కదలిక వచ్చిందన్నారు. పగలక, రాత్రనక గర్భిణీ బాలింతలకు సేవ చేస్తున్న ఆశా వర్కర్లకే రక్షణ ఉండడం లేదని, మహిళలకు రక్షణ కల్పించాలని అత్యాచారం చేసిన వ్యక్తిపై ఎస్సీ ఎస్టీ అత్యాచార చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. రవీందర్ బొంకూరు సాగర్, సుశీల,పద్మ, కనకతార, పోసాని, రాజేశ్వరి, భూలక్ష్మి, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌ను అవమానించిన దుండగులను శిక్షించాలి

నవతెలంగాణ-ఎలిగేడు
జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం నగునూర్‌లో భారత రాజ్యాంగ నిర్మాత బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండవేసి అవమానించిన దుండగులను కఠినంగా శిక్షించాలని అంబేద్కర్ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఎలిగేడులోని అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు తాంద్ర అంజి, న్యాతరి పోచయ్య, కవ్వం పల్లి బాపయ్య, శంకర్, పాల్గొన్నారు.

ఉచిత మహిళా ఆరోగ్య శిబిరం

నవతెలంగాణ-ఎలిగేడు
మండలంలోని సుల్తాన్‌పూర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఉచిత మహిళ ఆరోగ్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని 155 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా ఆరోగ్య సమన్వయ కర్త మాదవి రవీంద్ర, డాక్టర్ సునీత శ్రీధర్, చేతన, సభ్యులు అశోక్ రావు, రవీందర్ రావు, పద్మజ, గౌతమ్ రావు, కిషన్, వెంకటేశం, మాజీ సర్పంచ్ అర్నపల్లి వెంకటేశ్వర్ రావు పాల్గొన్నారు



మహిళలకు ఉచితంగా మందులు అందజేస్తున్న వైద్యులు

క్యాన్సర్ బాధితునికి నిత్యావసర సరుకుల అందజేత



నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతున్న దివా నిరుపేద బాధితుని కుటుంబానికి అంతర్జా తీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానికులు మున్నా సమా చారంతో పల్లికొండ రాజేష్ భరోసా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు నసీమాకు ఈ విషయం తెలియజేయగా శనివారం నిత్యావసర సరుకులను అందజేశారు. నిరుపేద కుటుంబానికి భరోసా సంస్థ ఎల్లవేళలా అండగా ఉంటుందని ధైర్యం ఇచ్చారు. ఈ సందర్భంగా భరోసా స్వచ్ఛంద సంస్థ ఆర్గనైజర్ నసీమా, సుమలత, సమాజ సేవకులు రేవతి, సుజాత, ఎఎన్ఎంలు లక్ష్మీ, శ్రీలతలకు పల్లికొండ రాజేష్ శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గున్నాల శ్రీనివాస్, సాదు సత్యనారాయణ, ఎత్రాయి శ్రీను, కలవల శ్రీనివాస్, ఆరుముల్ల సదానందం, బింగీనరేష్, పల్లికొండ రాజేందర్, మున్న, గారె రవి తదితరులున్నారు.

ప్రజా కళాకారుడు జాకబ్ విగ్రహ ఆవిష్కరణ

ఇప్టా జాతీయ నాయకులు కవ్వంపల్లి స్వామి



మాట్లాడుతున్న కవ్వంపల్లి స్వామి

నవతెలంగాణ-గోదావరిఖని:
నేడు గోదావరిఖని న్యూ అశోక్ టాకీస్ ముందు ప్రజా కళాకారుడు, సీపీఐ నాయకుడు జాకబ్ విగ్రహా విష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఇప్టా జాతీయ నాయకులు కవ్వంపల్లి స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం స్మారక సభ భాస్కర రావు భవన్‌లో జరుగుతుందని తెలిపారు. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకట్ రెడ్డి, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్యలతోపాటు వివిధ రాజకీయ, ట్రేడ్ యూనియన్ నాయకులు హాజరవుతారని తెలిపారు. సింగరేణి కార్మికులు, కళాభిమానులు, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మహిళలకు 33శాతం రిజర్వేషన్లను వెంటనే కల్పించాలి

నవతెలంగాణ-గోదావరిఖని:
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు 33శాతం రిజర్వేషన్ల ను వెంటనే కల్పించాలని తెలుగుదేశం పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి, సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మకాయల ఏడుకొండలు డిమాండ్ చేశారు. గోదావరిఖని టిడిపి కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా రామగుండం నియోజకవర్గ మహిళమణులు అందరికి ప్రపంచ మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. స్త్రీ లేకపోతే జననము లేదు, స్త్రీ లేకపోతే జీవము లేదు, స్త్రీ లేకపోతే గమనం లేదు, స్త్రీ లేకపోతే సృష్టే లేదని, ఆమె పుట్టినప్పటి నుంచి కూతురుగా, సోదరిగా, స్నేహితురాలిగా, అలిగా, అమ్మగా, ప్రతి దశలోనూ ప్రేమను పంచుతూ నేటి పోటీ ప్రపంచంలో అన్నిరంగాలలో ముందుకు దూసుకుపోతున్న మహిళలకు వందనాలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు రిజర్వేషన్లను వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళలపై అత్యాచారాలు, దాడులు జరగకుండా రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.



ప్రెస్‌క్లబ్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా కొమురోజు చంద్రమోహన్

నవతెలంగాణ-మంథని



మంథని ప్రెస్‌క్లబ్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా సీనియర్ పాత్రికేయులు కొమురోజు చంద్రమోహన్, డైరెక్టర్లుగా మహావాది సతీష్, ఆర్లబాపు, లక్కాకుల నాగరాజులను నియమించారు. శనివారం మంథని పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో క్రమశిక్షణ కమిటీని ఎంపిక చేశారు. దాడుల వ్యతిరేక కమిటీ చైర్మన్‌గా రామ్ కుమార్, మంథని ప్రెస్‌క్లబ్ దాడుల వ్యతిరేక కమిటీ చైర్మన్‌గా సీనియర్ పాత్రికేయులు పెండ్యాల రాంకుమార్ ఎన్నిక కాగా డైరెక్టర్లుగా కంది కృష్ణారెడ్డి,బాసాని సాగర్, కేసారపు రవి శనివారం మంతెన పట్టణంలోని ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో జరిగిన కార్యక సమావేశంలో ఈ కమిటీలను ఎన్నుకున్నారు.ఈ సమావేశంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు అంకరి కుమార్ అధ్యక్షత వహించగా ఉపాధ్యక్షులు బర్ల సంపత్,ప్రధాన కార్యదర్శి పోతరాజు సమ్మయ్య, సహాయ కార్యదర్శి గంధం ఆంజనేయులు, కోశాధికారి తగరం రాజు లు పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్ కల్పించడం హర్షణీయం

నవతెలంగాణ-మంథని



బీసీలకు ఉద్యోగ ఉపాధి రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్ కల్పించడం హర్షణీయమని పెద్దపెల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్ జి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ,ఎస్సీ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మేనిఫెస్టో కమిటీ చైర్మన్,ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఫేర్‌వేల్ డే వేడుకలు



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-ముత్తారం:
మండలంలోని కేంద్రంలోని శ్రీ సరస్వతి పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ నిర్వహించిన ఫేర్‌వేల్ డే వేడుకలు హోరెత్తించాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపా ధ్యా యుడు రమేష్, కరస్పాం డెంట్ రాపల్లి అశోక్ మాట్లాడుతూ చదువుతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని, జీవితంలో కీలక దశ అయిన విద్యార్థి దశలో చెడుమార్గంలో పయనించకుండాసన్మార్గంలో నడిచి మంచి పౌరులుగా ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్జీ-2లో మహిళలకు ఆటల పోటీలు

నవతెలంగాణ-యైటింక్లైన్ కాలనీ
అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్జీ-2 ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో సీఈఆర్ క్లబ్ నందు 8 ఇంక్లైన్ కాలనీ, పోతన కాలనీ మహిళలకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమములో స్పోర్ట్స్ సూపర్‌వైజర్ నరేందర్ రెడ్డి, సేవా కో అర్డినేటర్ బి.దేవరెడ్డి,8ఇంక్లైన్ కాలనీ, పోతన కాలనీ మహిళలు పాల్గొన్నారు.

శ్రామిక మహిళల సమస్యలపై పోరాటాలు ఉధృతం

శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ జి.జ్యోతి

నవతెలంగాణ-గోదావరిఖని:
మహిళా దినోత్సవ స్ఫూర్తితో శ్రామిక మహిళల సమస్యలపై పోరాటాలు ఉధృతం చేస్తామని శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ జి.జ్యోతి, సీఐటీయూ జిల్లా సెక్రటరీ ముత్యం రావు అన్నారు. శనివవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంతర్జాతీయ శ్రామిక మహిళ దినోత్సవం సందర్భంగా గోదావరిఖనిలోని వంక బెండు దగ్గరి నుండి చౌరస్తా శ్రామిక భవనం వరకు అన్ని రంగాల్లో పనిచేస్తున్న శ్రామిక మహిళలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభకు ముఖ్య అతిథిగా సీఐటీయూ జిల్లా సెక్రటరీ ముత్యంరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 100 సంవత్సరాల క్రితం మహిళా కార్మికులపై జరుగుతున్న దోపిడీ, ఓటు హక్కు కావాలని డిమాండ్స్‌పై చేసిన పోరాటాల ఫలితంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆవిర్భవించిందని అన్నారు. నేడు దేశంలో శ్రామిక మహిళలపై దారుణమైన శ్రమదోపిడీ జరుగుతుందని, లింగ వివక్ష కొనసాగుతుందని అన్నారు. మహిళలపై ఇంటా బయట హింస పెరుగుతుందని, వీటిని అరికట్టడంలో కేంద్ర బీజేపీ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. మున్సిపల్ గ్రామ పంచాయతీ రంగాల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులకు 26వేల కనీస వేతనాలు, చట్టబద్ధ సౌకర్యాలు, పని భద్రత లేదని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ స్ఫూర్తితో శ్రామిక మహిళల సమస్యలపై పోరాటాలు ఉధృతం చేయాలని సభలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐఎల్‌యు రాష్ట్ర మహిళా కన్వీనర్ చందాల శైలజ, నాగమణి, పోచమ్మ, రాజేశ్వరి, శ్యామల, సమతా, నాయకులు ఉపేందర్, సంతోష్ తదితరులున్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

కార్మికుల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలి

సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి

నవతెలంగాణ-గోదావరిఖని:
స్ట్రక్చర్ సమావేశంలో సింగరేణి యజమాన్యం, గుర్తింపు సంఘానికి జరిగిన చర్చలలో యాజమాన్యం చెప్పిన వాదనలో ఏ మాత్రం సమంజసంగా లేదని, కార్మికుల సమస్యల పరిష్కారానికి కమిటీల పేరుతో కాలయాపన చేయటం సరైన పద్ధతి కాదని, ఇకనైనా కమిటీలతో కాలయాపన చేయకుండా వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కారానికి కషి చేయాలని సీఐటీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జీడీకే 2, 2ఎ, ఓసీపీ 5లలో ఉద్యోగులను శనివారం ఆయన కలిసి మాట్లాడారు. పెర్క్స్ మీద ఇన్కమ్ టాక్స్ 91 కోట్లు సింగరేణి యాజమాన్యంపై భారం పడుతుందని చెప్పిన యజమాన్యం, దాదాపు 35 వేల కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల వసూళ్లలో సంస్థ కేవలం వడ్డీ రూపంలో నష్టపోతున్న దానితో పోలిస్తే ఏమాత్రం సమంజసంగా లేదని స్పష్టం చేశారు. ఒక్క పైసా ఆర్థిక భారం పడని మారుపేర్ల మార్పు, విజిలెన్స్ పేరుతో పెండింగ్ పడ్డ అంశాలు పరిష్కారానికి గత ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ గాని, అలాగే ఐదు జాతీయ కార్మిక సంఘాలతోపాటు గత గుర్తింపు సంఘం చేసుకున్న ఒప్పందం గాని, యజమాన్యం ఇప్పటి వరకు అమలు చేయ కుండా మరల అదే సమస్యపై గుర్తింపు సంఘంతో కమిటీ వేయడం ఆంతర్యం, ఆలస్యం చేయటం కాదా అని ప్రశ్నించారు. సొంత ఇంటి పథకంపై సిఐటియు సుదీర్ఘకాలంగా పోరాటం చేయడం ఫలితంగా, కోల్ ఇండియాలో కూడా సొంత ఇంటి పథకంపై ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాత సింగరేణిలో ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని త్వరిత గతిన పరిష్కారం చేయటానికి పూనుకో వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి మెండె శ్రీనివాస్, తోట నరహరి రావు, ఆసరి మహేష్, సిహెచ్.వేణుగోపాల్ రెడ్డి, పి.శ్రీనివాసరావు, దాసరి సురేష్, ఎ.శంకర్, పి.సమ్మయ్య, వి.రామన్న, టి.శ్రీనివాస్, జనార్దన్‌రెడ్డి, బొంకూరి సురేష్, సంపత్, రాజు, బి.చంద్రయ్య, పులి ఈశ్వర్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న తుమ్మల రాజారెడ్డి

ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

నవతెలంగాణ-మంథని



మోహన శర్మ

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కాళేశ్వరం దేవస్థానం మాజీ చైర్మన్,జేఏసీ పెన్షనర్స్ కార్యవర్గ సభ్యులు అవధానుల మోహన శర్మ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమికి ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగులే కారణమని ఆయన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆయన పేర్కొన్నారు.పెండింగ్‌లో ఉన్న బకాయిలను,317 జీవో సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నిమ్‌లో శిక్షణ తరగతుల ముగింపు

నవతెలంగాణ-యైటింక్లైన్ కాలనీ



ఆర్జీ-2 ఏరియాలోని నిమ్ మైనింగ్ విభాగంలో ఫస్ట్ క్లాస్ ఉత్తీర్ణత సాధించిన 190 మంది అభ్యర్థులకు 6 బ్యాచ్‌లుగా నిర్వహించిన శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి జీఎం హెచ్‌ఆర్డీ కార్పొరేట్ హబీబ్ హుస్సేన్,ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య ముఖ్య అతిథిలుగా హాజరై కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, చక్కటి పని సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని ఈ శిక్షణ ద్వారా నేర్చుకున్న విషయాలను విధినిర్వహణలో వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓసీపీ-3 ప్రాజెక్ట్ అధికారి ఎస్.మధుసూదన్, డీజీఎం నిమ్ ఎస్డీఎం హుస్సైనీ, డీజీఎం ఐఎస్‌వో ఎస్ఏంటీసీ ఆర్జీ-2 జీవిఎస్ విజయ్ కుమార్,శిక్షణ తరగతుల వచ్చిన అభ్యర్థులు పాల్గొన్నారు.

విగ్రహాల ముసుగులు తొలగించాలని 10నుండి రిలే దీక్షలు

తిమ్మాపూర్ జేఏసీ కమిటీ



నవతెలంగాణ - తిమ్మాపూర్

తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ముందర రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాలకు ముసుగులు తొలగించి వెంటనే ఆవిష్కరణ చేయాలని కోరుతూ తిమ్మాపూర్ తహసీల్దార్ కార్యాలయం పక్కన ఈ నెల 10నుండి రిలే నిరాహార దీక్షలు చేయనున్నట్లు జేఏసి కన్వీనర్‌లు శనివారం జరిగిన సమావేశంలో తెలిపారు. ఆవిష్కరణ విషయంలో బేషజాలకు పోకుండా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. జేఏసి కన్వీనర్‌లు దుండ్ర రాజయ్య, మాతంగి శంకర్, సుగుర్తి జగదీశ్వరాచారి, వంతడుపుల సంపత్, నాయకులు కనకం రాములు, జలపతి, అలువాల సంపత్, సముద్రాల లక్ష్మణ్, పొన్నం అనిల్, తాటిపల్లి సంపత్, చిలుకూరి రవి పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా చింతిరెడ్డి పద్మ



నవతెలంగాణ - శంకరపట్నం

శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన చింతిరెడ్డి పద్మ మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలుగా రెండవసారి నియామకమయ్యారు. ఈ మేరకు శనివారం డీసీసీ కార్యాలయంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి నియామకపత్రం అందజేశారు. డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి, టిపిసిసి సభ్యుడు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు గోపగోని బస్వయ్యగౌడ్, నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



తిమ్మాపూర్ : మహిళా పోలీసులను శాలువాతో సన్మానిస్తున్న సిఐ, ఎస్ఐ

నవతెలంగాణ - తిమ్మాపూర్

మండలంలోని పలు గ్రామాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎల్ఎండి పోలీస్ స్టేషన్లో తిమ్మాపూర్ సిఐ స్వామి, ఎస్సై తాండ్ర నరేష్ మహిళా పోలీసులను శాలువాతో ఘనంగా సత్కరించారు.

మహాత్మా నగర్‌లోని మానకొండూరు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సతీమణి డాక్టర్ అనురాధకు కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి అనిల్ కుమార్ మామిడి, నాయకులు గంకిడి లక్ష్మారెడ్డి, జంగా రామకృష్ణారెడ్డి, చింతల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

మండలంలోని మహాత్మానగర్ గ్రామంలో మాజీ జెడ్పీటీసి ఉల్లెంగల పద్మఏకానందం ఆధ్వర్యంలో మండలంలోని మహిళా మాజీ ప్రజా ప్రతినిధులను శాలువాతో సత్కరించి, మెమొంటో, చీర అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు కేతిరెడ్డి వనితదేవేందర్‌రెడ్డి, బూడిద ప్రేమలతవేణు కుమార్, మాజీ సర్పంచ్‌లు మాతంగి స్వరూప లక్ష్మణ్, రెడ్డి త్రివేణి తిరుపతిరెడ్డి, కాటిక వినోద, ఉమారాణి, మాదాడి భారతి, మాజీ ఎంపిటిసిలు పాశం తిలక్ ప్రియా అశోక్ రెడ్డి, చిందం విజయలక్ష్మి చంద్రమౌళి, కిన్నెర సుజాత సారయ్య, కవ్వంపల్లి పద్మ పాల్గొన్నారు.



కరీంనగర్ : విజన్ హై స్కూల్‌లో

విజన్ హై స్కూల్‌లో..

నవతెలంగాణ - కరీంనగర్

కరీంనగర్ రేకుర్తిలోని విజన్ హై స్కూల్‌లో ఘనంగా ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం సిరిపురం ప్రసాద్, మల్లయ్య, వెంకట్, ప్రిన్సిపల్ రాజిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్లూబెల్స్ పాఠశాలలో..



కరీంనగర్ : బ్లూబెల్స్ పాఠశాలలో

కరీంనగర్ హనుమాన్ నగర్‌లోని బ్లూబెల్స్ పాఠశాలలో స్టెమ్ షోకేస్ (సైన్స్ ఫెర్), అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని కేవ ల్యాబ్స్ కరీం (హైదరాబాద్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ జంగ సునీత మనోహర్ రెడ్డి, ముఖ్య అతిధులుగా అశోక రెడ్డి (క్వాలిటీ కో ఆర్డినేటర్), ఫండస్ పాఠశాల ప్రిన్సిపల్ పద్మజ ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళా దినోత్సవం పురస్కరించుకొని పాఠశాల ఆవరణలో సెల్ఫీ బూత్ స్టేషన్ ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికి సెల్ఫీ ఫోటో ఫ్రేమ్‌ను బహుమతిగా అందించారు.

అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో..



కరీంనగర్ : అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో

వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళలు అభివృద్ధికి పునాది అని, కుటుంబ సంక్షేమానికి నిర్వచనమని అన్నారు. వేడుకలలో భాగంగా పాఠశాలలో విద్యార్థుల అభివృద్ధికై అహర్నిషలు కృషి చేస్తున్న మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. వారికి బాల్యం గుర్తుకువచ్చేలా పలు వినోదభరితమైన క్రీడా పోటీలను నిర్వహించారు. మహిళ ఉపాధ్యాయులు ప్రదర్శించిన నృత్యాలు చాలా ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో వివిధ పాఠశాలల, కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపక, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వివేకానంద విద్యానికేతన్‌లో..

కరీంనగర్ భగత్ నగర్ వివేకానంద విద్యానికేతన్ విద్యాసంస్థలలో మదర్స్‌కు వారి పిల్లలచే సన్మానం గావించారు. విద్యాసంస్థల చైర్మెన్ కొమురయ్య సొగాని మాట్లాడుతూ.. అత్యున్నత విలువలు కలిగిన మన దేశంలోని మహిళలు ప్రపంచానికి ఆదర్శమని, ఎన్నో రంగాలలో వారు సేవలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రిన్సిపాల్ మిథున్ జే మిస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ సాగర్, ఏవో తుంగాని సంపత్ పాల్గొన్నారు.

పారడైజ్ పాఠశాలలో..



పారడైజ్ పాఠశాలలో

రేకుర్తిలో పారడైజ్ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మెన్ డాక్టర్ పి.ఫాతిమారెడ్డి విచ్చేసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ..నిత్య జీవితంలో మహిళలు పోషిస్తున్న పాత్ర గొప్పదని, ఉన్నత విద్యలో వారికి పెద్దపీట వేయాలని, అన్ని రంగాలలో మహిళలు రాణించాలని, సమాన హక్కులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ సీఈఓ ఉమాకాంత్, ప్రిన్సిపాల్ టి.వసంత, వైస్ ప్రిన్సిపాల్ మధు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళ ఉద్యోగులకు సన్మానం..

అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని డయాగ్నోస్టిక్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళ ఉద్యోగులను సొసైటీ తరపున ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మెన్ పెండ్యాల కేశవరెడ్డి, కార్యదర్శి ఊట్కూరి రాధాకృష్ణరెడ్డి, కార్యవర్గ సభ్యులు ఇంజనీర్ కోల అన్నారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కరీంనగర్ నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్ వద్ద భారత జాతీయ మహిళా సమాఖ్య జెండాను కిన్నెర మల్లవ్వ ఎగురవేశారు. అనంతరం మహిళలంతా కలిసి కేక్ కట్ చేసి మహిళా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు గూడెం లక్ష్మీ, జిల్లా కార్యదర్శి గరిగే శారద, నగర అధ్యక్షురాలు కొట్టె అంజలి, నాయకురాలు ఎండీ బేబి, లక్ష్మీ, గట్టు తిరుపతవ్వ, గట్టు రజిత, సదిరె శారద, స్వప్న, రవళి, మమత, లావణ్య, స్రవంతి పాల్గొన్నారు.



హుజురాబాద్ : మహిళా పోలీసులను సన్మానించిన ఏసీపీ

నవతెలంగాణ - హుజురాబాద్

హుజురాబాద్ ఏసీపీ కార్యాలయంలో ఏసీపి శ్రీనివాస్.జి ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పరిధిలోని మహిళా పోలీసులను ఘనంగా సన్మానించి , మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా పోలీసులు కేక్ కట్ చేశారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. మహిళలు పురుషులతో సమానంగా ప్రతి రంగంలో ప్రతిభ కనబరుస్తున్నారని అన్నారు. స్త్రీలు ఎక్కడ గౌరవించబడతారో అక్కడ దేవతలు కొలువుంటారనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హుజురాబాద్ సిఐ తిరుమల్‌గౌడ్, జమ్మికుంట సిఐలు వరగంటి రవి, కిషోర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్, తెలంగాణ బీసీ సిటిజన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక టీడబ్ల్యూజెఎఫ్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఏఎస్ఐ బి.కమల, హెచ్ఆర్సీ మెంబర్ ఆఫ్ కరీంనగర్ పులుగు లతారెడ్డి, లీగల్ అసిస్టెంట్ మెంబర్ ఆఫ్ హుజురాబాద్ బూర సరితను టాప్రా జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సందెల వెంకన్న, ఆకుల సదానందం, పోలీస్ తదితరులు పాల్గొన్నారు.



శంకరపట్నంలో..

నవతెలంగాణ - శంకరపట్నం

శంకరపట్నం మండలం కేశవపట్నంలో దేవసేన గ్రూప్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ముదిరాజ్ మహాసభ జిల్లా కార్యదర్శి పల్లె స్వరూప, వెంకటలక్ష్మి, కళావతి, శ్రీదేవి రాధా, మహేశ్వరి, శారదా, స్వప్న, లక్ష్మి, వనిత, అఖిల, సుష్మ, లలితా, మంగ, ఉమా, అనిత,కోమల, కనకమ్మ, శాంత పాల్గొన్నారు.



చిగురుమామిడి :

నవతెలంగాణ - చిగురుమామిడి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని చిగురుమామిడి మండలం, సుందరగిరి గ్రామానికి చెందిన జనహిత సోషల్ సర్వీస్ సొసైటీ సీఈవో గందె మనీష అన్నారు. హుస్నాబాద్‌లో సొసైటీ ఆధ్వర్యంలో శనివారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం కుట్టు మిషన్‌లో శిక్షణ తీసుకున్న వారిని సన్మానించారు. వారికి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో జనవికాస రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సీఈవో సంపత్ కుమార్, మహిళలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ మరెళ్ల శ్రీలత మాట్లాడుతూ..మేము కోటాల కోసం ప్రత్యేక హక్కుల కోసం అడగడం లేదు అన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ సమన్వయం కోరుతున్నాం అన్నారు. సమాజంలో మార్పు రావాలంటే మార్పు అవసరాన్ని తెలుసుకోవాలని, కోరుకోవాలని, నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వేముల రమ, మార్క సత్తవ్వ, స్వరూప, సుగుణ, సౌమ్య, పావని, లావణ్య, స్ఫూర్తి, ప్రమీల, కనకవ్వ, ఎల్లవ్వ, ఎంకవ్వ పాల్గొన్నారు.



జమ్మికుంట : మహిళలను సన్మానిస్తున్న బ్రాంచ్ మేనేజర్

నవతెలంగాణ - జమ్మికుంట

ఆల్ ఇండియా రైల్వే రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జమ్మికుంట బ్రాంచ్‌లో బ్రాంచ్ చైర్మన్ డి.రాజేశ్వర్ ఆధ్వర్యంలో మహిళా సభ్యులందరిని శాలువతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. పెరగా చంద్రయ్య, ట్రెజరర్‌లు విద్యాసాగర్, ఖాదర్ ఖాన్, నాయకులు టి.వెంకటస్వామి, మొయినుద్దీన్, బి.సమ్మయ్య, కాజా మొయినుద్దీన్, పరశు రాములు, ఎస్.రాజయ్య, ఎస్.పోశయ్య, సోమయ్య పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బాల వికాసం సంస్థలోని మహిళలతో పట్టణంలోని న్యూ కాటన్ మార్కెట్లో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మార్కెట్ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్నసదానందం, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రేణుకశివ కుమార్ పాల్గొని మాట్లాడారు. మహిళలందరూ అన్ని రంగాలలో ముందుండాలన్నారు. బాలవికాస జమ్మికుంట సెంట్రల్ మేనేజర్ పబ్బు సులోచన మాట్లాడారు. శాలువాతో మార్కెట్ చైర్‌పర్సన్ ను ఘనంగా సన్మానించారు. మహిళలందరూ వివిధ రకాల ఆటల పోటీలలో పాల్గొని కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు. కార్యక్రమంలో బాల వికాస కోఆర్డినేటర్ సుమలత, స్వాతి ఆసియా, అమూల్య పాల్గొన్నారు.

వివేకానంద కళాశాలలో..

నవతెలంగాణ - కరీంనగర్



వివేకానంద కళాశాలలో

కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ.. చదువులలో అగ్రస్థానంలో నిలుస్తూ అన్ని అవకాశాలను అందిపుచ్చుకోవాలని తెలిపారు. అనంతరం కళాశాల ఉపాధ్యాయురాలకు వివిధ రకాల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ధనపురి సాగర్, బి.మహేష్ ఏసీఓ బి.సంపత్ కుమార్, ఏవో బి.శ్రవణ్ కుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్, ఎన్సీసీ క్యాండిడేట్స్ పాల్గొన్నారు.



చొప్పదండి : ఎస్సై అనూషను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ - చొప్పదండి

మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వద్ద శనివారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని చొప్పదండి ఎస్ఐ గొల్లపల్లి అనూషను, సిబ్బందిని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, మాజీ ఎంపీపీ జువ్వాజి హరీష్, పెరుమండ్ల గంగయ్య, ముద్దసాని రంగన్న, గుర్రం రాజేందర్‌రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.



గంగాధర : కేక్ కట్ చేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ జాగీరపు రజిత

నవతెలంగాణ - గంగాధర

పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో ఆర్థిక శక్తిగా ఎదగాలని ఏఎంసీ చైర్‌పర్సన్ జాగీరపు రజిత పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహిళలతో కలిసి కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తోట సంధ్య, సముద్రాల కవిత, శ్రీలత, భారతి, పుల్ల శ్వేత, నాయకులు జాగీరపు శ్రీనివాసరెడ్డి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, నేరెళ్ల పర్శరాం పాల్గొన్నారు.



గన్నేరువరం : చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న మహిళలు

నవతెలంగాణ - గన్నేరువరం

మండలంలోని కాసింపేట గ్రామానికి చెందిన సింగిరెడ్డి లక్ష్మారెడ్డి భాగ్యలక్ష్మి వ్యవసాయ క్షేత్రంలో పయనీర్ మొక్కజొన్న కంపెనీ ప్రతినిధులు క్షేత్ర ప్రదర్శనను రైతులతో కలిసి నిర్వహించారు. అనంతరం రైతులకు అవగాహన కలిగించారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా రైతులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కేకు కోసి స్వీట్లు పంపిణీ చేశారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతి ప్రదానం చేశారు.

పెద్దమ్మ గుడికి గోపుర శిఖరాలు అందజేత



గోపుర శిఖరాలను అందజేస్తున్న మాజీ ఉపసర్పంచ్ అనిల్‌గౌడ్

నవతెలంగాణ - తిమ్మాపూర్

మండలంలోని మన్నెంపల్లి గ్రామంలోముదిరాజ్ కుల సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ గుడికి మాజీ ఉప సర్పంచ్ పొన్నం అనిల్‌గౌడ్ గోపుర శిఖరాలు (గోపురాల కలశాలను) తన సొంత ఖర్చులతో శనివారం విరాళంగా అందించారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గీకురు మల్లయ్య, కొలకాని రాజయ్య, సాయిలు, బీనిపెల్లి రాజయ్య, శ్రీనివాస్, రాయమల్లు, శ్రీనివాస్, మల్లేష్, కనకయ్య, బీనపల్లి నర్సయ్య, గుంటి కిష్టయ్య, నార్ల అశోక్, గుర్రం జగదీష్, నాంపల్లి శంకర్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయునులకు సన్మానం



మహిళా వ్యాయామ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న డివైస్ఓ, ఎస్‌జిఎఫ్ కార్యదర్శి

నవతెలంగాణ - హుజురాబాద్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో తెలంగాణ వ్యాయమ విద్య ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మహిళ వ్యాయామ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. డివైస్ఓటి శ్రీనివాస్, కార్యదర్శి వేణుగోపాల్, తెలంగాణ వ్యాయమ విద్య ఉపాధ్యాయ సంఘ అధ్యక్ష కార్యదర్శులు సొల్లు సారయ్య, అంతటి శంకరయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహాన్ని అవమానపరిచిన వారిని అరెస్టు చేయాలి



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

నవతెలంగాణ - తిమ్మాపూర్

జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం నాగునూర్ గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహన్ని అవమానపరిచిన దుండగులను కఠినంగా శిక్షించాలని శనివారం ఎల్ఎండి పోలీస్ స్టేషన్‌లో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పారునంది జలపతి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మండల ఉపాధ్యక్షుడు అలువాల సంపత్, మండల కార్యదర్శి తాటిపెల్లి సంపత్, అలువాల కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఆశయ సాధనకు కృషిచేయాలి

న్యూ మిలీనియం విద్యాసంస్థల చైర్మన్ ముసిపట్ల తిరుపతిరెడ్డి

ఘనంగా వార్షికోత్సవ వేడుకలు



చిన్నారులతో విద్యా సంస్థల చైర్మన్ ముసిపట్ల తిరుపతిరెడ్డి

నవతెలంగాణ - జమ్మికుంట

విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని, విద్యతో పాటు క్రమశిక్షణ నేర్చుకుని సమాజంలో పాఠశాల పేరు నిలబెట్టాలని జమ్మికుంట పట్టణంలోని న్యూ మిలీనియం స్కూల్స్ చైర్మన్ ముసిపట్ల తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఎంపిఆర్ గార్డెన్‌లో న్యూ మిలీనియం స్కూల్స్ 23వ వార్షికోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ వేషాదరణతో చేసిన నృత్యాలు చూపురులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడారు. న్యూ మిలీనియం విద్యాసంస్థలను 2002లో స్థాపించినప్పటి నుండి ఇప్పటివరకు అంచలంచలుగా ఎదుగుతూ మెరుగైన, నాణ్యమైన విద్యను అందిస్తూ ముందుకు కొనసాగుతుందని తెలిపారు. జమ్మికుంట పట్టణంలో మొట్టమొదటిసారిగా ప్లే స్కూల్ ఏర్పాటు చేసి, చిన్న పిల్లలకు ఆటలతో కూడిన విద్యను అందించడం గొప్ప విషయమని అన్నారు. ఉత్తర తెలంగాణలోని ఇలాంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం మిలీనియం స్కూల్స్‌కే సాధ్యమని అన్నారు. ఎప్పటికప్పుడు అత్యుత్తమ బోధనలు అందిస్తూ, విద్యార్థుల తల్లిదండ్రుల ఆధరాభిమానాలతో ఈ స్థాయికి చేరుకున్నామని తెలిపారు. మీ ఆశీర్వాదంతోనే భవిష్యత్తులో మరింత నాణ్యమైన విద్యను అందిస్తూ ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీణవంక మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుకతిరుపతిరెడ్డి, న్యూ మిలీనియం స్కూల్స్ ప్రిన్సిపాల్ విశ్వనాథరెడ్డి, వరుణ్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన..

బ్రహ్మోత్సవాలకు శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం ముస్తాబు..

నేటి నుండి వారం రోజులపాటు ఉత్సవాలు

10న కల్యాణోత్సవం



నవతెలంగాణ - గంగాధర

భక్తులు కోరిన కోర్కెలు తీర్చే వెంకన్నగా ప్రతీతి చెందిన గంగాధర మండలం గర్శకుర్తి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామి ఆలయ ముఖద్వారాన్ని పోలి ఉన్న ఈ ఆలయంలో ప్రతీ యేటా వారం రోజులపాటు కన్నుల పండువగా వెంకన్న బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయి. ఆలయ కమిటీ చైర్మన్ కల్వకోట శ్రీనివాసరావు నేతృత్వంలో జరుగనున్న ఈ ఉత్సవాలకు సకల సౌకర్యాలతోపాటు భక్తులకు అవసరమైన వసతుల కల్పనకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రాచీన కాలం నుండే ఇక్కడ ప్రతి యేటా బ్రహ్మోత్సవాలు జరుగుతుండగా, నేటికి అదే సాంప్రదాయం ప్రకారం వారం రోజులపాటు ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య 9వ తేదీ నుండి ఉత్సవాలు ప్రారంభమై ఈ నెల 15న ముగుస్తాయి. ఉత్సవాల్లో భాగంగా 9న సేవ, స్వామి వారి ఆలయ ప్రవేశం, 10న పున్యవచనం, రత్విగ్ వర్ణం, అంకురార్పణము, ధ్వజారోహణము, ఎదురుకోళ్లు, గరుడముద్దలు, సాయంత్రం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి కల్యాణం జరుగనుంది. గోళాడ సత్య కీ బోర్డు, శంకరన్న తబలతో సంగీత విభావరి, ఆ తర్వాత బ్రహ్మ శ్రీ పురాణం మహేశ్వరశర్మ ప్రవచనములు జరుగనున్నాయి. 11న హవనం, బలిహరణం, భేరిపూజ, 12న సదస్యం, ప్రముఖ కవి, వాగ్గేయకారుడు నరసింహస్వామి చెప్పే రామాయణం, హరికథ, 13న హనుమత్ వాహనంపై స్వామి వారి దోపోత్సవం, ప్రముఖ హరికథ కళాకారిణి వావిలాల నాగరాణి హరికథ కాలక్షేపం, 14న బండ్లుతిరుగుట, శేష వాహనముపై స్వామి డోలోత్సవం, 15న రథోత్సవంతోపాటు పూజా కార్యక్రమాలు జరుగనున్నాయి. స్వామి వారి కల్యాణోత్సవంతోపాటు అన్నదాన కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ ఉత్సవాలకు తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుండి వేలాదిగా భక్తులు తరలిరానున్నారు. భక్తుల కోసం తాగునీటి వసతి, క్యూలైన్ల ఏర్పాటు, దుకాణ సముదాయాలకు స్థలాల కేటాయింపు వంటి పలు ఏర్పాట్లు చేపట్టినట్లు ఆలయ కమిటి చైర్మన్ కల్వకోట శ్రీనివాసరావు వివరించారు.



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన వెంకటేశ్వరస్వామి దేవాలయం

31 వరకు అందరికీ రైతు భరోసా

- ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



నవ తెలంగాణ - వీపనగండ్ల

మార్చి 31 వరకు అందరికీ రైతు భరోసా డబ్బులు వారి ఖాతాల్లో జమ చేస్తామని, ఎవరూ ఆందోళన చెందొద్దని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల పరిధిలోని సంగినేనిపల్లి గ్రామంలో సీసీ రోడ్లు, పాఠశాల కాంపౌండ్ నిర్మాణానికి, గోపాల్‌దిన్నేలో 33బై11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి శనివారం మంత్రి శంకుస్థాపన చేశారు. నూతన గ్రామపంచాయతీ భవనం ప్రారంభం, గోవర్ధనగిరిలో సీసీ రోడ్లు, బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గోపాల్‌దిన్నే రైతు వేదికలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల లోపు రుణమాఫీ చేసినట్టు చెప్పారు. కొన్ని సింగిల్ విండో కార్యాలయాల్లో తప్పిదాల వల్ల కొందరు రైతులకు రుణమాఫీ కాలేదని, రుణమాఫీ కానీ రైతుల వివరాలను సేకరించి అందరికీ మాఫీ చేస్తామని చెప్పారు. మూడెకరాల్లోపు రైతులకు రైతు భరోసా నిధులు జమ చేశామని, 31 వరకు మిగతావారికి ఖాతాల్లో జమ చేస్తామని అన్నారు. గత ప్రభుత్వం అప్పుల పాలు చేసి రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిందన్నారు. కార్యక్రమంలో నాయకులు వల్లభాపురం నారాయణరెడ్డి, బాల్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు డాక్టర్ గోదల బీరయ్య యాదవ్, ఎంపీటీసీల ఫోరం సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు డాక్టర్ ఇంద్రకంటి వెంకటేష్, సీనియర్ నాయకులు బొల్లారం సుదర్శన్ రెడ్డి, బస్వరాజ్ గౌడ్, ఎస్.రవీందర్ రెడ్డి, వెంకట్రాజయ్య, చక్ర వెంకటేష్, రమేష్‌గౌడ్ అఖిల్, బిచ్చన్న సాగర్ తదితరులు పాల్గొన్నారు.

నాగరాజును చిత్రహింసలు పెట్టిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

- దళిత సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రాంబాబు



నవతెలంగాణ-అశ్వారావుపేట

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలో కోడి పుంజు చోరీ విచారణలో ఒక దళితుడిని చిత్రహింసలకు గురి చేసిన ఎస్ఐ రామ్మూర్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దళిత సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి తగరం రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితుడు నాగరాజుకు న్యాయం చేయాలని ఉన్నతాధికారులను కోరారు. బాధిత కుటుంబ సభ్యులతో కలిసి శనివారం సీఐ కరుణాకర్‌ను కలిసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్ఐ అనుచిత ప్రవర్తనకు దళితుడు బలైపోయాడని, తీవ్రవాది కంటే హీనంగా నాగరాజు పట్ల ఎస్ఐ ప్రవర్తించిన తీరు అత్యంత హేయమైన చర్యగా పేర్కొన్నారు. సంఘటనపై సమగ్ర విచారణ జరపాలని, గతంలో అవినీతి ఆరోపణలు ఉన్న ఎస్ఐ రామ్మూర్తిని విధుల నుంచి తొలగించాలని సూచించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట ఆధార్ పార్టీ జిల్లా అధ్యక్షులు కంటే కేశవ్ తదితరులు ఉన్నారు.

పిల్లల వార్డులో ఎలుకలు

మధ్యప్రదేశ్‌లోని ఓ ఆస్పత్రిలో ఘటన

- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- నెటిజన్ల ఆగ్రహం



భోపాల్ : ఆస్పత్రులు అంటేనే పరిశుభ్రమైన వాతావరణాన్ని కలిగి ఉండాలి. కానీ బీజేపీ పాలిత రాష్ట్రం మధ్యప్రదేశ్‌లో ఆస్పత్రుల పరిస్థితులు మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. ఒక ఆస్పత్రిలోని పిల్లల వార్డులో రోగి బెడ్ వద్ద అనేక సంఖ్యలో ఎలుకలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. దీనికి సంబంధించి ఒక వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీంతో రాష్ట్రంలోని ఆస్పత్రుల పరిస్థితులపై ప్రజలు, నెటిజన్లు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో ఆస్పత్రి యాజమాన్యం, అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనబడుతున్నదని ఆరోపిస్తున్నారు. సదరు ఆస్పత్రిలో పరిశుభ్రత, నిర్వహణపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ వీడియో విస్తృతంగా వైరల్ కావటంతో ఆస్పత్రి యాజమాన్యం తమ తప్పును ఒప్పుకున్నది. ఈ సమస్యను పరిష్కరించటం కోసం కఠినమైన ప్రయత్నాలను అమలు చేస్తామని వివరించింది. "మేము క్రమం తప్పకుండా పెస్ట్ కంట్రోల్‌ను నిర్వహిస్తాం. సమస్య మాత్రం అలాగే ఉంటే.. కఠిన చర్యలు తీసుకుంటాం" అని ఆస్పత్రి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ ఉయ్కే అన్నారు. ఈ ఘటనపై స్పందించిన సీనియర్ జిల్లా అధికారి.. పిల్లల వార్డును సందర్శించారు. సదుపాయాలను మరింతగా పెంచుకోవాలని ఆస్పత్రి యాజమాన్యాన్ని ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే, మధ్యప్రదేశ్ ప్రజారోగ్య ఇంజినీరింగ్ మంత్రి సంపతీయ ఉయ్కే స్పందించారు. ఆస్పత్రిని సందర్శించారు. ఘటనను నిర్లక్ష్యపు చర్యగా అభివర్ణించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీనియర్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్‌ను ఆదేశించారు.

'ఎక్సైజ్' వసూళ్లపై సర్కార్ నజర్..!

సంబంధిత మంత్రికి ఫిర్యాదుల వెల్లువ

కొరవడిన డీసీ, సూపరింటెండెంట్ల పర్యవేక్షణ

సీఐల మామూళ్ల దందాపై సీరియస్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎక్సైజ్ శాఖలో వసూళ్ల పర్వంపై ఆరోపణలు గుప్పుమంటున్నాయి. కొందరు ఎక్సైజ్ సీఐలపై ప్రభుత్వానికి భారీగా ఫిర్యాదులు అందుతున్నాయి. బార్లు, పబ్స్, వైన్ షాపుల నుంచి ముక్కుపిండి మరీ మామూళ్ల వసూల్ చేస్తున్నట్టు సంబంధిత శాఖ మంత్రికి, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందినట్టు సమాచారం. ముఖ్యంగా హెచ్‌ఎండీఏ పరిధిలోని కొందరు సీఐలు విధి నిర్వహణ కన్నా మామూళ్లకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. రంగారెడ్డి డీసీ పరిధిలో పనిచేసే కొందరు సీఐలపై ఎక్కువగా ఈ ఫిర్యాదులు రావడం విశేషం. డీసీ, సూపరింటెండెంట్ల పర్యవేక్షణ కొరవడంతోనే ఈ దందా సాగుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంపై సర్కార్ సీరియస్‌గా ఉన్నట్టు సమాచారం.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్ సూపరింటెండెంట్ పరిధిలో 94 బార్లు, 114 వైన్ షాపులు, మల్కాజిగిరి సూపరింటెండెంట్ పరిధిలో 115 బార్లు, 88 వైన్ షాపులు ఉన్నాయి. జిల్లాలో సూపరింటెండెంట్ల పర్యవేక్షణ కొరవడటం, రంగారెడ్డి డీసీకి పని ఒత్తిడి కావడంతో జిల్లాలోని కొందరు సీఐల పని తీరును వారు సరిగ్గా పర్యవేక్షించకపోవడంతో ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో అవినీతికి అంతేలేకుండా పోయిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా హెచ్‌ఎండీఏ పరిధిలో పని చేసే సీఐలలో చాలా మందికి వసూళ్లపై ఉన్న శ్రద్ధ విధి నిర్వహణలో ఉండటం లేదని, వైన్స్‌లు, బార్లు, పబ్బుల నుంచి వసూళ్లతోపాటు వాటి పంపకాల్లోనూ కింది స్థాయి నుంచి పైస్థాయి అధికారులకు తేడాలు వస్తున్నాయని, దీంతో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకుంటున్నట్టు ఉన్నతాధికారులకు, మంత్రికి ఫిర్యాదులు అందడం గమనార్హం. దీంతోపాటు సీఎంఓకు కూడా ఫిర్యాదులు అందడంతో ప్రభుత్వం వారి అవినీతిపై దృష్టి సారించినట్టు తెలుస్తోంది.

ఎక్కువ ఫిర్యాదులు ఇలా..

కుత్బుల్లాపూర్, బాలానగర్, ఉప్పల్, ఘట్‌కేసర్‌తోపాటు మరికొన్ని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లపై ఎక్కువగా అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు ఎక్సైజ్ సీఐల పరిధిలో 24 గంటలపాటు మద్యం దొరుకుతుందని, స్థానికంగా కొన్ని ప్రాంతాల్లో అడ్డాలను ఏర్పాటు చేసి ఈ అమ్మకాలు కొనసాగిస్తూ ఆయా పీఎస్‌ల పరిధిలోని ఎక్సైజ్ పోలీసులు అందినకాడికి దండుకుంటున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. బార్ల ట్రాన్స్‌ఫర్ల విషయంలోనూ భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, దీనివల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని కొందరు వైన్ షాపులు, బార్ల యజమానులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడం గమనార్హం. పలు పీఎస్‌ల పరిధిలో గుడుంబా, గంజాయి, కల్తీ కల్లు, తదితర వాటిని అరికట్టడంలో ఆయా సీఐలు విఫలమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గతంలోనూ పలు ఆరోపణలు..

మద్యం షాపుల టెండర్లు ముగిసిన వెంటనే మామూళ్ల పర్వం మొదలు పెట్టినట్టు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. కొత్త వైన్ షాపుల నిర్వహణ ప్రారంభం కాకముందే దుకాణానికి రూ.2 లక్షల చొప్పున వసూలు చేసి అధికారులు వాటాలేసుకున్నట్టు అప్పట్లో పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. 2023-25కి జిల్లాలో లక్కీ డ్రా తీశారు. ఎంపికైన వారికి ప్రొవిజినల్ లైసెన్సులు జారీ చేశారు. మొదటి వాయిదా ఫీజును చెల్లించి, ప్రొవిజినల్ లైసెన్సులు తీసుకుంటున్న కొత్త వైన్ షాపుల యజమానుల నుంచి అధికారులు రూ.2 లక్షల చొప్పున వసూలు చేశారని, ఎక్సైజ్ స్టేషన్ల ఖర్చు పేరిట ఈ డబ్బులు వసూలు చేశారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. 'రెండేండ్లపాటు మీకు, మాకు అనుబంధం ఉంటుంది. రూ.కోట్లు పెట్టి వైన్ షాపులు నిర్వహించబోతున్న మీకు రూ.2 లక్షలు పెద్ద ముచ్చటే కాదు' అంటూ వసూలు చేసినట్టు సమాచారం. ఇందులో పై స్థాయి నుంచి కింది స్థాయి వరకు సంబంధిత శాఖ అధికారులు వాటాలేసుకుని మరీ పంచుకోవడం పట్ల అప్పట్లో చర్చ జరిగింది. అడిగిన డబ్బులు ఇవ్వకపోతే భవిష్యత్‌లో నిబంధనల పేరుతో వేధిస్తారని భయపడి యజమానులు చెల్లించినట్టు సమాచారం.

> **వేలం పాటకు ఖర్చుల పేరుతో వసూళ్లు..!**
>
> 2023-25 సంవత్సరాలకుగాను ప్రభుత్వం రెండు నెలల ముందుగానే వైన్ షాపుల వేలం పాట నిర్వహించిన విషయం తెలిసిందే. ఊహించని విధంగా ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి. వైన్ షాపులు కేటాయించటానికి అధికారులు నాగోల్‌లోని ఫంక్షన్ హాళ్లలో డ్రా నిర్వహించారు. లాటరీలు తీయటానికి ఖర్చులయ్యాయి.. షాపుల కేటాయింపు పూర్తయిన తర్వాత ఒక్కో వైన్ షాపు యజమాని రూ.2 వేలు చెల్లించాలంటూ హుకూం జారీ చేశారు. అదేమంటే లాటరీలు నిర్వహించటానికి ఫంక్షన్ హాళ్లు అద్దెకు తీసుకున్నామని, ఇతరత్రా ఖర్చులయ్యాయని వసూలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇలా అప్పట్లో టార్గెట్‌కు మించి దరఖాస్తులు వచ్చేలా చూసిన ఎక్సైజ్ అధికారులు సొంత జేబులు నింపుకున్నట్టు ఆరోపణలు కూడా ఉన్నాయి.



పోరాటస్ఫూర్తితో ఉద్యమిద్దాం

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ
- ఆశా వర్కర్‌పై లైంగికదాడి నిందితున్ని కఠినంగా శిక్షించాలి : సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోరాట స్ఫూర్తితో శ్రామిక మహిళా హక్కుల కోసం ఉద్యమిద్దామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సీఐటీయూ జిల్లా ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి సీఐటీయూ కార్యాలయం వరకు శ్రామిక మహిళలతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సదస్సులో పద్మశ్రీ మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా పని గంటల తగ్గింపునకు, పని పరిస్థితుల మెరుగుకై, వేతనాల పెంపుకై, ఓటు హక్కుకై సుదీర్ఘ పోరాటాల ఫలితంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏర్పడిందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి 115 ఏండ్ల చరిత్ర ఉందని, అంతకన్నా ఎక్కువ చరిత్ర ప్రపంచ వ్యాప్తంగా మహిళల పోరాటాలకు ఉందని తెలిపారు. తరతరాల నుంచి మన సమాజంలో ఆర్థిక అసమానతలు తీవ్రస్థాయిలో వేళ్లూనుకొని ఉండటం మూలాన మహిళలు అవమానాలకు, హింసకు, దాడులకు గురౌతూనే ఉన్నారన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంతో పురోగతిని సాధించి అభివృద్ధి వైపునకు దూసుకుపోతున్నామని మన పాలకులు చెప్పుకుంటున్నప్పటికీ ఆడ పిల్లలపై, మహిళలపై లైంగికదాడులు, హింసాత్మక దాడులు, ప్రేమోన్మాద హత్యలు పెరుగుతున్నాయని చెప్పారు. వీటికి వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. జగిత్యాలలో ఆశా వర్కర్‌పై లైంగికదాడి చేసిన నిందితున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లాలో దళిత ఆశా కార్యకర్తపై ఫిబ్రవరి 27న శివరాత్రి రోజు డ్యూటీ చేసి ఇంటికి తిరిగి వెళుతున్న సందర్భంలో దాడి జరిగిందని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. నిందితున్ని వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కఠినంగా శిక్షించాలని, బాధిత ఆశా వర్కర్‌ను, ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, జిల్లా కోశాధికారి స్వర్ణ, జిల్లా ఉపాధ్యక్షులు విజయ, ఆశా యూనియన్ జిల్లా నాయకులు రేణుక, సుకన్య, రేణుక, స్వప్న, అంగన్వాడీ యూనియన్ నాయకులు సునీత, సందీప్, సుమలత, గిరిజ, ఇంద్ర, భూలక్ష్మి, శోభ, సీహెచ్ నర్స్, దివ్య తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటిని వెంటనే విడుదల చేయాలి

- రోడ్డెక్కిన బోనకల్ మండలం పెద్ద బీరవల్లి గ్రామ రైతులు
- దీఈ హామీతో ఆందోళన విరమణ



నవతెలంగాణ-బోనకల్

ఎండిపోతున్న మొక్కజొన్న పంటకు సాగర్ నీటిని వెంటనే విడుదల చేయాలని ఖమ్మం జిల్లా బోనకల్ మండలం పెద్ద బీరవల్లి గ్రామానికి చెందిన అన్నదాతలు డిమాండ్ చేశారు. శనివారం రావినూతల, జానకిపురం గ్రామాల మధ్య కలకోట మేజర్ బ్రిడ్జిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రైతులు పెద్దపోలు కోటేశ్వరరావు, పెద్దపోలు రామారావు మాట్లాడుతూ.. కలకోట మేజర్ చివరి ఆయకట్టు గ్రామాలైన పెద్దబీరవల్లి, జానకీపురం, నారాయణపురం గ్రామాల్లో మొక్కజొన్న పంట ఎండిపోతుందని.. నీటిపారుదల శాఖ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు వ్యవసాయ శాఖ అధికారులు, మరోవైపు నీటిపారుదల శాఖ అధికారులు పొంతనలేని సమాధానాలు చెబుతూ తమను మోసం చేస్తున్నారని తెలిపారు. వారబందీ విధానం వల్లే తమ పంటలు ఎండిపోతున్నాయని, ఎప్పుడు బంద్ చేస్తారో.. ఎప్పుడు సాగర్ నీరు ఇస్తారో.. తెలియని అయోమయ పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. వారబందీ విధానాన్ని ఎత్తివేసి నిరంతరాయంగా సాగర్ నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. బోనకల్ మండల వ్యాప్తంగా సాగుచేసిన మొక్కజొన్న పంటకు సాగర్ నీరందక ఎండిపోతుందన్నారు. ప్రధానంగా సాగర్ చివరి భూములకు నీరు అందటం లేదని తెలిపారు. రైతుల ఆందోళన విషయాన్ని బోనకల్ దీఈ తమ్మారపు వెంకటేశ్వర్లు, జిల్లా దీఈ ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. దాంతో శనివారం సాయంత్రం కల్లా బోనకల్ బ్రాంచ్ కెనాల్‌కు సాగర్ నీటిని విడుదల చేస్తామని, ఆదివారం సాయంత్రం కల్లా బోనకల్ మండలానికి నీరు వస్తాయని హామీ ఇచ్చినట్టు తెలిపారు. దాంతో రైతులు తమ ఆందోళన విరమించారు.

గురుకులాల్లో

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ కార్యదర్శి అలగు వర్షిణి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ కార్యదర్శి డాక్టర్ అలుగు వర్షిణి శనివారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ మీటింగ్‌లో బాలికలకు మరింత ధైర్యాన్ని ,మనో నిబ్బరాన్ని కలిగించేందుకు చదువులో ఒత్తిడిని ఎలా జయించాలనే విషయాలపై పలువురు ప్రముఖులతో సందేశాలను ఇప్పించారు. సమాజంలో ఒక మహిళగా ఎలా ఎదగాలి? ఎలా స్థిర పడాలి? వారి స్థానమేమిటి? సమాజం కోసం చేయాల్సిన విధుల వంటి పలు అంశాలపై వివరణలు ఇచ్చారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ చాయ్‌రతన్, యూపీఎస్సీ చైర్మెన్ ప్రీతి సుదాన్, స్విమ్స్ తిరుపతి ఎమ్‌డీ డాక్టర్ శిరీష, చైల్డ్ అండ్ అడోలెసెంట్ సైకాలజిస్ట్ ఫౌండర్ గీతా చల్లా తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

ఎస్సారెస్పీ కాలువలో పడ్డ కారు

- మూడేండ్ల బాబు మృతి
- గల్లంతైన తండ్రి, కుమార్తె మృతదేహాలు లభ్యం..
- పర్వతగిరిలో విషాదం





నవతెలంగాణ-పర్వతగిరి

కారు అదుపు తప్పి ఎస్సారెస్పీ కాలువలోకి దూసుకెళ్లిన ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కొంకపాక శివారులోని ఎస్సారెస్పీ కెనాల్ కాలువ వద్ద శనివారం జరిగింది. ఈ ప్రమాదంలో మూడేండ్ల కుమారుడు మృతిచెందగా.. తండ్రి, కుమార్తె గల్లంతయ్యారు. కాలువలో కొట్టుకుపోతున్న తల్లిని స్థానికులు కాపాడారు. ఈక్రమంలో పోలీసులు.. గాలింపు చర్యలు చేపట్టగా తండ్రి, కూతురు మృతదేహాలు లభ్యమయ్యాయి. వివరాల్లోకి వెళితే.. వరంగల్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లికి చెందిన సోమారపు ప్రవీణ్ కుమార్(34) తన భార్య కృష్ణవేణి, కుమార్తె చైత్ర సాయి(5), కుమారుడు ఆర్య వర్ధన్ సాయి(3)తో కలిసి శనివారం హనుమకొండ నుంచి స్వగ్రామానికి కారులో బయలుదేరారు. ఈ క్రమంలో మార్గమధ్యలో డ్రైవింగ్ చేస్తున్న ప్రవీణ్‌కు గుండె నొప్పి వచ్చింది. దాంతో చికిత్స కోసం తిరిగి వరంగల్ వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా గుండె నొప్పి ఎక్కువై కారు అదుపు తప్పి ఎస్సారెస్పీ కాలువలో పడింది. స్థానికుల సాయంతో కృష్ణవేణి బయటపడింది. కుమారుడు మృతిచెందగా.. కారుతో సహా ప్రవీణ్, చైత్ర సాయి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. వారి ఆచూకీ తెలుసుకునేందుకు నీటిని అదుపులోకి తీసుకువచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. సీఐ రాజ గోపాల్, ఎస్ఐ బి.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ప్రయత్నించి చివరకు వారి మృతదేహాలు వెలికితీశారు. మృతుడు ప్రవీణ్ కుమార్ వరంగల్ ఎల్ఐసీ కార్యాలయంలో డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు.

ఉద్యాన పంటలకు కేంద్రం ప్రోత్సాహమేది?

- పెరుగుతున్న పండ్లు, పూలు, కూరగాయ తోటల సాగు
- పంటల సాగులో పెరుగుతున్న యంత్ర పరికరాలు
- పెరిగిన పెట్టుబడితో రైతులపై భారాలు
- వెజిటేబుల్ హబ్‌గా ఉమ్మడి మెదక్
- పాలీ హౌస్, పామాయిల్ సాగుకు అందని రాయితీ
- తెలంగాణకు కేంద్రం కేటాయించింది రూ.145 కోట్లు మాత్రమే..
- జాతీయ ఉద్యాన మండలి రాయితీలూ అరకొరే



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఉద్యాన పంటల సాగు లాభసాటిగా ఉంటుందని, రైతులు వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా పండ్లు, పూలు, కూరగాయాల తోటల సాగు వైపు మళ్లాలని ప్రభుత్వాలు పదే పదే చెబుతున్నాయి. తక్కువ నీటి వనరులతో ఎక్కువ పంటల సాగుకు అవకాశమున్న ఉద్యాన పంటలను ప్రోత్సహించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన నిధుల్ని కేటాయించడంలేదు. ఉద్యానవన పంటల సాగులో యాంత్రీకరణ పెరుగుతోంది. దాంతో పంటల సాగుకు పెట్టుబడులూ భారమవుతున్నాయి. కేంద్రం నుంచి అవసరమైన నిధుల్ని కేటాయించకపోవడంతో ఉద్యానవన పంటల సాగు ఆశించిన మేరకు పెరగట్లేదని వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా పండ్లు, కూరగాయలు, పూల తోటలు, ఇతర వాణిజ్య పంటల సాగును ప్రోత్సహించేందుకు వ్యవసాయ యాంత్రీకరణ, విత్తన రాయితీలివ్వాలని రైతులు కోరుతున్నారు.

రాష్ట్రంలో ఉద్యానవన పంటల సాగు చాలా తక్కువనే చెప్పాలి. వివిధ పంటల సాగు విస్తీర్ణంలో ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం కేవలం 5.27 శాతం మాత్రమే ఉంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో వరి, పత్తి, ఇతర పంటలు కలిపి 15.25 లక్షల ఎకరాల్లో సాగవుతున్నాయి. ఇందులో పండ్ల తోటలైన మామిడి, జామ, బొప్పాయి, డ్రాగన్‌ఫ్రూట్స్, సపోటా వంటి పంటలు 42 వేల ఎకరాల్లో ఉంది. ఉమ్మడి మెదక్ జిల్లా 'వెజిటేబుల్ హబ్' గా పేరుగాంచింది. కూరగాయలైన టమాటా, వంకాయ, పచ్చిమిర్చి, సొరకాయ, ఉల్లి, దొండ, బెంగ, క్యాబేజీ, కాలీఫ్లవర్ వంటి పంటల సాగూ బాగానే ఉంది. ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజల అవసరాల కంటే అధికంగా కూరగాయాల్ని పండిస్తున్నారు. నిత్యం హైదరాబాద్‌తో పాటు కలకత్తా, ఢిల్లీ, చంద్రాపూర్ వంటి ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. గతంలో పాలీ హౌస్ సాగు చేసినా అది తగ్గిపోయింది. గత ప్రభుత్వంలో పామాయిల్ సాగు కూడా గణనీయంగానే జరిగింది. పూల తోటలు, పసుపు, ఆలుగడ్డతో పాటు సుగంధ ద్రవ్యాల సాగు కూడా పెరుగుతోంది. ఉద్యాన వన పంటల సాగుకు అయ్యే ఖర్చులు పెరగడంతో రైతులు అనుకున్నంత మేరకు పంటల్ని సాగు చేయలేకపోతున్నారు.

ఉద్యాన పంటల సాగుకు అందని ప్రోత్సాహం

ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులకు అవసరమైన ప్రోత్సాహం అందట్లేదు. గతంలో పాలీ హౌస్ సాగుకు 75 శాతం అనగా ఒక యూనిట్‌కు రూ.39 లక్షల సబ్సిడీ ఇచ్చేది. మూడేండ్ల తర్వాత సబ్సిడీ సాయం ఆగిపోవడంతో రాష్ట్రంలో పాలీ హౌస్ సాగు మొత్తం కుప్పకూలిపోయింది. గత ప్రభుత్వంలోనూ పామాయిల్ సాగును ప్రోత్సహించారు. మూడేండ్ల పాటు సాగుకయ్యే ఖర్చుల్లో రాయితీ ఇవ్వాల్సి ఉన్నా నిధులు సరిపడా విడుదల చేయకపోవడంతో పామాయిల్ సాగు పెరగట్లేదు. సిద్దిపేట జిల్లాలో లక్ష ఎకరాల వరకు పామాయిల్ సాగు లక్ష్యంతో ముందుకు సాగినా రాయితీలు అందని ద్రాక్ష అయ్యాయి. ఇటీవల మూడు జిల్లాల్లోనూ డ్రాగన్ ఫ్రూట్స్ సాగు పెరుగుతుంది. అయితే రైతులకు సరిపడా ప్రోత్సాహం అందట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పందిరి సాగు పంటలకు ఇవ్వాల్సిన సాయం కూడా విడుదల కావట్లేదు. గత ప్రభుత్వంలోనే ఉద్యానవన శాఖను నిర్వీర్యం చేయడంతో కనీసం పర్యవేక్షణ కూడా లేకుండా పోయింది. పండ్ల తోటల సాగుకు ముందుకొచ్చే రైతులకు మూడేండ్ల పాటు సాగుకయ్యే ఖర్చులన్నీ సబ్సిడీ రూపంలో అందజేయాల్సి ఉన్నా ఎక్కడా అమలు కావట్లేదు.

పెరిగిన యాంత్రీకరణ.. అందని నిధులు

ఉద్యానవన పంటల సాగులో యాంత్రీకరణ పెరిగింది. సూక్ష్మ సేద్య పరికరాలు, పాలీ హౌస్, నెట్‌హౌస్‌ల నిర్మాణం, యంత్ర పరికరాలు, పంటల కోత తర్వాత శుద్ధి యూనిట్లు, నీటి కుంటల తవ్వకం, పైప్‌లైన్ల విస్తరణ వంటి సాగు పెట్టుబడులు విపరీతంగా పెరిగాయి. యంత్ర పరికరాల వినియోగం పెరగడంతో రైతులు అధిక పెట్టుబడుల్ని పెట్టడానికి ముందుకు రావట్లేదు. జాతీయ ఉద్యాన మండలి(ఎన్‌హెచ్‌బీ) రాయితీ పథకం ద్వారా ఇవన్నీ సమకూర్చాల్సి ఉంది. కూరగాయలు, పండ్ల తోటలు, పూల తోటల సాగులో బిందు సేద్య పరికరాలను రాయితీపై అందజేయాలి. తుంపర్ల సేద్యం వల్ల సాగునీటి పొదుపుతో పాటు విద్యుత్ వినియోగం కూడా తగ్గుతుంది. దీని వల్ల రెండు రకాల ప్రయోజనాలున్నాయి. కూరగాయల సాగుకు మొలకలు, ప్లాస్టిక్ సంచుల్ని అందజేయాలి. కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉద్యాన మండలి నుంచి ఇటీవల తెలంగాణకు కేవలం రూ.145 కోట్ల నిధుల్ని మాత్రమే కేటాయించింది. రాష్ట్రంలోని 32 జిల్లాల్లో ఉద్యానవన పంటల సాగు కోసం కేవలం రూ.145 కోట్లు మాత్రమే కేటాయించడంతో కనీసం జిల్లాకు రెండు మూడు కోట్ల నిధులు కూడా రాని పరిస్థితి ఉంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో కూరగాయాలు, పండ్ల తోటలు, పూలు, ఇతర ఉద్యాన పంటల సాగు పెరుగుతున్నప్పటికీ తగిన ప్రోత్సాహం అందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పాలీహౌస్, పామాయిల్, డ్రాగన్ ఫ్రూట్స్, పందిరి సాగు పంటలేసిన రైతులకు ఇప్పటి వరకు రాయితీలు అందలేదు. ఇటీవల కేటాయించిన బడ్జెట్ కూడా కొద్దిపాటి యూనిట్లకు తప్ప రైతులందరినీ ప్రోత్సహించేలా లేవని రైతులు పేర్కొంటున్నారు.

> **ప్రోత్సాహకాలు పెంచాలి: జయరాజు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు**
>
> ఉద్యాన పంటల సాగుకు ముందుకొచ్చే రైతులకు తగిన ప్రోత్సాహం అందించాలి. అందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉద్యాన మండలి నుంచి అధిక నిధులు కేటాయించాలి. కేటాయించే నిధుల్ని కూడా సకాలంలోనే విడుదల చేసి రైతులకు అందేలా చూడాలి. పండ్లు, కూరగాయలు, పూలు ఇతర ఉద్యాన పంటల వైపు రైతుల్ని మళ్లించేందుకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను ప్రచారం చేయాలి. చిన్న, సన్న కారు రైతులకు తొలి ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహించాలి.

ఆమెకు ఆరు చేతులున్నాయా?



ప్రతి ఏడాది మహిళా దినోత్సవం వచ్చిందంటే కంప్యూటర్ ద్వారా గ్రాఫిక్ చేసిన ఆరు చేతులతో ఉన్న మహిళ ఫొటో సోషల్ మీడియాలో విపరీతంగా వస్తూ ఉంటుంది. తన చేతుల్లో లాప్ టాప్, హెయిర్ డ్రయ్యర్, పసిబిడ్డ, వంట గరిటె, ఫోన్, చీపురుతో కనిపిస్తుంది. ఇది చూసినప్పుడు మనకు రెండు ప్రశ్నలు రావాలి. ఒకటి... ఎవరికి ఆరు చేతులు ఉన్నాయి? రెండోది... ఒక మహిళ నుండి ఆరు చేతులు చేసే పనిని ఎందుకు ఆశిస్తున్నాము?

ఇలా మహిళలు ఒకేసారి అనేక పాత్రలు పోషిస్తున్నట్లు చూపడం అనేది అసహజమైన, చేయలేని వాటిని కూడా మంచితనంతో కూడిన దౌర్జన్యంతో చేయించుకుంటున్నట్టు అవుతుంది. ఈ పద్ధతి మహిళలను బయటకు అడుగు వేయలేని, వినయంగా, అన్నీ మౌనంగా భరిస్తూ, తనను తాను నిరూపించుకోలేని పరిస్థితికి తీసుకెళు తుంది. గృహ నిర్వహణకు కావలసిన విషయాలను తెలుసుకోవడం, మానసిక ఒత్తిడి, అంతులేని ఆలోచనలు, భావోద్వేగాలకు గురి కావడం వంటివి మహిళకు శిక్షగా మారుతున్నాయి. మహిళలు విద్యలో ఎంతో పురోగతి సాధించి మెరుగ్గా ఉన్నప్పటికీ ఇంకా అనేక సవాళ్ళు, అడ్డంకులు ఎదుర్కొంటున్నారు. వీటిని దాటి ముందుకు వెళ్ళి తమ పూర్తి సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి, తమకు మద్దతునిచ్చే వ్యవస్థలతో నిర్మొహమాటంగా చర్చించాల్సిన సమయం వచ్చింది. ఇది పారదర్శకంగా ఉన్న గాజు పైకప్పు కాదు.. రాక్షస బంధనం.



రాకాసి మొక్కలా...

ప్రపంచప్రసిద్ధమైన హారీ పాటర్ కథలో ముగ్గురు అమ్మాయిలు ఒక అతీంద్రియ శక్తి వలన ప్రమాదకరమైన మొక్క తీగలచే బంధింప పడతారు. ఒక అమ్మాయి మాత్రం తప్పించుకుంటుంది. మిగిలిన ఇద్దరూ బయటకు రావడానికి ప్రయత్నించినకొద్దీ ఆ తీగలు బిగుసుకు పోతుంటాయి. ఆ అమ్మాయి.. కదలొద్దు.. నాకు తెలుసు.. అది రాకాసి మొక్క అని అంటుంది. భవిష్యత్తులో హ్యారీ పాటర్ పాఠకులు తమ మాయా జాల ప్రయాణాన్ని మంచిగా ప్రారంభించాలి. ముందుగా ఏం జరుగుతుందో తెలియదు. కానీ కాలం గడుస్తున్నకొద్దీ దాని మహిమ తగ్గుతుంది. రాకాసి మొక్క చిత్రం సరైన ఉపమానాలను సృష్టిస్తుంది. దురదృష్టవశాత్తూ అందులో ఒకటి పితృస్వామ్యం.

మాయలో పడేస్తుంది



రాకాసి మొక్క లాగా పితృస్వామ్యం కూడా కృత్రిమం, సంకుచితం, ప్రమాదకరమైనది. పరిమిత పాత్రలు, నియమాలతో ప్రజలను మాయలో పడేస్తుంది. పగిలిన గ్లాస్ సీలింగ్‌లా కాకుండా ఇది మనుషుల్ని విష వలయంలో చుట్టేసి ఊపిరి ఆడకుండా చేసి వ్యక్తి జీవితాన్ని, ఆత్మను సమాధి చేస్తుంది. ఇది అమ్మాయిల పుట్టుక ముందు నుండే అవసరమైనది కాదు అనే భావనతో మొదలై, ఎప్పటికీ రక్షణ లేని అనుభవాలను ఇంటిలోపల, బయటా కూడా ఎదుర్కునేలా చేస్తుంది. అనేక మంది వేధింపులు, దోపిడీ, దుర్వినియోగానికి గురవుతూ, భయం వల్ల ఎప్పటికీ బాధితులుగా మిగులుతారు.

సురక్షిత పరిసరాలు

పితృస్వామ్య వ్యవస్థను మహిళలు చదువుకుని, ఉద్యోగం చేయడం ద్వారా, చైతన్యంతో ఎదిరించాలి. స్వతంత్రంగా వృత్తిని నిర్ణయించుకోగలగాలి. తన ఆకాంక్షను నెరవేర్చుకోగలగాలి. దీనికి అనుకూలమైన పని పద్ధతులు, పని గంటల వెసులుబాటు, పసిపిల్లల సంరక్షణ వంటి సదుపాయాలు ఉన్నప్పుడు బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించ గలుగుతారు. మహిళలకు పని చేసే ప్రదేశంలో రక్షణ కావాలి. పర్యవేక్షణ ఉండాలి. నేరాలు జరగకుండా సిసి టీవీ నిఘా ఉండాలి. రక్షణ, న్యాయవ్యవస్థ, ప్రజలు కలసి పనిచేయడం ద్వారా బాధితులకు న్యాయం అందించగలం.



ధ్వనులు అవసరం

పితృ స్వామ్యం మహిళల జీవితాలను ప్రతి దశ లోనూ అనుభవాలను, అవకాశాలను, సంబంధాలను ప్రభావితం చేస్తుంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్త్రీ జీవిత వాస్తవాలను, ఊపిరి సలపని అణచివేతను మహిళల ఆలోచనలను ప్రతిబింబించాలి. రాకాసి మొక్క లాగానే పితృస్వామ్యం చాటుగా చీకటిలో పనిచేస్తూ మహిళా హక్కులు, భద్రతల గురించి మనం చేయవలసిన చర్చను దారి మళ్ళిస్తుంది, చెడగొడుతుంది, ఒక్కోసారి దొంగిలిస్తుంది. మనం నిరంతరం అగ్ని వెలుగులో మన బంధాలను వదులుచేసుకునే ప్రయత్నం చేస్తూ ఉండాలి. నేడు మనందరికీ నీలి పువ్వుల జ్వాలలు, అగ్ని సృష్టించే ధ్వనులు అవసరం. మంత్రదండాలు సిద్ధంగా ఉంచండి!!



ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సౌజన్యంతో
ఆంగ్ల మూలం: సింధూ శర్మ, ఎస్పీ, కామారెడ్డి
తెలుగు అనువాదం: డా.సీహెచ్.శారద.

నిజాయితీగా ఉండాలి

అమ్మ లేఖ



వేణు గీతికకు ప్రేమతో..

ఎలా ఉన్నావు.. మొన్న మీ కంపెనీ ఫౌండేషన్ డే వేడుకలు అద్భుతంగా జరిగాయి. మమ్మల్ని కూడా ఆహ్వానించి నందుకు చాలా సంతోషం. మీ పై అధికారులను పరిచయం చేసావు. నీ నిజాయితీ, పని పట్ల నీకున్న చిత్త శుద్ధిని, కష్ట పడి పని చేసే నిన్ను మెచ్చుకుంటుంటే ఎంతో సంతోషం వేసింది. తక్కువ సమయంలో మంచి పేరు తెచుకున్నావు.

చూడా నాన్న.. ఒకటి గుర్తు పెట్టుకో, ఉద్యోగం చేసే చోట నిజాయతీ, కష్టపడటం, చెప్పిన పని నిర్ణిత సమయంలో చేయటం, తెలియక పోతే అడిగి తెలుసుకోవడం వంటివి చేయాలి. పై అధికారులు ఉన్నదే మీకు సరైన శిక్షణ ఇవ్వడానికి. మీ నడవడి, ప్రవర్తన ఇవన్నీ కూడా పరిశీలిస్తుంటారు. పై అధికారులతో వినయంగా, మర్యాదగా మాట్లాడాలి. తోటి వారితో స్నేహంగా ఉండాలి. వారికి ఏమైనా తెలియక పోతే చెప్పాలి. భవిష్యత్‌లో నువ్వు ఎక్కడ ఉంటావో, ఎక్కడ ఉద్యోగం చేస్తావో తెలియదు. ఒక వేళ ప్రభుత్వ ఉద్యోగం వస్తే ఎలాంటి ప్రలోభాలకు లొంగ కుండా నిజాయితీగా ఉండాలి. లంచం ఆశ పెట్టి పనులు చేయించుకుంటారు కొందరు. అటువంటి వాటి జోలికి వెళ్లకు. ప్రభుత్వం ఇచ్చే జీతం, ఇతర సౌకర్యాలు మాత్రమే నీవీ. బైట వాళ్ళు ఇచ్చేవి నీవి కావు. నీ ఉద్యోగానికి సంబంధించిన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించు. కొందరు స్వీట్ డబ్బా పట్టుకొస్తారు. అలాంటప్పుడు తోటి ఉద్యోగుల ముందు అది తెరిచి అందులో ఉన్న స్వీట్స్ అందరూ తీసుకోండి అని ఇచ్చేయాలి.

మరి కొందరు ఇంటికి వచ్చి కలుస్తాం అంటారు. ఆఫీస్‌కి సంబంధించిన పనైతే ఆఫీస్‌లోనే మాట్లాడాలి. ఎవరు ఎలాంటి వారో తెలియదు కనుక ఉద్యోగ పరంగా ఎలాంటి నింద పడకుండా చూసుకోవాలి. మరి కొందరు ఇతర ఉద్యోగుల గురించి వివరాలు అడగటం, ఆఫీస్ విషయాలు తెలుసుకోవాలనే ప్రయత్నాలు చేస్తుంటారు. ఆఫీస్ విషయాలు ఎప్పుడూ బయట వారితో చర్చించ కూడదు. ఇవన్నీ సమయస్ఫూర్తితో వ్యవహరించాల్సిన విషయాలు.

నాన్న జీవితంలో ఒక్కటి గుర్తుపెట్టుకొని వ్యవహరించు. నిజాయతీ, కష్టపడి పని చేయడం, ఉన్న దాంట్లో తృప్తి పడటం. ఏ ఉద్యోగం చేసిన సరే వృత్తికి న్యాయం చెయ్యి. ధర్మంగా బతుకు. నీ కష్టాన్ని మాత్రమే నమ్ముకో అభివృద్ధిలోకి వస్తావు. మన కుటుంబములో ఎక్కడా అవినీతి అనేది లేదు. ఉన్నదాంట్లో బతికారు, కష్టపడ్డారు, సమాజంలో మంచి పేరు సంపాదించుకున్నారు. నువ్వు కూడా అలాగే ఉండాలని ఆకాంక్షిస్తున్నాను.

ఉద్యోగంలో కొత్తగా చేరావు కనుక, ముందు ముందు ఎలాంటి వ్యక్తులు తారసపడతారో తెలియదు. ముందు జాగ్రత్తగా నీకు ఇవన్నీ చెప్తున్న బంగారు తల్లి. జాగ్రత్తగా ఉంటావు కదూ..



ప్రేమతో మీ అమ్మ
- పాలపర్తి సంధ్యారాణి

సంపద అందని వర్గాలపై విశ్లేషణ చేయండి

స్వతంత్ర, మేధావుల కమిటీని కోరిన డిప్యూటీ సీఎం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇప్పటికీ సంపద, వనరులు అందని వర్గాలపై విశ్లేషణ చేయాలని స్వతంత్ర, మేధావుల కమిటీని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ (ఆర్థిక, రాజకీయ, విద్య, సామాజిక, న్యాయ) సర్వే సమాచారం ఆధారంగా ఈ అంశంపై సంపూర్ణ అధ్యయనం చేయాలని సూచించారు. సర్వే సమాచారం మేరకు ఏయే వర్గాలు రాజకీయంగా, ఆర్థికంగా తరతరాలుగా వెనుకబడి ఉన్నాయో, రాష్ట్ర వనరులు అందు బాటులో లేకుండా ఉన్నాయో అధ్యయనం చేసి నెల రోజుల్లో నివేదిక అందజేయాలని కమిటీని కోరారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి చైర్మెన్‌గా, రిటైర్డ్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య వైస్ చైర్మెన్‌గా, ప్రవీణ్ చక్రవర్తి కన్వీనర్‌గా, కమిటీ సభ్యులుగా డాక్టర్ సుఖదేవ్, రిటైర్డ్ ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, ప్రొఫెసర్ శాంత సిన్హా, ప్రొఫెసర్ హిమాన్షు, ప్రొఫెసర్ భూక్య భంగ్య, ప్రత్యేక ఆహ్వానితులుగా జీన్ డ్రీజ్‌లతో కూడిన కమిటీని శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే.

కోతల సీఎం

(మొదటిపేజీ తరువాయి)

రూ.5 వేల కోట్ల వడ్డీ రుణాల బకాయి ఉన్న సర్కారు ఐదేండ్లలో రూ.లక్ష కోట్ల రుణాలు ఎలా ఇస్తుంది? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ తీరుతో మహిళలు అప్పులపాలవుతున్నారని చెప్పారు. మహిళలకు ప్రతి నెలా రూ.2,500 గ్యారంటీ నెరవేర్చని సర్కారు వేడుకలు నిర్వహించడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రతి మహిళకు బకాయి పడ్డ రూ.37,500 ఎప్పుడు చెల్లిస్తారు? అని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యంలో కేసీఆర్ కిట్, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్, బతుకమ్మ చీరలు, ఆరోగ్యలక్ష్మి, ఆరోగ్య మహిళ, పెన్షన్ల పెంపు నిలిపేశారని హరీశ్‌రావు విమర్శించారు. కడుపుకోతలు మళ్లీ పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. నేరాలు పెరిగి మహిళలు అభద్రతకు గురవుతున్నారని చెప్పారు. రూ..20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు, 18 ఏండ్లు పైబడిన యువతులకు ఎలక్ట్రిక్ స్కూటీ, కళ్యాణ లక్ష్మికి రూ. లక్షతో పాటు తులం బంగారం, డ్వాక్రా సంఘాలకు పక్కా భవనాల నిర్మాణం, పుట్టిన ప్రతి బిడ్డకు ఆర్థిక సాయంతో కూడిన బంగారు తల్లి పథకం పునరుద్ధరణ, అంగన్‌వాడీ టీచర్లకు రూ.18 వేల వేతనం పెంపు, ఉద్యోగ భద్రత, ఆశావర్కర్లకు వేతనాల పెంపు హామీలను అటకెక్కించారని విమర్శించారు. ఇవేవీ అమలు చేయకుండా నవ్విపోతే నాకేంటి సిగ్గు అన్నట్టు వేడుకలు నిర్వహించారని ఎద్దేవా చేశారు.

దక్షిణాదిపై కేంద్రం కక్ష

(మొదటిపేజీ తరువాయి)

రాజకీయాలకతీతంగా అన్ని పార్టీలు కలిసి రావాలని కోరారు..

కేంద్రం సమన్యాయం పాటించడం లేదు : అసదుద్దీన్

"రాష్ట్రాల హక్కులు, నిధుల పంపకాల విషయంలో కేంద్రంలోని మోడీ సర్కార్ సమ న్యాయం పాటించడం లేదు. బీజేపీ పాలిత రాష్ట్రాల పట్ల ఉదారంగా వ్యవహరిస్తూ, తెలంగాణ పట్ల పక్షపాతాన్ని చూపిస్తోంది. ఆర్ఆర్ఆర్ మొదలుకుని హైదరాబాద్ నగరానికి నీళ్లందించే గోదావరి నీటి ప్రాజెక్టుల వరకు అన్నింటా అన్యాయంగా వ్యవహరిస్తోంది. పార్లమెంట్ వెలుపల, బయట రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న అన్యాయాలను ఎండగడుతాం" అని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ తమ పార్టీ వైఖరిని తెలిపారు.

28 అంశాలివే..

ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం కింద చెల్లించాల్సిన గ్రాంట్ విడుదల, 2014-15 ఆర్థిక సంవత్సరానికి సీఎస్ఎస్ నిధుల విడుదలలో లోపాన్ని సరిదిద్దమని అభ్యర్థన, ప్రాంతీయ రింగ్ రోడ్డుకు ఆమోదం, ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకూ రేడియల్ రోడ్ల అభివృద్ధి, మెట్రో రెండో దశ, మూసీ రివర్ ఫ్రంట్, బాపు ఘాట్‌ను గాంధీ సరోవర్‌గా అభివృద్ధి చేయడం, గోదావరి-మూసీ నది లింక్ ప్రాజెక్ట్, హైదరాబాద్ కోసం మురుగునీటి పారుదల మాస్టర్ ప్లాన్, వరంగల్ భూగర్భ డ్రయినేజీ ప్రణాళిక, బందర్ పోర్టు నుంచి హైదరాబాద్ సమీపంలోని డ్రై పోర్టు వరకూ గ్రీన్‌ఫీల్డ్ హైవే, ఎస్సీసీఎల్ కోసం బొగ్గు బ్లాకుల కేటాయింపు, సెమీకండక్టర్ మిషన్, ఐపీఎస్ కేడర్ కేటాయింపులు, పీఎస్‌డీఎఫ్ కింద పథకాల మంజూరు, పీఎం కుసుమ్-ఏబీసీ కింద కేటాయింపు, తాడిచెర్ల బొగ్గు బ్లాక్-మైనింగ్ లీజు, వివిధ కార్పొరేషన్లు/ఎస్‌పీవీల రుణ పునర్నిర్మాణం వర్తించే మొత్తాన్ని తిరిగి చెల్లించడం, ఏపీబిల్డింగ్, ఇతర కార్మికుల సంక్షేమ బోర్డు, కార్మిక సంక్షేమ నిధిలో తెలంగాణకు వాటా కోసం నిధుల బదిలీ, ఏపీ పవర్ కార్పొరేషన్ నుంచి రావాల్సిన మొత్తాన్ని ఇప్పించడం, పీఎం మిత్రా పార్క్ పథకం కింద కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు, అన్‌కవర్డ్ జిల్లాల్లో జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటు, ఖమ్మంలో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్, వెనకబడిన ప్రాంతాల్లో రోడ్డు కనెక్టివిటీని మెరుగు పర్చడం రాష్ట్రంలో విమానాశ్రయాల అభివృద్ధి, రైళ్ల కనెక్టివిటీ పెంచడం.

అంతర్జాతీయ యూనివర్సిటీలతో పోటీపడాలి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం అంతర్జాతీయ యూనివర్సిటీలతో పోటీ పడాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అభిలషించారు. దానికోసం విద్యార్థినులు బాగా చదువుకొని ఇంజినీర్లు, డాక్టర్లుగా రాణించాలని చెప్పారు. వచ్చే ఎన్నికల నాటికి చట్ట సభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలవుతాయనీ, ఆ అవకాశాలను అందిపుచ్చుకొనేందుకు నాయకులుగా ఎదగాలని దిశానిర్దేశం చేశారు. శనివారంనాడిక్కడి కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం నూతన భవన నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1924లో ఏడుగురు విద్యార్థులతో మొదలై వందేండ్లు పూర్తి చేసుకొని నేడు ఏడు వేల మంది విద్యార్థులతో యూనివర్సిటీగా ఎదిగి, కోఠి ఉమెన్స్ కాలేజ్ అభివృద్ధి వైపు పయనిస్తున్నదని తెలిపారు. ఈ యూనివర్సిటీకి గడీలు, దొరలకు వ్యతిరేకంగా పోరాట స్ఫూర్తిని ప్రదర్శించిన చాకలి ఐలమ్మ పేరును పెట్టుకున్నామనీ, అభివృద్ధి పనుల కోసం రూ.500 కోట్లు మంజూరు చేశామని వివరించారు. ఈ యూనివర్సిటీలో సీటు రావడం అదృష్టంగా భావించి, దాన్ని అవకాశంగా మలచుకోవాలని దిశానిర్దేశం చేశారు. అంతర్జాతీయ యూనివర్సిటీలైన ఆక్స్‌ఫర్డ్, స్టాన్‌ఫోర్డ్ వంటి యూనివర్సిటీలతో పోటీపడాలని చెప్పారు. ఇందిరాగాంధీ, మీరా కుమార్, సోనియాగాంధీ వంటి మహిళలు దేశానికి గొప్ప నాయకత్వాన్ని అందించారనీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా శాంతికుమారి, విద్యాశాఖ కార్యదర్శిగా యోగితారాణా, మంత్రివర్గంలో సీతక్క వంటి వారు ఉన్నారని ఉదహరించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. పాఠశాల విద్యార్థులకు అందించే 1.30 కోట్ల జతల యూనిఫాంలను కుట్టే అవకాశాలను మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చామని తెలిపారు. ఆడబిడ్డల్ని పారిశ్రామికవేత్తలుగా మార్చేం దుకు వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తి ప్లాంట్లు కేటాయించామనీ, ఆర్టీసీ బస్సుల నిర్వాహకు లుగా మారుస్తున్నామని వివరించారు. రెండున్నరేం డ్లలో యూనివర్సిటీలో హాస్టల్స్, ప్లే గ్రౌండ్స్, ఆడిటోరియాలు వంటి భవన నిర్మాణాలన్నీ పూర్తికా వాలనీ, ఆ పనుల్ని తానే స్వయంగా పర్యవేక్షిస్తాననీ చెప్పారు. అంతకుముందు ఆయన ఎన్‌సీసీ మహిళా కేడెట్ల గౌరవ వందనం స్వీకరించారు. అక్కడి ఆడిటోరియంను సందర్శించారు. సభలో వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ సూర్యా ధనుంజయ్ నాయక్ స్వాగతోప న్యాసం చేశారు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు మండల కేంద్రాల్లో రైస్ మిల్లులు, గోడౌన్లు

(మొదటిపేజీ తరువాయి)

గుర్తుచేశారు. బీఆర్ఎస్ హయాంలో ఈ పనిని కార్పొరేట్లకు, మంత్రుల అనుయాయులకు అప్పగించారని విమర్శించారు. మహిళలు సమావేశాలు నిర్వహించు కునేందుకు ఒక్కో జిల్లా కేంద్రంలో రూ.25 కోట్లతో ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. గతంలో సోలార్ విద్యుత్ అంటే అదానీ, అంబానీ లాంటి పారిశ్రామికవేత్తలే గుర్తుకువచ్చే వారనీ, ఇందిరమ్మ రాజ్యంలో వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసేలా మహిళా సంఘాలతో ఎంఓయూ చేసినట్టు తెలిపారు. వారు ప్రభుత్వానికి విద్యుత్ సరఫరా చేస్తారన్నారు. రవాణాశాఖలో పెట్టుబడిదారులు బస్సులను అద్దెకిచ్చి యజమానులుగా లాభాలు పొందేవారనీ, తాము తీసుకున్న నిర్ణయంతో వెయ్యి ఆర్టీసీ బస్సులకు మహిళలే యజమానులు కాబోతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు సముచిత స్థానం కల్పించినట్టు తెలిపారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు తీసుకొస్తే, వారు చట్టసభల్లో వెళ్లేందుకు సోనియాగాంధీ మార్గం సుగమం చేశారని తెలిపారు. ప్రతిభాపాటిల్, మీరాకుమార్ తదితర మహిళా నాయకత్వాన్ని కాంగ్రెస్ ప్రోత్సహించిందన్నారు. రాబోయే రోజుల్లో మహిళా నాయకులు ముందుకు రావాలనీ, వారిని ఎమ్మెల్యేలు, ఎంపీలుగా గెలిపించుకునే బాధ్యత తనదేనని సీఎం భరోసానిచ్చారు. మహిళా సంఘాల ఉత్పత్తుల కోసం హైదరాబాద్ మాదాపూర్‌లో ఏర్పాటు చేసిన బజార్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. అవసరమైతే ఆ వస్తువులకు పన్నుల్ని మినహాయిస్తామనీ, కార్పొరేట్ సంస్థలతో పోటీ పడాలని ప్రోత్సహించారు. రాష్ట్రంలోని మహిళా సంఘాల్లో 65 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారనీ, ఆ సంఖ్యను కోటి మందికి పెంచేందుకు సంఘాల్లో చేరేందుకు ఉన్న 18 ఏండ్ల వయస్సును 15 ఏండ్లకు తగ్గించామని వివరించారు. సంఘంలో సభ్యురాలిగా కొనసాగేందుకు ప్రస్తుతమున్న 60 ఏండ్ల పరిమితిని 65 ఏండ్లకు పెంచిన విషయాన్ని గుర్తుచేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు వీలుగా కోటి మందిని మహిళా సంఘాల్లో చేర్చాలని సూచించారు.

అభివృద్ధిలో భాగస్వాములు కండి
బీఆర్ఎస్ నేతలకు సీఎం సూచన

రాష్ట్ర, మహిళల అభివృద్ధిలో బీఆర్ఎస్ నాయకులు భాగస్వాములు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదం, రోడ్డు ప్రమాదం, ఇలా ఎక్కడ ప్రమాదం జరిగినా తనను తిడుతూ బీఆర్ఎస్ నాయకులు పైశాచికానందం పొందుతున్నారని విమర్శించారు. పదేండ్ల పాలనానుభవంతో ప్రభుత్వానికి సూచనలు చేయాలే తప్ప పైశాచికానందం పొందడం సరికాదని హితవు పలికారు. అలా పైశాచికానందం పొందిన వారెవరూ బాగుపడ్డట్టు చరిత్రలో లేదని గుర్తుచేశారు. ఏడ్వడం ఆపి కులగణనలో, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

పదేండ్లలో పదివేల కోట్ల రూపాయల
వడ్డీ రుణాలిచ్చారా హరీశ్‌రావు? : డిప్యూటీ సీఎం భట్టి

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ మహిళా సంఘాలకు ఈ ఏడాది ఇప్పటికే రూ.21 వేల కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో మహిళలను ఆర్థికంగా నిలబెట్టే ఆలోచన చేయలేదని విమర్శించారు. అలాంటి ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా చేసిన హరీశ్‌రావు అవాకులు, చెవాకులు పేలుతున్నారని ఎద్దేవా చేశారు. పదేండ్లలో రూ.10 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చారా? అని ఆయన్ను ప్రశ్నించారు. ప్రజలు ఆర్థికంగా బలపడితే వారికి గులాంగిరీ చేసే వారు ఉండరనే కక్షతోనే దొరలు అవాకులు, చెవాకులు పేలుతున్నారని విమర్శించారు. హరీశ్ రావులాగా తమకు గాలికబుర్లు చెప్పడం రాదన్నారు. మహిళా విశ్వవిద్యాలయానికి రూ.500 కోట్లు, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ప్రతి నియోజకవర్గంలో మొదటి దశలో 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టినట్టు వివరించారు. రెండో విడతలో మరో 3,500 చొప్పున ఇండ్లు కడుతామని నొక్కి చెప్పారు. అన్ని వర్గాల కోసం పని చేస్తున్న ప్రజా ప్రభుత్వాన్ని కాపాడుకోవాలని మహిళలకు పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్ నేతల మాటలు వింటే వందేండ్లు వెనక్కి : మంత్రి సీతక్క

మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ ..రాష్ట్రంలో మహిళలు అభద్రతా భావం నుంచి ఆర్థికంగా నిలదొక్కుకునే స్థాయికి ఎదిగారని చెప్పారు. సమానపనికి సమాన వేతనం, ఓటు హక్కు కోసం పోరాడిన రోజు ఇది అని గుర్తుచేశారు. ప్రతి మహిళ దీవెన కూడా రాష్ట్ర ప్రభుత్వానికి అవసరమన్నారు. మహిళా సంఘాల కోసం 20 రకాల వ్యాపారాలు అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. 600 ఆర్టీసీ బస్సులకు మహిళా సంఘాల సభ్యులను ఓనర్లుగా చేశామన్నారు. ఇప్పటిదాకా రూ.115 కోట్లను మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం వెచ్చించామన్నారు. పెట్రోల్ బంకులు, 1,000 సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఎంఓయూ, 2.25 లక్షల చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, ప్రమాద బీమా రూ.10 లక్షలు, లోన్ బీమా రూ.2 లక్షలు తదితర అనేక కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఎంపీలు మల్లు రవి, అనిల్‌కుమార్ యాదవ్, కడియం కావ్య రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, కేకే, విప్ ఆది శ్రీనివాస్, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, కార్పొరేషన్ల చైర్మెన్లు శారద, అలేఖ్యపాల్గొన్నారు.

సొరంగంలో ముగ్గురు కార్మికుల ఆనవాళ్లు

గుర్తించిన క్యాడవర్ డాగ్స్
నేటి నుంచి రోబోలను దింపనున్న ప్రభుత్వం
నీటి ఊట పెరగడంతో పూర్తి స్థాయిలో పసిగట్టని డాగ్స్
ఇది ఒక జాతీయ విపత్తు
సమీక్షలో నీటిపారుదల శాఖామంత్రి ఉత్తమ్

నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో మూడు చోట్ల క్యాడవర్ డాగ్స్ కార్మికుల ఆనవాళ్లను గుర్తించాయి. ఆ ప్రాంతాల్లో తవ్వేందుకు రెస్క్యూ బృందాలు లోపలికి వెళ్లాయి. ఈ ప్రమాదం ఒక జాతీయ విపత్తు అని, కార్మికులను వెలికితీయడానికి, సహాయక చర్యల్లో ప్రపంచంలోని అత్యుత్తమ సాంకేతికతను వినియోగిస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. అయితే, జీపీఆర్ స్కాన్, కేరళ డాగ్స్‌ను రంగంలోకి దింపినా ఉబికి వస్తున్న నీటి ఊట వల్ల సహాయక చర్యలు ముందుకు సాగడం లేదు. చివరి 50 మీటర్ల నిడివి పూర్తి ప్రమాదకరంగా మారింది. టన్నెల్ పై భాగం నెర్రెలు బారి కూలడానికి సిద్ధంగా ఉంది. అందుకే టన్నెల్‌లో పని చేయాలంటే ప్రమాదం కొని తెచ్చుకున్నట్టేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కార్మికులను గుర్తించడానికి ఆదివారం నుంచి రోబోలను దించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. సొరంగంలో కేరళ క్యాడవర్ డాగ్స్ ముగ్గురు కార్మికుల ఆనవాళ్లు గుర్తించినట్టు అధికారులు చెప్పారు. పూర్తి స్థాయిలో సమీక్ష నిర్వహించడానికి ఈనెల 11న సీఎంతో సమీక్ష నిర్వహిస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

శనివారం ఉదయం అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణతో కలిసి మంత్రి ఉత్తమ్ ఎస్-ఎల్బీసీ టన్నెల్‌ను సందర్శించారు. వివిధ రంగాల నుంచి పనిచేస్తున్న రెస్క్యూ బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సొరంగంలో సహాయక చర్యల పురోభివృద్ధిపై రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కార్యదర్శి



అరవింద్ కుమార్, ఆర్మీ కమాండెంట్ పరిక్షిత్ మెహ్రా మంత్రికి వివరించారు. ఎన్‌జి.ఆర్.ఐ జియోగ్రాఫికల్ సర్వే ఆఫ్ ఇండియా, క్యాడవర్ డాగ్ బృందం, ర్యాట్ మైనర్స్, రోబోటిక్ రంగాల నిపుణులతో చర్చించి సహాయక చర్యలపై సలహాలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సొరంగం లోపల సరిగ్గా ఆక్సిజన్ స్థాయి లేకపోవడం, నీరు అధికంగా ఊరటం, టీబీఎం యంత్రం రాళ్లు, మట్టితో కూరుకుపోయి ఇబ్బందులు ఉన్నప్పటికీ సహాయక చర్యలు కొనసాగించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. త్వరగా కార్మికులను గుర్తించేందుకు ప్రపంచంలోని అత్యుత్తమ సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. రెస్క్యూ సిబ్బందికి కూడా ప్రమాదం పొంచి ఉన్నందున అన్వి రోబోటిక్ నిపుణులతో సహాయక చర్యలు చేపట్టేందుకు రూ.4 కోట్లు ఖర్చు చేయనున్నట్టు వెల్లడించారు. రోబోలను వెంటనే రంగంలోకి దింపాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సహాయక చర్యలో అహర్నిశలూ కష్టపడి పనిచేస్తున్న అధికారులు, నిపుణులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఆర్మీ డోగ్రా రెజిమెంట్ కమాండెంట్ పరిక్షీత్ మెహ్రా, మిలటరీ ఇంజినీర్ వికాస్ సింగ్, ఎన్‌డిఆర్ఎఫ్ ప్రసన్న కుమార్, ఎస్‌డిఆర్ఎఫ్ కమాండెంట్ ప్రభాకర్, సింగరేణి, రైల్వే, ఎన్‌జిఆర్ఐ, హైడ్రా తదితర రంగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

సొరంగంలో ప్రమాదం పొంచి ఉంది. అంతర్జాతీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడినా 15 రోజులుగా కార్మికులను గుర్తించలేదు. జీపీఆర్ స్కాన్ ద్వారా కార్మికుల ఆచూకీ తెలుస్తుందని భావించారు. అయితే, జీపీఆర్ గుర్తించిన దగ్గర ఇనుప రాడ్లు ఉన్నట్టు తేలింది. ఆ తర్వాత కేరళ క్యాడవర్ డాగ్స్‌ను సొరంగంలోకి పంపి రెండ్రోజులుగా కార్మికుల ఆచూకీ కోసం గాలించారు. ఊట రాళ్లు పడుతుండటంతో కార్మికులకు ప్రమాదం పొంచి వుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకే నేటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం రోబోలను రంగంలోకి దింపనుంది.



సహకారం అవసరం

క్రీడాభివృద్ధిపై శాట్ చైర్మెన్ శివసేన

హైదరాబాద్ : తెలంగాణలో క్రీడాభివృద్ధికి రాష్ట్రంలో చేపట్టబోయే క్రీడా కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని శాట్ (తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ) చైర్మెన్ కే. శివసేనా రెడ్డి కోరారు. ఈ మేరకు కేంద్ర క్రీడాశాఖ సహాయ మంత్రి రక్ష నిఖిల్ ఖడ్సేకు శివసేనా రెడ్డి వినతి పత్రం అందజేశారు. మెదక్‌లో సాయ్ ఎస్‌టీసీ అథ్లెటిక్ సెంటర్‌ను సైతం పున ప్రారంభించాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, శాట్ ఎండీ సోనీ బాలదేవి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విలియమ్స్ స్థానంలో బాచ్

ముంబయి ఇండియన్స్ నిర్ణయం

ముంబయి : ఐపీఎల్ 18 ఆరంభం కాకముందే గాయాల దెబ్బకు ఆటగాళ్లు దూరం అవుతున్నారు. తాజాగా దక్షిణాఫ్రికా పేసర్ లిజాడ్ విలియమ్స్ గాయంతో ఐపీఎల్ 2025 నుంచి తప్పుకున్నాడు. ఇటీవల ఎస్‌ఏ20 టైటిల్ సాధించిన ఎంఐ కేప్‌టౌన్ జట్టులో భాగమైన కార్బిన్ బాచ్‌ను విలియమ్స్ స్థానంలో ముంబయి ఇండియన్స్ తీసుకుంది. గతంలో రాజస్థాన్ రాయల్స్ తరఫున రిజర్వ్ ప్లేయర్‌గా ఐపీఎల్‌లో కనిపించిన బాచ్.. ఐపీఎల్‌లో అరంగేట్రం కోసం ఎదురు చూస్తున్నాడు.



ఈసారి వదలొద్దు!

- చాంపియన్స్ ట్రోఫీపై భారత్ గురి
- ఫైనల్లో భారత్, న్యూజిలాండ్ ఢీ
- మ॥ 2.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

ఐసీసీ టోర్నమెంట్లలో నిలకడగా రాణిస్తున్న జట్లలో భారత్, న్యూజిలాండ్ ముందంజలో ఉంటాయి. వైట్‌బాల్ ఫార్మాట్‌లో భారత్, కివీస్ ఆధిపత్యం కోసం పోటీపడుతూనే ఉన్నాయి. పరుగుల వేటలో, స్పిన్ మాయజాలంలో ఈ రెండు జట్లకు వ్యత్యాసం అతి స్వల్పం. నేడు ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారత్, న్యూజిలాండ్ అమీతుమీకి సిద్ధపడ్డాయి.

ఐసీసీ వైట్‌బాల్ టైటిల్ స్వప్నం సాకారం చేసుకునేందుకు ఇదే సరైన తరుణంగా న్యూజిలాండ్ భావిస్తుండగా.. 2017లో చేజారిన చాంపియన్స్ ట్రోఫీకి ఈసారి వదలొద్దని టీమ్ ఇండియా పట్టుదలతో కనిపిస్తోంది. స్పిన్ మాయ, మిడిల్ ఓవర్ల మెరుపులే కీలక పాత్ర పోషించనున్న టైటిల్ పోరులో భారత్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది.



నవతెలంగాణ-దుబాయ్

2021 ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్. భారత్, న్యూజిలాండ్ చివరగా ఓ ఐసీసీ ఈవెంట్ ఫైనల్లో పోటీపడ్డాయి. సౌథాంప్టన్‌లో జరిగిన రెడ్‌బాల్ అంతిమ సమరంలో పేస్ బలంతో న్యూజిలాండ్ టైటిల్ సొంతం చేసుకుంది. 2025 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్. నేడు భారత్, న్యూజిలాండ్ టైటిల్ పోరులో మళ్లీ పోటీపడుతున్నాయి. దుబాయ్‌లో స్పిన్‌కు మొగ్గు ఎక్కువ.. మరి నాణ్యమైన స్పిన్నర్లతో సమరానికి సై అంటోన్న టీమ్ ఇండియా ఈసారి టైటిల్‌ను ఎగరేసుకుపోతుందా? ప్రపంచ క్రికెట్ ప్రియులతో పాటు భారత క్రికెట్ అభిమానులు ఈ ఫలితం కోసం ఎదురుచూస్తున్నారు. కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజాలతో కూడిన భారత స్పిన్ దళం కివీస్‌ను గిరగిరా తిప్పేసి టైటిల్‌ను సాధించేందుకు మాయ చేయనుండగా.. న్యూజిలాండ్ సైతం కెప్టెన్ మిచెల్ శాంట్నర్ మ్యాజిక్‌పై భారీగా అంచనాలు పెట్టుకుంది. చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ ప్రయాణంలో భారత స్పిన్నర్లు 21 వికెట్లు పడగొట్టగా.. న్యూజిలాండ్ స్పిన్నర్లు 17 వికెట్లు తీసుకున్నారు. చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారత్, న్యూజిలాండ్ ఢీ నేడు.

జోరుమీదున్న భారత్ :

స్వదేశంలో ఇంగ్లాండ్‌పై (112) శతకం, చాంపియన్స్ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై (101) సెంచరీతో శుభ్‌మన్ గిల్ జోరు చూపించాడు. కానీ గ్రూప్ దశ



సాగేకొద్ది గిల్ పరుగుల వేట నెమ్మదించింది. పాకిస్థాన్‌పై 46 పరుగులు చేసిన గిల్.. కివీస్‌పై 2, సెమీస్‌లో ఆసీస్‌పై 8 పరుగులే చేశాడు. నాణ్యమైన పేస్ బౌలింగ్‌పై గిల్ అంచనాలను అందుకోలేదు. గిల్ వైఫల్యం ఇన్నింగ్స్ ఆరంభాలపై ప్రతికూల ప్రభావం చూపిస్తోంది. న్యూజిలాండ్‌పై హైదరాబాద్ వన్డేలో ద్వి శతకం బాదిన శుభ్‌మన్ ఇప్పుడు అదే ప్రత్యర్థిపై టైటిల్ పోరులో పంజా విసురుతాడని జట్టు మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి మంచి ఫామ్‌లో ఉన్నారు. పవర్‌ప్లేలో రోహిత్ శర్మ ధనాధన్ ప్రదర్శన ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెడుతోంది. ఛేదనలో విరాట్ కోహ్లిని అడ్డుకోవటం ప్రత్యర్థికి కష్టసాధ్యమే. కోహ్లి జోరును గమనంలో ఉంచుకుని న్యూజిలాండ్ భారత్‌ను తొలుత బ్యాటింగ్‌కు ఆహ్వానించినా ఆశ్చర్యం లేదు. మిడిల్ ఆర్డర్‌లో శ్రేయస్ అయ్యర్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. కెఎల్ రాహుల్, అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్య సైతం టచ్‌లోనే ఉన్నారు. లక్ష్యాన్ని ఛేదించినా, లక్ష్యాన్ని నిర్దేశించినా భారత బ్యాటింగ్ లైనప్ బలంగా కనిపిస్తోంది. బౌలర్లు సైతం అదరగొడుతున్నారు. పేసర్ మహ్మద్ షమి వికెట్ల వేటలో ముందుండి నడిపిస్తున్నాడు. హార్దిక్ పాండ్యతో కలిసి షమి కొత్త బంతితో విజృంభిస్తున్నాడు. వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా ఓవర్లను కాచుకోవటం న్యూజిలాండ్‌కు నేడు కత్తి మీద సామే.

కేన్ కొడతాడా? :

ఐసీసీ టోర్నమెంట్ల ఫైనల్స్‌లో న్యూజిలాండ్ ఆరోసారి బరిలోకి దిగుతుండగా.. కేన్ విలియమ్సన్ ఐదింటిలో భాగం అయ్యాడు. టెస్టు చాంపియన్‌షిప్ గదతో కివీస్ ఐసీసీ టైటిల్ దాహం తీర్చినయ విలియమ్సన్... వైట్‌బాల్ ఫార్మాట్‌లో మినీ ప్రపంచకప్‌ను అందుకునే అవకాశం ముంగిట నిలిచాడు. 2024 టీ20 ప్రపంచకప్ విజయంతో కోహ్లి పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికినట్టు.. కేన్ విలియమ్సన్ సైతం చాంపియన్స్ ట్రోఫీతో వన్డే ఫార్మాట్‌ను వీడ్కోలు వీడేందుకు ఎదురుచూస్తున్నాడు!. దక్షిణాఫ్రికాతో సెమీఫైనల్లో న్యూజిలాండ్ బ్యాటర్లు అదరగొట్టారు. కేన్ విలియమ్సన్‌తో పాటు రచిన్ రవీంద్ర శతక మోత మోగించారు. ఈ ఇద్దరు బ్యాటర్లు స్పిన్ సమర్థవంతంగా ఆడగలరు. భారత్‌పై మంచి రికార్డు సైతం ఉంది. దీంతో నేడు ఫైనల్లో భారత్‌కు గట్టి సవాల్ విసరటం ఖాయమే. విల్ యంగ్, డార్లీ మిచెల్, టామ్ లేథమ్ తమదైన ఇన్నింగ్స్‌లు ఆడేందుకు ఎదురుచూస్తున్నారు. గ్లెన్ ఫిలిప్స్ డెత్ ఓవర్లలో అత్యంత ప్రమాదకర ఆటగాడు. మైకల్ బ్రాస్‌వెల్, రచిన్ రవీంద్ర తోడు మిచెల్ శాంట్నర్ మాయ చేయనున్నాడు. కైల్ జెమీసన్, ఓరౌర్క్‌తో కలిసి పేస్ బాధ్యతలు పంచుకునే మరో పేసర్‌పై నీలినీడలు ఉన్నాయి. భుజం గాయంతో బాధపడుతున్న మాట్ హెన్రీ దూరమైతే ఫైనల్లో కివీస్‌కు గట్టి దెబ్బే. గ్రూప్ దశ మ్యాచ్‌లో భారత్‌పై హెన్రీ ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు.

12 ఐసీసీ టోర్నమెంట్లలో భారత్‌కు తిరుగులేని రికార్డుంది. గత 14 ఐసీసీ ఈవెంట్లలో టీమ్ ఇండియా ఏకంగా 12 సార్లు నాకౌట్ దశకు చేరుకుంది. అందులో మూడింట టైటిల్ విజయాలు సాధించింది. ఐదుసార్లు ఫైనల్స్‌లో బోల్తా పడింది.

8 ఐసీసీ చివరి 14 టోర్నమెంట్లలో న్యూజిలాండ్ ఎనిమిది సార్లు నాకౌట్ దశకు అర్హత సాధించింది. అందులో ఒక్కసారి మాత్రమే టైటిల్ సాధించగా.. ఆ ఫైనల్ ప్రత్యర్థి భారత్ కావటం గమనార్హం.

45 చాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక పరుగుల రికార్డు అందుకునేందుకు విరాట్ కోహ్లికి మరో 45 పరుగులు అవసరం. క్రిస్ గేల్ (791) అగ్రస్థానంలో నిలువగా.. కోహ్లి (746) రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. జయవర్దనె (742), శిఖర్ ధావన్ (701) టాప్-4లో ఉన్నారు.

పిచ్, వాతావరణం

చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు కొత్త పిచ్‌ను వాడటం లేదు!. భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు వినియోగించిన పిచ్‌నే నేడు టైటిల్ పోరుకు సిద్ధం చేశారు. ఈ పిచ్ బ్యాటింగ్‌కు కాస్త అనుకూలిస్తుందా లేదా అనేది చూడాలి. పేసర్లు వేగం తగ్గించి లైన్ అండ్ లెంగ్త్‌తో బంతులు వేస్తేనే పరుగుల పొదుపు, వికెట్ల వేటలో విజయం దక్కనుంది. పిచ్‌పై పగుళ్లు తేలిన తర్వాత టర్న్‌ను ఎదుర్కొంటూ పరుగులు చేయటం గగనం కానుంది. టాస్ నెగ్గిన జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. రెండో ఇన్నింగ్స్‌లో మంచు ప్రభావం లేకపోవటంతో టాస్ ప్రాధాన్యత కోల్పోయింది.

తుది జట్లు (అంచనా)

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్య, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మహ్మద్ షమి, వరుణ్ చక్రవర్తి.

న్యూజిలాండ్ : విల్ యంగ్, రచిన్ రవీంద్ర, కేన్ విలియమ్సన్, డార్లీ మిచెల్, టామ్ లేథమ్ (వికెట్ కీపర్), గ్లెన్ ఫిలిప్స్, మైకల్ బ్రాస్‌వెల్, మిచెల్ శాంట్నర్ (కెప్టెన్), కైల్ జెమీసన్, మాట్ హెన్రీ/నాథన్ స్మిత్, విలియం ఓరౌర్క్.

దక్షిణాఫ్రికాతో సెమీఫైనల్లో న్యూజిలాండ్ స్పిన్నర్లు 7 వికెట్లు పడగొట్టారు. వన్డే క్రికెట్‌లో కివీస్‌కు ఇది సంయుక్త అత్యుత్తమం. కానీ గ్రూప్ దశలో భారత్‌తో మ్యాచ్‌లో కివీస్ స్పిన్నర్లు తేలిపోయారు. ఓవర్‌కు 5.1 పరుగుల చొప్పున 128 పరుగులకు రెండు వికెట్లే పడగొట్టారు.

సమిష్టి కృషితోనే.. ఒలింపిక్స్‌లో పతకాలు!



కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ

నవతెలంగాణ-హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు సమిష్టి కృషితో కలిసి పని చేస్తేనే 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ పతకాల వేటలో ఆశించిన ఫలితాలు సాధించగలమని, 2036 ఒలింపిక్స్ ఆతిథ్యానికి భారత్ సిద్ధం కాగలదని కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు సాగిన చింతన్ శిబిరం ముగింపు సందర్భంగా రాష్ట్రాల క్రీడాశాఖ మంత్రులు, ఉన్నతాధికారులను ఉద్దేశించి మాండవీయ మాట్లాడారు. 'ఒలింపిక్స్‌లో భారత్ రాణించాలంటే.. మనం అందరం కలిసి పని చేయాలి. ప్రతిభావంతులైన క్రీడాకారులను అన్వేషించటం, నాణ్యమైన కోచ్‌లను తయారు చేయటం, అథ్లెట్ల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వటంలో సమిష్టిగా కృషి చేయాలని' మాండవీయ అన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించేందుకు పాఠశాల స్థాయిలోనే టాలెంట్ హంట్ ఆరంభం కావాలి. దేశవ్యాప్తంగా స్కూల్స్‌లో 8 కోట్ల మంది విద్యార్థులు ఉన్నారు. జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్‌ను క్రమబద్ధీకరించి.. ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించి, శిక్షణ అందించి అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దాలి. నైపుణ్యం కలిగిన కోచ్‌ల కొరత అధికంగా ఉంది. తొలుత ప్రపంచ స్థాయి శిక్షకులను తయారు చేసుకోవాలి. కోచ్‌లు, క్రీడాకారుల సంక్షేమం కోసం ఓ వ్యవస్థను రూపొందించాలని చింతన్ శిబిరంలో తీర్మానించారు. జాతీయ స్థాయి చింతన శిబిరం కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వం తరఫున క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, శాట్ చైర్మెన్ కే. శివసేనా రెడ్డి, క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, శాట్ ఎండీ సోనీబాలదేవి సహా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నవచిత్రం

మనందరి జీవితమే 'కోర్ట్'



హీరో నాని వాల్ పోస్టర్ సినిమా సమర్పించిన మూవీ 'కోర్ట్' – 'స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని రామ్ జగదీష్ దర్శకత్వం వహించారు. ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. దీప్తి గంటా సహ నిర్మాతగా వ్యవహరించారు.

ఈ చిత్రం ఈనెల 14న హోలీ పండుగ సందర్భంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్ ప్రీరిలీజ్ అండ్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ని నిర్వహించారు. డైరెక్టర్స్ నాగ్ అశ్విన్, ప్రశాంత్ వర్మ శైలేష్ కొలను, శ్రీకాంత్ ఓదెల, శౌర్యవ్, ఇంద్రగంటి మోహన కృష్ణ, దేవకట్టా ఈ వేడుకలో అతిథులుగా పాల్గొన్నారు.

నాని మాట్లాడుతూ, 'ఈ సినిమా గురించి ఒక విషయం బలంగా చెబుతున్నాను. ఈనెల 14న ఈ సినిమాని మీరు మిస్ అవ్వకండి. నా కెరీర్‌లో ఎప్పుడూ కూడా దయచేసి సినిమా చూడండి అని అడగలేదు. కానీ ఈ సినిమాకి అడుగుతున్నాను. ఇలాంటి మంచి సినిమా మీరు మిస్ అవ్వకూడదని చెబుతున్నాను. మాకేదో సక్సెస్ రావాలని కాదు. తెలుగు ప్రేక్షకులు ఇలాంటి మంచి సినిమాని మిస్ కాకూడదని చెబుతున్నాను. మీ అందరిని బతిమాలుతున్నాను. ఫ్యామిలీతో కలిసి సినిమాకి వెళ్ళండి. గొప్ప సినిమా చూశారనే ఫీలింగ్‌తో వస్తారు. ఒకవేళ సినిమా బాగోలేదనే ఫీలింగ్ వస్తే, నా హిట్ 3ని ఎవరూ చూడొద్దు. ఇంతకంటే బలంగా చెప్పలేను' అని అన్నారు.

'ఇది కూడా ఒక సూపర్ హీరో లాంటి కథ' అని ప్రియదర్శి చెప్పారు. నిర్మాత దీప్తి మాట్లాడుతూ,'జగదీష్ విజన్ స్క్రీన్ మీద ఒక పోయెట్రీ క్రియేట్ చేసింది. విజయ్ తన మ్యూజిక్‌తో మ్యాజిక్ చేశాడు. దర్శి చాలా అద్భుతంగా నటించాడు. రోషన్, శ్రీదేవి ఆడియన్స్‌కి గుర్తుండిపోతారు. ఇది చాలా బ్యూటిఫుల్ మూవీ' అని అన్నారు. 'దర్శికి 'బలగం' కంటే ముందు ఈ కథ చెప్పాను. ఇది నాని ప్రోడక్ట్ కావడం చాలా ఆనందంగా ఉంది. ఇదొక గొప్ప లెగసీ. ఆయన నమ్మిన విధానం అద్భుతం. అది చాలా బాధ్యత పెంచింది. 14న ఆ నమ్మకాన్ని తిరిగి ఇచ్చేస్తాను. కోర్టు మన అందరికీ జీవితం' అని డైరెక్టర్ రామ్ జగదీష్ చెప్పారు.

భిన్న కథతో 'కర్మ స్థలం'



రాయ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై శ్రీనివాస్ సుబ్రహ్మణ్య నిర్మాణంలో రాకీ షెర్మన్ తెరకెక్కించిన చిత్రం 'కర్మ స్థలం'.

ఈ సినిమాలో బిగ్ బాస్ ఫేమ్ అర్చన(వేద), మితాలి చౌహాన్, వినోద్ అల్వా, కలకేయ ప్రభాకర్, బాలగం సంజయ్, నాగ మహేష్, దిల్ రమేష్, చిత్రం శ్రీను ముఖ్య పాత్రలు పోషించారు. పాన్ ఇండియా రేంజ్‌లో ఈ సినిమా రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర మోషన్ పోస్టర్‌ను హీరో ఆకాష్ పూరి రిలీజ్ చేశారు. మరో హీరో విజయ్ శంకర్ కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు.

ఆకాష్ పూరి మాట్లాడుతూ,'టైటిల్ చాలా బాగుంది. మోషన్ పోస్టర్ కూడా బాగుంది. చెప్పాలంటే నేను కూడా అమ్మవారి భక్తుడిని. ఇలా అమ్మవారి గురించి సినిమా రావడం సూపర్ ఎగ్జైటింగ్. ఈ మధ్య 'హనుమాన్, కార్తికేయ, కాంతారా' ఇలాంటి సినిమాలని ఆడియన్స్ బాగా సపోర్ట్ చేస్తున్నారు. ఆ కోవలోనే ఉన్న ఈ సినిమా కచ్చితంగా మంచి విజయం సాధిస్తుంది' అని తెలిపారు. 'సనాతన ధర్మం గురించి చెప్పే సినిమా ఇది. రాకీ ఈ సినిమాని అద్భుతంగా తెరకెక్కించాడు' అని ప్రొడ్యూసర్ యువరాజ్ చెప్పారు. డైరెక్టర్ రాకీ మాట్లాడుతూ,'మనం ఎలాంటి పండగ వచ్చిన ఎంజాయ్ చేస్తూ ఉంటాం. దాని వెనకాల ఒక హిస్టరీ, వార్ ఇలా చాలా ఉన్నాయి. ఇందులో ఒక మంచి లైన్ చెప్పాను, అదే మహిషాసుర మర్దిని.ఇది తప్పకుండా మిమ్మల్ని మెప్పిస్తుంది' అని అన్నారు.



విజయశాంతి, కళ్యాణ్‌రామ్

'అర్జున్ S/O వైజయంతి'

నందమూరి కళ్యాణ్ రామ్ నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్‌లో విజయశాంతి ఐపీఎస్ ఆఫీసర్‌గా పవర్ ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్లపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు.

మహిళా దినోత్సవం సందర్భంగా మేకర్స్ ఈ మూవీ నుంచి ఇంపాక్ట్ ఫుల్ టైటిల్ 'అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి'గా రివీల్ చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ కళ్యాణ్ రామ్, విజయశాంతి పాత్రలని ఇంటెన్స్ డైనమిక్‌గా ప్రజెంట్ చేస్తోంది. ఇందులో సాయి మంజ్రేకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సోహైల్ ఖాన్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. సినిమా ఇప్పటికే టాకీ పార్ట్ పూర్తి చేసుకుంది. త్వరలోనే రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేయడానికి మేకర్స్ సిద్ధంగా ఉన్నారు. శ్రీకాంత్, యానిమల్ పృథ్వీరాజ్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: ప్రదీప్ చిలుకూరి, నిర్మాతలు: అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, డీవోపీ: రామ్ ప్రసాద్, ఎడిటర్: తమ్మిరాజు, సమర్పణ: ముప్పా వెంకయ్య చౌదరి, స్క్రీన్ ప్లే: శ్రీకాంత్ విస్సా, ఆర్ట్ డైరెక్టర్: బ్రహ్మ కడలి, యాక్షన్: రామకృష్ణ, పీటర్ హెయిన్.

న్యాయం కోసం..



'మల్లేశం, 8 ఏఎమ్, మెట్రో' చిత్రాలతో ప్రశంసలు పొందిన దర్శకుడు రాజ్ ఆర్ నిజమైన సంఘటనల నుండి ప్రేరణ పొందిన మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్ '23'తో వస్తున్నారు.

స్టూడియో 99 నిర్మించిన ఈ చిత్రంలో తేజ, తన్మయి ప్రధాన పాత్రలు పోషించారు. వెంకట్ సిద్దారెడ్డి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. ఈ సినిమాని రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా డిస్ట్రిబ్యూషన్ చేస్తుంది. తాజాగా మేకర్స్ టీజర్‌ని రిలీజ్ చేశారు.

దర్శకుడు రాజ్ రాచకొండ మాట్లాడుతూ,'మూడు విభిన్న సంఘటనల్లో జరిగిన క్రైమ్‌తో చనిపోయిన వారు 23 మంది. అందుకే ఈ సినిమాకి ఈ టైటిల్ పెట్టాం. ఈ సినిమా హ్యూమన్ రైట్స్ వైపు ఉంటుంది. న్యాయం దొరకని వారి తరఫున ఉంటుంది. తప్పుని తప్పని తెలుసుకోవడం ఈ సినిమా ఉద్దేశం. ఈ సినిమా హింసకి వ్యతిరేకంగా తీసిన సినిమా. నేను జరిగినదే చూపించాను. బీనా చెప్పిన చాలా విషయాలు ఇందులో చూపించాను. మూడు ఘటనలు జరిగాయి. చాలా మంది చనిపోయారు. అయితే చంపిన వారందరికీ సమానంగా శిక్ష పడిందా లేదా? అనేది ప్రశ్న. జైలుకి వెళ్ళిన తర్వాత మనిషి పరివర్తనని కూడా సినిమాలో చూపించాం' అని అన్నారు.

'రాజ్ ఫోన్ చేసి జైలు గురించి ఒక కథ రాస్తున్నానని చెప్పాడు. నేను చెప్పిన ఎక్స్‌పీరియన్స్‌ని చాలా సీరియస్‌గా రాసుకున్నాడు. జైలు వేరే లోకం, వేరే ప్రపంచం. మన మాటలతో మార్పు తీసుకొచ్చే అవకాశం. అక్కడ చాలా ధైర్యంగా మాట్లాడాలి. ఇక్కడ చాలామంది మార్పు చెందిన మనుషులు ఉన్నారు. నా మాటలతో చాలామంది జీవితంలో మార్పు తీసుకురావడం చాలా ఆనందంగా ఉంది. రాజ్ విజన్ చాలా ఇంపాక్ట్ ఫుల్‌గా ఉంది' అని బీనా చెప్పారు.



విశ్వ కరుణ్

సరికొత్త ప్రేమ కథను చూస్తారు

హీరో కిరణ్ అబ్బవరం నటించిన కొత్త సినిమా 'దిల్ రూబా'. ఈ సినిమాలో రుక్సర్ ధిల్లాన్ హీరోయిన్. ఈ చిత్రాన్ని శివమ్ సెల్యులాయిడ్స్, ప్రముఖ మ్యూజిక్ లేబుల్ సారెగమ తమ నిర్మాణ సంస్థ అయినటువంటి ఏ యాడ్లీ ఫిలిం సంయుక్తంగా నిర్మించాయి.

రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మాతలు. విశ్వ కరుణ్ దర్శకుడు. ఈ సినిమా ఈనెల 14న హోలీ పండుగ సందర్భంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో దర్శకుడు విశ్వకరుణ్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- తన తప్పు లేనప్పుడు సారీ ఎందుకు చెప్పాలనుకుంటాడు హీరో. ఇలాంటి వ్యక్తిత్వం వల్ల తనతో ఉన్నవారికి ఇబ్బంది ఉండొచ్చు. ఇందులో హీరో కిరణ్ చేసిన సిద్ధు క్యారెక్టర్ కూడా తన వ్యక్తిత్వం విషయంలో కాంప్రమైజ్ కాడు. క్యారెక్టర్‌ను నమ్ముకుంటాడు. దాని వల్ల అతని లైఫ్‌లో ఇబ్బందులు వస్తాయి. అవేంటి అనేది వెండితెరమీద చూడాల్సిందే.
- ప్రేమించిన అమ్మాయితో విడిపోయిన తర్వాత ఆ లవర్‌ను శత్రువులా చూస్తుంటారు. కానీ ప్రేమ కంటే ముందు వారి మధ్య ఉండేది స్నేహమే. అదే స్నేహాన్ని విడిపోయిన తర్వాత కూడా పంచవచ్చు. బాగున్నావా అని ఫోన్ చేసి, మన ఎక్స్ లవర్‌ను అడగటంలో తప్పులేదు. ఈ కథలో ఇలాంటి ఎలిమెంట్స్ ఉంటాయి. సంగీత దర్శకుడు సామ్ సీఎస్ బ్యూటిఫుల్ సాంగ్స్ ఇచ్చారు. బీజీఎం మా మూవీకి ఆకర్షణగా నిలుస్తుంది.

లైంగిక వేధింపులపై విప్లవాత్మక ప్రయత్నం



లైంగిక వేధింపులపై విప్లవాత్మకమైన, వినూత్నమైన ప్రయత్నమే 'కీప్ ది ఫైర్ అలైవ్' అని, ఇది 1 నిముషం 25 సెకండ్ల షార్ట్ ఫిల్మ్ మాత్రమే కాదు అందరిని ఆలోచింపజేసే అద్భుతమైన దృశ్య కావ్యం అని మేకర్స్ అన్నారు. కె ప్రఫుల్ చంద్ర దర్శకత్వంలో తెరకెక్కిన ఈ షార్ట్ ఫిల్మ్‌ను కథానాయిక సంయుక్త ప్రెజెంట్ చేయడం విశేషం.

ఈ సందర్భంగా రచయిత, దర్శకుడు కే ప్రఫుల్ చంద్ర మాట్లాడుతూ,'మనకి లైంగిక వేధింపులకు సంబంధించిన విషయాలు బాధతో పాటు కోపాన్ని కలిగిస్తాయి. వాటిని అధిగమించాలంటే కఠినమైన చట్టాలు తీసుకొస్తే సరిపోతుందా, అంటే కచ్చితంగా కాదు. వీటి కన్నా స్పృహ అత్యంత ముఖ్యమైనది అని తెలిపే షార్ట్ ఫిల్మ్ ఇది. ఇలాంటి గొప్ప ప్రయత్నానికి సంయుక్త తోడు రావడం అద్భుతం. ఆమె వాయిస్ ఓవర్‌లో ప్రతి పదం ఒక అగ్ని కణంలా ఉంటుంది. ఈ షార్ట్ ఫిల్మ్‌ని మళ్లీ మళ్లీ చూసేలా ఆమె గొంతు మ్యాజిక్ చేసింది. అలాగే సంయుక్త కూడా ఆదిశక్తి అనే ఫౌండేషన్‌ను స్థాపించి మహిళా శక్తిని ప్రపంచానికి తెలియజేయాలని సంకల్పంతో అడుగులు వేస్తోంది. అందుకే మా షార్ట్ ఫిలిం సంయుక్త హృదయానికి అత్యంత చేరువైంది. కచ్చితంగా అందరం కలిసి మార్పు కోసం ఒక అడుగు వేస్తే, సమాజంలో స్త్రీలపై ఎలాంటి దాడులు జరగవు. మా షార్ట్ ఫిలిం కచ్చితంగా ఒక మేలుకొలుపు' అని తెలిపారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.